LABHISHETTY MAHESH
Learning Motivation

మార్పుకోసం


100 వ్యక్తిత్వ వికాస కథలు



LABHISHETTY MAHESH
Author - Trainer

మా గురువు గారికి...

అంకితం



నా జీవితంలో రెండు భాగాలు
మొదటి భాగం గంపా నాగేశ్వర్‌రావు గారిని కలవక ముందు
రెండవ భాగం వారిని కలిసిన తరువాత అని
విభజించే విధంగా మారిపోయింది నా జీవితం.

ట్రైనింగ్‌లో ఓనమాలు నేర్పిన
మాస్టర్ ట్రైనర్ గురువు గారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.
వారి శిక్షణ అద్భుతం.

పౌరునిగా ఎలాంటి బాధ్యత కలిగి ఉండాలి సమాజానికి
మన యొక్క పరిజ్ఞానాన్ని ఎలా అందించాలి
అనే మెలకువలు తెలియచేసి ఎన్నో అవకాశాలు కల్పించిన
గురువు గారు గంపా నాగేశ్వర్ రావు గారికి
ఈ పుస్తకం అంకితం...

విజయోస్తు...



లాబిశెట్టి మహేష్ కుమార్ మా ఇంపాక్ట్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్. Effective Public Speaking కోర్సులో భాగంగా ఒకరోజు Art of Story Telling అనే టాపిక్ చెప్పడం జరుగుతుంది. ఈ టాపిక్ పై మంచి పట్టు ఉన్న ట్రైనర్ లాబిశెట్టి మహేష్.

ఇటువంటి విలువైన మరియు ప్రేరణాత్మకమైన పుస్తకాన్ని మా ట్రైనర్ రూపొందించినందుకు నిజంగా సంతోషిస్తున్నాను. వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసుకోవడంలో పాఠకులకు ఉపయోగకరంగా ఉంటుంది. పాఠశాలలలో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించే ట్రైనర్స్ అందరికీ ఈ పుస్తకం చాలా ఉపయుక్తంగా ఉంటుంది. స్వీయ అవగాహన, మానసిక ధైర్యం ఓపిక కలిగి ఉండటం మొదలైన అంశాలను వివరించారు.

ఇప్పటివరకు ఈ టాపిక్ పై 100కు పైగా సెషన్స్ ఇవ్వడం జరిగింది. ట్రైనర్స్‌కి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాస, ప్రేరణాత్మక కథలను సేకరించి ఒక పుస్తకంగా తయారుచేసి మీ ముందుకు తెస్తున్నాడు. అతని అభిరుచికి, సంకల్పానికి అభినందిస్తున్నాను. భవిష్యత్తులో మరిన్ని రచనలు చేయాలని ఆశీర్వదిస్తున్నాను.

ఇట్లు
మీ గంపా నాగేశ్వరరావు
మాస్టర్ మోటివేటర్,
ఫౌండర్, ఇంపాక్ట్ ఫౌండేషన్.

మార్పుకు ఆహ్వానం...



జీవితంలో ఎన్నో మార్పులు తీసుకురాగలిగిన శక్తి ఒక్క కథకే ఉంది. చిన్నప్పుడు చందమామ కథలవచ్చు, పేదరాశి పెద్దమ్మ కథలవచ్చు ఎన్నో కథల ద్వారా గొప్ప విలువల్ని నేర్పించారు అలా నా స్నేహితుడు లాభిశెట్టి మహేష్ కొత్తగా అలోచించి జీవితానికి కావాల్సిన దాదాపుగా 100 వ్యక్తిత్వ కథలను మనకు అందచేస్తున్నాడు.

జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలంటే విలువలు ఎంతో ముఖ్యమని అటువంటి విలువలను గొప్ప కథల ద్వారా నేర్పాలని చెప్పి వంద రకాల వ్యక్తిత్వ వికాస కథలను తీసుకొని ఎంతో మంది జీవితాల్లో మార్పు తీసుకొని రావాలనే సంకల్పంతో ఈ పుస్తకం రాయడం జరిగింది. పుస్తకం రాయాలన్న అతని ఆలోచనను మెచ్చుకుంటూ అతను ఇంకా ఎంతో గొప్ప స్థాయికి ఎదగాలని చెప్పి మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

మీ

సుధీర్ సంద్ర

ఫౌండర్: సూపర్ స్కూల్



MESSAGE

my message about book - I am thrilled to introduce this remarkable book to all the trainers out there who are passionate about helping young individuals develop their skills and succeed in their personal and professional lives. This book is a treasure trove of inspiring stories, insightful perspectives, and practical guidance that will undoubtedly enrich your training programs and help you become a more effective and impactful trainer.

As someone who has spent decades working in the field of education and training, I can attest to the importance of attitude, personality development, and motivation in shaping the trajectory of young individuals. These intangible qualities are often the deciding factor in whether someone achieves their goals and reaches their full potential. That is why I believe this book is an invaluable resource for trainers who are committed to fostering these qualities in their trainees.

The stories in this book are drawn from a diverse range of sources and offer unique insights into how individuals from all walks of life have overcome challenges and achieved success through their attitudes and personalities. These stories are sure to inspire and motivate your trainees, and provide them with tangible examples of how they too can succeed by adopting a positive attitude and developing their personality.

In addition to the inspiring stories, this book also contains practical guidance and exercises that trainers can use to help their trainees develop their attitudes and personalities. Whether you are a seasoned trainer or just starting out, these tools and techniques will help you create engaging and effective training programs that will make a real difference in the lives of your trainees.

I highly recommend this book to all trainers who are passionate about helping young individuals develop their skills and achieve their goals. It is an inspiring and practical resource that will undoubtedly enhance your training programs and help you become a more effective and impactful trainer.

Naredra Eerabathini

NLP Master Trainer, Mumbai

నా మాట

ఈ వంద సందేశాత్మక కథలకు స్వాగతం పుస్తక రచయితగా ఈ కథలను మీతో పంచుకోవడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను టీచర్లకు, ట్రైనర్లకు మరియు పది మందికి ఏదైనా బోధించే వక్తకు చాలా ఉపయుక్తమైనది. ప్రతి కథ ఎంతో శ్రద్ధగా రూపొందించబడినది. అదేవిధంగా ప్రతి కథ వినోదం విజ్ఞానం మరియు స్ఫూర్తిని ఇవ్వడానికి ఉద్దేశించబడినది. ఇందులో కొన్ని చిత్ర విచిత్ర కథలను కూడా మీరు గమనిస్తారు. కొన్ని కథలు నిజ జీవిత అనుభవాలతో నిండి ఉన్నవి. కొన్ని పూర్తిగా ఊహాజనితమైనవి.

ప్రతి కథలోని నీతిని గుర్తించి దానిని మీ విద్యార్థులకు, ప్రేక్షకులకు అర్థమయ్యే విధంగా మీదైన శైలిలో వివరించడానికి ప్రయత్నం చేయండి.

ఈ పుస్తకంలోని ప్రతి కథ మిమ్మల్ని మరొక ప్రదేశానికి తీసుకెళ్తుంది ఈ కథల సేకరణను సమయం వెచ్చించి చదువుతూ ఆనందించండి. కాబట్టి ఇంకెందుకు ఆలస్యం ఈ వంద కథల సంకలనంలోకి వెళ్లి మీకోసం ఎదురు చూస్తున్న ఎన్నో అద్భుతమైన పాత్రలను కలవండి. ఈ 100 సందేశాత్మక కథల సంకలనంలోకి ఇదే నా స్వాగతం సుస్వాగతం.

- లాభిశెట్టి మహేష్

కృతజ్ఞతలు

మార్పు కోసం 100 కథలు అనే పుస్తకాన్ని రూపొందించడానికి సహకరించిన వారందరికీ నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీ సహకారం లేకుంటే ఈ పుస్తకం సాధ్యమయ్యేది కాదు. గత నాలుగు సంవత్సరాలుగా నన్ను ఆదరిస్తున్న గురువుగారు గంపా నాగేశ్వరరావు గారికి, ఇంపాక్ట్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మరియు ఇంపాక్ట్ ట్రైనర్లకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఈ పుస్తకం గురించి ముందు మాట తెలియజేసిన గురువుగారు గంపా నాగేశ్వరరావు గారికి మరియు సుధీర్ సంద్ర గారికి, నరేంద్ర గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. పుస్తకాన్ని రాయడానికి ప్రేరేపించిన తోటి ట్రైనర్లకు నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకంలోని కథలను, ఎన్నో వ్యక్తిత్వ, ఆధ్యాత్మిక పుస్తకాల నుండి సేకరించడం జరిగింది. ఆ పుస్తక రచయితలను శతకోటి వందనాలు..

ఈ పుస్తకం రూపుదిద్దడానికి శ్రీ డిజిటల్ అంకం భూమేష్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ పుస్తకం రాయడానికి సహకరించిన నా కుటుంబ సభ్యులకు స్నేహితులకు నా సహ ఉద్యోగులకు ప్రిన్సిపల్ గారికి అందరికీ కూడా ధన్యవాదాలు. చివరగా నా మొదటి పుస్తకము "అ ఆ ఇ ఈ లు అమీ జీవితాన్ని మార్చివేస్తాయి" అనే పుస్తకాన్ని ఆదరించిన పాఠకులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, ఇలాంటి మరిన్ని రచనలను చేయడానికి మీరందరు మరింత సహకారాన్ని భగవంతుడు మరింత శక్తి నివ్వాలని కోరుకుంటూ...

మీ

లాబిశెట్టి మహేష్

1. బాహుబలి లాంటి అద్భుత కథ

బుద్ధిమంతుడు తన యజమానికి సాష్టాంగా ప్రణామం చేసి ఆయన ఆశీస్సులు పొంది సరుకు ఉన్న ఓడతో సముద్రయానం ప్రారంభించాడు. కొన్ని రోజుల పాటు ఓడ నిరాటంకంగా సముద్ర జలాల మీద పయనించింది. హఠాత్తుగా గాలివాన వీయసాగింది. ఆ గాలివాన క్షణక్షణానికి ఉధృతమై ఓడను అటుఇటు కుదిపేయసాగింది. కాసేపటికి ఆ ఓడ రెండుగా ముక్కలై సముద్రంలో మునిగిపోయింది. ఓడలో ఉన్నవారందరూ సరుకులతో సహా ఆ అనంత జలరాశిలో మునిగిపోయారు. అదృష్టవశాత్తు బుద్ధిమంతుడు మాత్రం ముక్కలైన ఓడకు గల పెద్ద కొయ్యదుంగను దొరకపుచ్చుకొని దాని మీద తేలుతూ రాత్రంతా నానా అగచాట్లు పడి ఎట్టకేలకు మర్నాటి ఉదయం ఒక దీవి ఇసుక తీరాన్ని చేరుకున్నాడు.

ఇసుక తీరంలో కూర్చుని తన దయనీయ స్థితిని తలచుకొని ఏడ్చాడు. నేను సర్వం కోల్పోయాను. నేను ఎందుకు జీవించాలి అంటు తలచుకొని విలపించసాగాడు.

ఇలా విలపిస్తుండగా అక్కడ ఊహించని ఒక సంఘటన జరిగింది. అతడివైపు ఊరేగింపుగా కొందరు రాసాగారు. మంగళవాయిద్యాలు వినిపించాయి. రాజు గారికి స్వాగతం.. రాజు గారికి జై అంటూ నినాదాలు కూడా వినిపించాయి. ఇంతలో ఊరేగింపు బుద్ధిమంతుడి దగ్గరకు వచ్చేసింది. ఏనుగు అతని మెడలో మాలవేసి, అతణ్ణి తన తొండంతో పైకెత్తి అంబారీలో కూర్చోబెట్టింది. ఆ తర్వాత వారంతా బుద్ధిమంతుణ్ణి రాచమర్యాదలతో ఊరేగింపుగా అంతఃపురానికి తోడ్కొని వెళ్లారు. సింహాసనం మీద అధిష్ఠింపజేసి ఈ క్షణం నుండి మా దీవి రాజు మీరే అని ప్రకటించారు. మంత్రిని పిలిచి ఈ దీవికి నాకు ఎటువంటి సంబంధం లేదే నన్ను వీళ్ళు రాజు అని సంబోధిస్తున్నారెంటి? నాకు ఏమీ అర్థం కావడం లేదు. దానికి మంత్రి 'మా

దీవికి ఒక ఆనవాయితీ ఉంది. ఈ దీవికి అనాథగా వచ్చిన వారిని రాజుగా చేస్తాం. ఇప్పుడు మీరే ఈ దీవికి రాజు' ఇంతకు ముందు ఈ దీవికి రాజు లేనే లేడా? ఉండేవాడు ఇప్పుడు అయన ఎక్కడ? ఇలా రాజైన వ్యక్తి ఈ దీవికి పదేళ్లు మాత్రమే రాజుగా ఉండాలి. తర్వాత ఆ వ్యక్తి దూరంలో ఉన్న ఒక దీవిలోకి తీసుకెళ్లి వదిలేస్తాం. ఇంతకు ముందు రాజులు అంతా ఆ దీవిలో జీవిస్తున్నారా? మంత్రి: ఆ దీవిలో ఎలా జీవించి ఉంటారు. వాళ్లను అక్కడ వదిలివేయగానే అక్కడ సంచరిస్తున్న క్రూర మృగాలు వారిని చంపి తినేస్తాయి కదా! నన్ను కూడా అలా వదిలివేస్తే క్రూర మృగాలు నన్ను చంపేస్తాయా? అవును మీరు ముందు జాగ్రత్తలు తీసుకోకపోతే మీకు అదే గతి పడుతుంది అన్నాడు మంత్రి.


ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి అని అడిగాడు. మీరు ఇప్పుడు ఈ దీవికి రాజు కాబట్టి మీ ఆజ్ఞ ఏదో అది వెంటనే నెరవేర్చబడుతుంది.

ఆ దీవికి సైనికులను పంపించి అక్కడ సంచరిస్తున్న క్రూర మృగాలను వేటాది అంతం చేయమనండి. తర్వాత ఆ దీవికి ఇక్కడ జనులను పంపించి అరణ్యములను కొట్టించి జనులు జీవించడానికి అనువుగా ఆ దీవిని మార్పించండి. తర్వాత ఆ దీవిలో సగం జనాభా వలసపొమ్మని ఆజ్ఞ జారీ చేయండి. దీని వల్ల అక్కడ కూడా రాజ్యం ఏర్పడుతుంది. 5 సంవత్సరాల తర్వాత విడిచి పెడితే ఆ రాజ్యానికి మీరు రాజు అయిపోగలరు.


ఈ ఆలోచన ముందున్న రాజులకు చెప్పలేదా? చెప్పినా కానీ కార్యాచరణలో పాటించలేదు. అందుకు బదులు తప్పతాగుతూ స్త్రీ వ్యామోహానికి బానిసలై కాలాన్ని వృథా చేసుకున్నారు. నేను అలా చేయను. మీరు చెప్పిన యోచనను అక్షర సత్యం చేస్తాను. మంత్రి మీరు ఈ ఐదేళ్ల కాలాన్ని సక్రమంగా వినియోగిస్తే కచ్చితంగా మీరు ఆ దీవి రాజుగా అయిపోతారు.

అలాగే చేశాడు బుద్ధిమంతుడు.

2. ఐకమత్యం గొప్పది




మల్లేష్ ద్రాక్ష పళ్లను కొనడానికి మార్కెట్‌కి వెళ్లాడు. కిలో ద్రాక్ష పళ్ళు ఎంత అని అడగగా గుత్తిలో ఉన్నవి కిలో ద్రాక్ష రూ.80 అని చెప్పాడు. విడివిడిగా ఉన్న ద్రాక్ష కిలో 30 రూపాయలు అని చెప్పాడు. ఎందుకు ధర తక్కువ అని అడిగాడు. ఇవి మంచివే కానీ గుత్తి నుండి విడిపోయాయి. కనుక ధర తక్కువ అని చెప్పాడు. అదే విధంగా సమాజం, సంఘం మరియు కుటుంబం నుండి విడిపోతే మన జీవితం కూడా సగాని కన్నా తక్కువ పడిపోతుంది. కాబట్టి కుటుంబం సంఘం, సమాజంతో మరియు మిత్రులతో కలిసి ఐకమత్యంగా ఉండాలి. ఒక వ్యక్తిగా చేయలేని పనిని సంఘంగా సాధించవచ్చు. వ్యక్తి ఉన్నత స్థితికి ఎదగాలంటే అనుభవజ్ఞుల సలహాలు పాటించడం అవసరం. పెద్దలు జీవితాన్ని కాచి వడపోసి ఉంటారు. కాబట్టి వాళ్లు చెప్పినవి ఆచరణలో పెట్టడం మంచిది.



ఇచ్చిందే పొందుతాము : మనం ఏమి చేసినా దాని ఫలితం మనకు ప్రతిఫలంగా వస్తుంది. మనం మంచి చేస్తే దాని ఫలితం పాజిటివ్‌గా ఉంటుంది. మనం ఎవరికైనా చెడు చేస్తే దాని ఫలితం నెగెటివ్‌గా ఉంటుంది.

3. అద్భుత శక్తి ఎక్కడ దాచేద్దాం

బ్రహ్మ మనిషిని తయారు చేశాడు. అన్ని తెలివితేటలు సకల సామర్థ్యాలు ఇచ్చాడు. ధైర్యం, సాహసం, నమ్మకం, ముందు చూపు, ఆత్మ విశ్వాసం అన్నీ మనిషిలో నింపాడు. ఆ తర్వాత బ్రహ్మకి భయం పట్టుకుంది. వీడు



కాలాంతకుడు, దేవాంతకుడు అయిపోతాడేమో అని, కాబట్టి వాడి బలాన్ని మొత్తాన్ని వీడికి తెలియకుండా దాచేయాలని అనుకున్నాడు. అప్పుడు డేగ నేను దాన్ని ఆకాశంలో దాచేస్తాను. మనిషి ఏదో ఒక రోజు ఆకాశాన్ని జయిస్తాడు. పోని నీటి అడుగున దాచేస్తాను అంది చేప. మనిషి ఏదో ఒక రోజు నీటిని జయిస్తాడు. నేల పొరల్లో దాచేస్తాను మనిషి నేలను చీల్చి మరీ సాధిస్తాడు. కోతి సర్వశక్తులను మనిషి లోపలే దాచేద్దాం అంది. భేష్ మనిషి అన్ని చోట్లకు వెళ్తాడు. అన్నింటిని జయిస్తాడు. కాని తన లోపలికి వెళ్లలేడు. తనను తాను జయించలేడు. కాబట్టి అక్కడ దాచేద్దాం.


4. ఎవరు అదృష్టవంతులు

ప్రయాణికులతో పూర్తిగా నిండి రద్దీగా ఉన్న బస్సు ఒక అడవి గుండా ఘాటు రోడ్డుపై ప్రయాణిస్తుండగా ఆకస్మాత్తుగా వాతావరణం మారిపోయి భయంకరమైన ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడి కుండపోత వర్షం ప్రారంభమైంది. ప్రయాణికులందరూ చూస్తుండగానే 50 అడుగుల దూరంలో ఒక చెట్టుపై పిడుగు పడింది. డ్రైవర్ ఆపేశాడు. మళ్లీ బస్సు ప్రారంభమైంది ప్రయాణికులలో భయం వేస్తుంది. 2 కిలో మీటర్లు వెళ్లగానే మరో పిడుగు బస్సుకు 40 అడుగుల దూరంలో పడింది. ఇలానే మూడుసార్లు జరిగింది. భయం తారాస్థాయికి చేరింది. ఏడుపులు, అరుపులు. ప్రయాణికులలో ఒక పెద్ద మనిషి మనలో ఒకరికి పిడుగు ద్వారా మరణం రాసిపెట్టి ఉన్న వ్యక్తి

ఎవరో ఉన్నారు. అతని కర్మ మనందరికి చుట్టుకుంటే మనం కూడా అతనితో పాటు చావాల్సి వస్తుంది. ఒక్కొక్కరు దిగి వెళ్లి అక్కడ ఉన్న చెట్టును తాకి వచ్చి బస్సులో కూర్చోండి అని చెబుతాడు. అందరూ వెళ్లి చెట్టును తాకి వస్తారు. ఒక వ్యక్తి మిగిలాడు. అతనివైపే అందరూ కోపంగా.. అసహ్యంగా చూడసాగారు. అతను వెళ్లకపోతే "నీ వల్ల మేమంతా మరణించాలా" అని బలవంతంగా పంపించారు. ఆ వ్యక్తి వెళ్లి చెట్టుని ముట్టుకున్నాడు. వెంటనే పెద్ద శబ్ధంతో పిడుగు పడింది. కానీ పిడుగు పడింది మాత్రం ఆ వ్యక్తిపై కాదు బస్సుపై పడింది. నిజానికి ఆ వ్యక్తి బస్సులో ఉండడం వల్లనే ఇంత వరకు ఆ బస్సుకి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

మన పుణ్యఫలం మన తల్లిదండ్రులది కావచ్చు. జీవిత భాగస్వామిది కావచ్చు. మన శ్రేయస్సు కోరే స్నేహితులది కావచ్చు. బాగుండటం అంటే బాగా ఉండడం కాదు.. అందరితో కలిసి ఆనందంగా ఉండడం.

5. మాయ బాక్స్



హాస్టల్లో ఉంటూ చదువుకుంటుంది హరిత. పరీక్షలు దగ్గరకు వచ్చే కొద్ది తన యొక్క ప్రిపరేషన్ని కూడా వేగవంతం చేస్తుంది హరిత. ఇలా పరీక్షలకు ప్రిపేర్ అవుతూ ఉండగా పరీక్షలలో తాను చదివిన అంశాలు గుర్తుకు వస్తాయా? రావా? అనే సందిగ్ధం హరితకు కలుగుతుంది. అమ్మతో ఫోన్లో మాట్లాడుతున్నప్పుడు ఈ విషయాన్ని అమ్మకు చెప్పడం జరుగుతుంది అమ్మ అంటుంది దగ్గరలో ఒక గురువుగారు వచ్చారు వారిని అడిగి సలహా తీసుకుందాం, ఒకసారి ఇంటికి రా అంటుంది అమ్మ. హాస్టల్ నుండి బ్యాగు

తీసుకుని ఇంటికి బయలుదేరుతుంది హరిత. తల్లి కూతుర్లు కలిసి గురువుగారిని కలవడానికి వెళ్లడం జరిగింది. తమలాగే వారి సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన వారితో పెద్ద క్యూ లైన్ ఉంది. చాలా సేపటి తర్వాత సమయం వచ్చింది గురువుగారిని కలవడానికి. గురువుగారిని కలిసి తమ యొక్క సమస్యను విన్నవించటం జరిగింది. చదివిన విషయాలు పరీక్షలు రాసేటపుడు గుర్తుకు వస్తాయా లేదా అని అనుమానంతో శ్రద్ధగా చదవలేక పోతున్నాను అని హరిత చెప్పింది.

ఇది విని గురువుగారు లోపలికి వెళ్లి ఒక చక్కని బాక్సు తీసుకుని రావడం జరిగింది. ఆ బాక్స్ ను హరితకి ఇస్తూ దీనిని ప్రతి రోజు కూడా నువ్వు ఎగ్జామ్ కి వెళ్లే ముందు తాకి నమస్కరించి ఎగ్జాం కి వెళ్ళు నీకు అంతా మంచి జరుగుతుంది అని చెప్పడం జరిగింది. అలాగే అని చెప్పి గురువు గారి ఆశీర్వాదం తీసుకొని హాస్టల్ కి వెళుతుంది. పరీక్షల సమయం రానే వచ్చింది ప్రతిరోజు పరీక్షకు వెళ్లే ముందు ఆ బాక్స్ ని తాకి నమస్కరించి వెళ్తుంది. ఇలా అన్ని పరీక్షలను రాయటం జరుగుతుంది. తర్వాత సెలవులలో ఇంటికి వెళ్తుంది ఫలితాలు విడుదలయ్యే రోజు రాని వచ్చింది తన యొక్క ఫలితాలను చూసుకోడానికి ఇంటర్నెట్ సెంటర్ కి హాల్ టికెట్ నంబర్ తీసుకొని వెళుతుంది.

మెమో ప్రింట్ వస్తుంది... వావ్ అద్భుతమైన మార్పు రావడం జరుగుతుంది. తల్లిదండ్రులకు చెప్పి స్నేహితులతో పంచుకొని చాలా ఆనందపడుతుంది హరిత. ఈ విషయాన్ని చెప్పడానికి గురువుగారి దగ్గరికి వెళ్లడం జరుగుతుంది. తమరు ఇచ్చిన బాక్స్ వల్ల మంచి ఫలితాలు వచ్చాయని ఈ బాక్స్ మీ దగ్గర ఉంచండి, మళ్ళీ పరీక్షల సమయంలో నేను తీసుకు వెళ్తాను అని చెప్పడం జరుగుతుంది హరిత.

అప్పుడు కావాలంటే మళ్ళీ ఇంకొక బాక్స్ నేను ఇస్తాను కానీ ఆ బాక్స్ లో ఏముందో చూడు అని చెప్పడం జరుగుతుంది గురువుగారు. ఆ బాక్స్ ని ఓపెన్ చేయడానికి చాలా సంకోచిస్తుంది హరిత. హరిత బాక్స్‌ని ఓపెన్ చేయగానే ఆ బాక్స్ లో హరిత పేరు రాసినటువంటి చక్కని పేపర్ ఉంటుంది. అంటే దీని అర్థం మనలోపలనే చాలా శక్తి ఉంది దానిని గుర్తించి సాన పెట్టడం మాత్రమే మనం చేయాల్సింది.

6. భయంతో వణికింది విత్తనం

అర్పిత ఇంటి వెనుక ఉన్న పెరట్లో ఆడుకుంటుంది. అక్కడికి వచ్చిన వాళ్ల అమ్మమ్మ రెండు విత్తనాలు ఇచ్చి అర్పితకు వీటిని చక్కగా నాటమని చెప్పింది. అమ్మమ్మ చెప్పినట్లు ఆ రెండు విత్తనాలను చిన్నచిన్న చేతులతో మట్టిని కొంచెం పక్కకు నెట్టి నాటి ఇంట్లోకి వెళ్లిపోయింది.

మొదటి విత్తనం కళ్లు తెరిచి చూసింది. అమ్మో నన్ను ఈ మట్టిలో వేసి వెళ్లిపోయింది ఈ పాప. భూమి లోపలికి వెళ్దామంటే చీకటిని చూసి భయమేస్తుంది. లోపల ఉన్న మట్టి నా సున్నితమైన చర్మాన్ని పాడు చేస్తుందేమో అయిన కొంచెం పెరిగితే అర్పిత వచ్చి పీకేస్తుందేమో ఆ మాత్రం దానికి పెరగడం ఎందుకు, ఇంత కష్టం భరించడం ఎందుకు అని అలానే ఉండిపోయింది. రెండవ విత్తనం మాత్రం గాలిని చూసి తనలో ఉత్సాహాన్ని పెంచుకుంది. తనపై పడ్డ ప్రతి నీటి బిందువును శక్తిగా మార్చుకుంది. భూమిలో మట్టితో స్నేహం చేసింది. పైకి పెరిగి, సూర్యరశ్మిని గ్రహించి ఆరోగ్యంగా అందంగా పెరిగింది. అందమైన పూలు పూసింది. భయంతో ఉండిపోయిన విత్తనాన్ని చూసి ఒక రోజు కోడిపిల్ల తినేసింది. అంతటితో దాని జీవితం అయిపోయింది.

7. ఒంటి కన్ను రాజు

సింహపురి అనే రాజ్యాన్ని సిద్ధార్థుడనే రాజు పరిపాలిస్తూ ఉండేవాడు. ఆ రాజుకు ఒక కన్ను, ఒక కాలు మాత్రమే ఉండేది. కానీ చాలా తెలివైనవాడు. అంతకంటే ఎక్కువ దయ కలిగిన వాడు. అతని పరిపాలనలో ప్రజలంతా ఎంతో ఆరోగ్యంగాను, సంతోషంగా జీవిస్తూ వచ్చారు. ఒక రోజు సంధ్యా సమయాన రాజ్యంలో అలా నడుస్తుండగా అక్కడ రాజు తన పూర్వీకుల చిత్రపటాలను చూశాడు.

తన పిల్లలు కూడా ఇలా ఇక్కడ తిరిగే సమయాన ఈ చిత్రపటాలను చూసి వారి పూర్వీకుల గురించి తెలుసుకుంటారు. కానీ అక్కడ తన చిత్రపటం లేకపోవడం బాధ అనిపించింది. చాటింపు వేయించారు. ఎవరైనా వచ్చి తన చిత్రపటాన్ని గీయాలని, ఎంతో మంది చిత్రకారులు వచ్చారు. కానీ రాజు అవిటి తనాన్ని ఎలా అందంగా రూపం ఇవ్వగలం.. అది చూసి రాజుకు కోపం వస్తే బలి అవుతామని భయపడ్డారు.

ఒక చిత్రకారుడు మాత్రం చాలాకాలం ప్రయాసపడి ఒక చిత్రపటం గీసాడు. ఆ పటం చూడగానే రాజు మిగిలిన చిత్రకారులు చాలా ఆశ్చర్య పోయారు. రాజుగారి అవిటితనాన్ని తెలియకుండా గీశాడు. అది ఎలా ఉందంటే 'రాజు గారు గుర్రంపైన కూర్చుని ఒక కాలు కనిపిస్తూ విల్లు ఎక్కుపెట్టి ఒక కన్ను మూసినట్లుగా చూపెట్టాడు.' రాజు గారు చాలా సంతోషించి పెద్ద బహుమతి ఇచ్చారు. ఏ సమస్యకైనా పరిష్కారం సులభం.

8. ప్రస్తుత సమాజం

ఒక ఏడు ఏళ్ల అబ్బాయి వీధిలో హాయిగా నడుస్తూ వెళ్తున్నాడు. వీధిలో ఎవరో పడేసుకున్న ఒక్క రూపాయి అతనికి దొరికింది. ఆ రోజు మొదలు ఆ

పిల్లాడు దించిన తన తలను తన జీవితాంతము పైకెత్తలేదు.ఏదైనా దొరుకుతుందేమోనని, ఇప్పుడు అతని వయస్సు 75 ఏళ్లు తనకు దొరికింది 750 రూపాయలు అతను పోగొట్టుకున్నది మాత్రం అందమైన ప్రకృతిని పచ్చని చెట్లను, అందులో రోజు పూస్తున్న పువ్వులను, ఇంద్రధనస్సును. పసి పిల్లల నవ్వులు అతనికి కనిపించలేదు. మొత్తానికి వెలకట్టలేని ఎన్నో అందాలను, ఆనందాన్ని పోగొట్టుకున్నాడు. ఇది ఒక పిల్లాడి జీవితం కాదు.. ప్రస్తుత సమాజం.

9. పట్టుదల

టిట్టిభం అనేది చాలా చిన్న పక్షిజాతి. దీన్ని లకుముకి పిట్ట అంటాం. టిట్టిభ జాతికి చెందిన ఒక ఆడపక్షి ఓ సారి సముద్ర తీరంలో గుడ్లు పెట్టింది. అవి బిడ్డలుగా మారాలని ఎదురు చూస్తుంది. ఓ రోజున ఆహారం కోసం బయటకు వెళ్లింది. ఇంతలో ఉధృతంగా వచ్చిన సముద్రపు అలలు ఆ గుడ్లను సముద్రంలోకి తీసుకెళ్లాయి. ఇంతలో పక్షి వచ్చి చూస్తే గుడ్లు లేవు. తన కలలన్నీ ఛిన్నాభిన్నమయ్యాయి. తన బిడ్డలకు ఎలాగైనా లోకం వెలుగు చూపించాలని.. సముద్రం నుండి గుడ్లు బయటకు తీసుకొని రావాలనుకుంది. తన ముక్కుతో సముద్రపు నీటిని పీల్చి ఒడ్డున వదిలి పెట్టింది. ఇది సాధ్యమయ్యే పనేనా? పిట్టకు మాత్రం ఈ సందేహం రాలేదు. కొన్ని పక్షులు నిరాశ పరిచాయి. క్రమంగా వేలాది పక్షులు ఈ పనికి జత కూడాయి. ఈ విషయం పక్షి రాజు గరుత్మంతుడి వరకు వెళ్లింది. రాజుతో పాటు లక్షలాది పక్షులు నీరు తోడటం ప్రారంభించాయి. ఈ అల్లకల్లోలాన్ని సముద్రుడు గుర్తించాడు. విషయం తెలుసుకొని తన గర్భంలో ఉన్న గుడ్లను తీసుకువచ్చి అందించాడు. 'పిట్ట చిన్నదే అయినా తన సంకల్పబలానికి సముద్రుడే తల వంచాడు.

10. ఆత్మరక్షణ

ఒక కప్పను ఒక నీళ్ళ గిన్నెలో ఉంచి ఆ గిన్నెను పొయ్యి మీద ఉంచితే కాసేపటికి నీళ్ళు కొంచెం వేడి కావడం మొదలయ్యాయి. ఆ నీళ్ల వేడికి తగ్గట్టుగా కప్ప తన శరీర ఉష్ణోగ్రతను మార్చుకుంటుంది. కాసేపటి తరువాత నీళ్ళు ఇంకా వేడి అవుతాయి. అప్పుడు కూడా కప్ప తన శరీర ఉష్ణోగ్రతను నీటి వేడికి తగ్గట్టుగా మార్చుకొని నీటి వేడిని ఓర్చుకోగలుగుతుంది. ఇంకా నీళ్ళు పూర్తిగా మరిగినంత స్థితికి చేరాక కప్ప తన శరీర ఉష్ణోగ్రతను ఇంకా మార్చుకోలేదు.

ఇక అప్పుడు నిర్ణయించుకుంటుంది నీళ్ల గిన్నెలోంచి బయటకు దూకేద్దాం అని. కానీ దూకలేకపోయింది. ఎందుకంటే అప్పటి వరకు శరీర ఉష్ణోగ్రతను మార్చుకుంటూ నీటి వేడిని భరించటంలోనే కప్ప శక్తి అంతా హరించుకుపోయింది. దూకే శక్తి లేక నీరసపడి పోయింది. కాసేపటికి చచ్చిపోయింది. కారణం వేడినీళ్లు కానేకాదు. ఎప్పుడు దూకాలో సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోలేకపోయింది. అదే అసలైన కారణం ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూస్తూ బలైపోయేకంటే సమయం ఉన్నపుడే ధైర్యంగా శక్తి ఉన్నప్పుడే సరైన నిర్ణయం తీసుకోవడం మంచిది.

11. రూపాయి.. రూపాయి నువ్వేం చేస్తావ్..

ఇద్దరు మిత్రులు ఒక రోజు అరణ్యం గుండా నడుచుకుంటూ వెళ్తున్నారు. అకస్మాత్తుగా వారి సమీపంలోని పొదవైపు నుంచి ఒక సన్యాసి అదుర్దగా.. ఆయాసంతో కనిపించాడు. వాళ్లిద్దరు ఆయనను ఆపి 'ఏం జరిగింది ఎందుకు భయపడుతున్నావ్ అని అడిగారు. అందుకు ఆయన అదిగో అక్కడ కనిపిస్తున్న పొదలో మనుషుల్ని చంపేది ఉంది అన్నాడు. అక్కడ పులి ఉందా





అని అడిగారు. దానికన్న ప్రమాదకరమైనది. మూలికల కోసం తవ్వుతుండగా అది బయట పడింది. ఇంతకి ఏమిటది.. నాణేలమూట. వాళ్లిద్దరు ఎక్కడ అని అడిగారు. నాణేల మూటను చూపించి తన దారిన పోయాడు సన్యాసి. బంగారు నిక్షేపాన్ని పట్టుకొని మనుషులను చంపేది అంటాడేంటి ? ముందుగా ఇప్పుడేం చేయాలో ఆలోచిద్దాం. పట్టపగలే బహిరంగంగా దీన్ని మోసుకుపోతే ఊర్లో జనాలు అనుమానపడే అవకాశం ఉంది. మనలో ఒకరం దీనికి కాపలా ఉందాం. మరొకరు ఊర్లోకి వెళ్లి భోజనం తీసుకుని వద్దాం అన్నాడు. అలాగే జరిగింది. మొదటి వాడు ఇలా అనుకున్నాడు. 'ఛ ఈ రోజు నేను ఒంటరిగా ఇక్కడి వచ్చి ఉంటే ఎంత బాగుండేది. ఇప్పుడు ఇతనికి సగం బంగారం ఇవ్వాల్సి వస్తుంది. బంగారం కూడా ఎక్కువ లేదు. నా కుటుంబం చాలా పెద్దది. అంతా నాకే దక్కితే బాగుంటుంది. వాడు వచ్చి రాగానే కత్తితో పొడిచి చంపేస్తాను అని కత్తి నూరి సిద్ధం చేసుకున్నాడు.

ఇదిలా ఉండగా రెండో మిత్రుడి ఆలోచన ఇలా ఉంది. వాడికి సగభాగం ఎందుకివ్వాలి. అసలే నాకు చాలా అప్పులు ఉన్నాయి. వాడికి అప్పులు లేవు. డబ్బు ఉన్న వాళ్ళు స్నేహితులుగా ఉన్నారు. కాబట్టి నేను తీసుకెళ్లే భోజనంలో విషం కలుపుతాను. ఇది తిని వాడు చనిపోతాడు. అలాగే చేశాడు. భోజనం తీసుకెళ్లాడు. అతను దగ్గరికి వెళ్లగానే అక్కడ కత్తితో పొంచి ఉన్న రెండోవాడు మీదకు దూకి కత్తితో పొడిచి చంపేశాడు. బంగారం నాకే అనుకొని ఏ మాత్రం అనుమానం లేకుండా తెచ్చిన అన్నాన్ని తిన్నాడు. అరగంట తర్వాత

చనిపోయాడు. సన్యాసి మాటలు నిజమే కదా అనుకున్నాడు. చివరి క్షణాల్లో.. రూపాయి రూపాయి నీవేం చేస్తావు అంటే తోబుట్టువుల మధ్య వైరం పెంచుతాను. తల్లి బిడ్డల మధ్య చిచ్చు పెడతాను. చివరికి ప్రాణ స్నేహితులను దూరం చేస్తాను అంటుంది. కాబట్టి జాగ్రత్త..

12. తాబేలు - నక్క





ఒక మడుగులో తాబేలు ఒకటి ఉండేది. నీటిలో తిరిగి తిరిగి విసుగు పుట్టినపుడు అది ఒడ్డు మీదకు వచ్చి షికార్లు కొట్టేది. ఇలా ఒక రోజు తాబేలును నక్క ఒకటి చూసింది. లొట్టలేసుకుంటూ వచ్చి తాబేలును పట్టుకుంది. వెంటనే తాబేలు తన కాళ్లను, తలను డొప్పలోపలికి ముడుచుకుంది. నక్క తాబేలును అటు, ఇటు ఎటువైపు తిప్పినా దానికి మొత్తటి మాంసం దొరకలేదు. కోపంతో తాబేలును బండకేసి కొట్టసాగింది నక్క. తాబేలు భయంతో వనికిపోయింది. ఎలాగైనా నక్క బారి నుండి తప్పించుకోవాలని ఒక పథకం వేసింది. నక్క బావ ఎందుకు అవస్థలు పడతావు నేను పుట్టింది నీ కోసమే నీ బాధ చూడలేక పోతున్నాను.


నన్ను నీటిలో వదులు కొద్ది సేపటికి బాగా నాని మొత్తబడతాను అప్పుడు నువ్వు నన్ను శుభ్రంగా తినేయచ్చు అన్నది తాబేలు. ఉపాయం నచ్చినా అనుమానం ఉన్నప్పటికి సరేనని చెప్పింది. నమ్మినట్లే నమ్మి నీటిలో వదిలిపెట్టి

కాలితో గట్టిగా నొక్కి పట్టుకుంది. మళ్లీ వెంటనే దానికి ఆలోచన వచ్చింది. నక్క బావ నక్క బావ ఒళ్లంతా బాగా నానింది కానీ నువ్వు కాలు పెట్టిన చోట మాత్రం కాస్త గట్టిగానే ఉంది. నువ్వు కాసింత కాలు వదిలితే అక్కడ కూడా బాగా నానుతుంది. నువ్వు హాయిగా తినొచ్చు అని చెప్పింది తాబేలు. సరే అని తన కాలును వదిలిందో లేదో వెంటనే తాబేలు మడుగులోకి జారుకుంది.


13. నాలుగు దీపాలు - నమ్మకం

ఒక చిన్న గదిలో నాలుగు మైనపు దీపాలు వెలుగుతూ ఉన్నాయి. ఇంతలో పెద్ద గాలి రావడం మొదలైంది.

'ప్రశాంతత' అనే మైనపు దీపం ఈ గాలికి నేను ఆరిపోతానేమోనని భయపడింది. గాలి రావడంతో ఆరిపోయింది. 'ప్రేమ' అనే దీపం కూడా ఆరిపోయింది. 'తెలివి' అనే దీపం కూడా ఆరిపోయింది. నాలుగో దీపం మాత్రం తనవంతు ప్రయత్నం తాను చేసింది. ఆ గాలిని ఎదిరించి వెలిగింది. గదిలోకి చిన్నపిల్లవాడు వచ్చి అయ్యో మూడు దీపాలు ఆరిపోయాయని అని బాధపడుతూ ఉన్నాడు. అప్పుడు నాలుగో దీపం ఇలా చెప్పింది బాధపడకు.. నా నుండి మూడు దీపాలు వెలిగించుకో అన్నది. సంతోషంతో నాలుగో దీపాన్ని నీ పేరు ఏంటి అని అడుగగా 'నా పేరు నమ్మకం' అని చెప్పింది. 'అన్ని పోగొట్టుకున్నా మనపైన మనకు నమ్మకం ఉంటే చాలు పోగొట్టుకున్నవన్నీ తిరిగి సంపాదించుకోగలం.



14. లడ్డూలు - చీమలు



కాళీమాత ఆలయంలో ఓ రోజు ప్రసాదంగా ఇవ్వడానికి లడ్డూ తయారు చేస్తున్నారు. అయితే ఎక్కడి నుంచి వచ్చాయో తెలీదు. లడ్డూలకు చీమలు పట్టడం మొదలైంది. లడ్డూ తయారు చేస్తున్న వారికి ఏం చేయాలో అర్థం కావట్లేదు. చీమలను చంపకుండా ఎలా ? అని రామకృష్ణ పరమహంసను సలహా అడిగారు. 'చీమలు వస్తున్న దారిలో చక్కెర పొడి చల్లండి వాటిని తీసుకొని చీమలు వెళ్లిపోతాయి. ఇక ఇటు రావు అని సూచించారు' అలాగే




చీమలు వచ్చే దారిలో చక్కెర పొడి చల్లారు. ఆ పొడిని చూడటంతోనే వాటిని నోట కరచుకొని చీమలు కాసేపటికల్లా అక్కడి నుంచి వెళ్లిపోయాయి. మనుషులు ఈ చీమల్లాంటి వారే తాము కోరుకున్నది పొందాలనుకుంటూనే తమకు తెలియకుండానే దానిని మధ్యలోనే విడిచిపెట్టి మరోదారి కనిపిస్తే దానితో సరిపెట్టుకుంటారు. అనుకున్న లక్ష్యాన్ని విడిచి పెడతారు. రవ్వంత చక్కెర సంతోషం చాలనుకుంటారు. లడ్డు అంత పరిపూర్ణ సంతోషం పొందాలనుకునే వారు చాలా తక్కువ అని చెప్పారు.

15. సఖ్యత లేకపోతే..

ఓ సారి రెండు పావురాలు అడవి మీదుగా ప్రయాణిస్తున్నాయి. వాటికి నేల మీద పోసి ఉన్న ధాన్యపు గింజలు కనిపించాయి. ఒక పావురం చటుక్కున

దిగి ఆ ధాన్యాన్ని తినసాగింది. దాని వెంట రెండో పావురం నేల మీదకి దిగి ధాన్యాన్ని తిన సాగింది. తింటు తింటూ



ఉండగా అవి ఒక వలలో చిక్కుకుపోయాయి. పక్షుల కోసమే వేటగాడు అక్కడ ధాన్యాన్ని చల్లాడని తెలుసుకున్న రెండు పావురాలు దు:ఖంలో మునిగిపోయాయి. 'నీ అత్యాశ వల్లే ఇప్పుడు ఇద్దరం ప్రమాదంలో పడ్డాం చూడు' అంది మొదటి పావురం. 'నిన్ను నాతో పాటే రమ్మని ఎవరు చెప్పారు. నువ్వు అంత తెలిసిన దానివి అయితే కాస్త ఓపిక పట్టి ఉండొచ్చు కదా!' అని ఎదురు పలికింది రెండో పావురం.

అడుగుల చప్పుడు వినిపించింది. వేటగాడు వల దగ్గరకు వచ్చేస్తున్నాడు. జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఈ వల చూస్తే చిన్నదిగా ఉంది పైగా కాస్త వదులుగా కూడా కనిపిస్తుంది. మనం ఒక్కసారిగా ఈ వలతో పాటు ఎగిరిపోదాం అని అంది. మొదటి పావురం సరే అన్నది రెండో పావురం గట్టిగా ప్రయత్నించగా పావురాలు రెండు ఆకాశంలోకి ఎగిరిపోయాయి. వలతో సహా ఎగిరిపోతున్న పావురాలను చూసిన వేటగాడు నేల మీద నుండే వాటిని అనుసరిస్తూ పరుగెత్తసాగాడు.

అప్పుడే ఒక ముని ఎదరు పడ్డాడు 'అల్లంత ఎత్తున ఆ పావురాలు ఆకాశంలో ఎగిరిపోతుంటే వాటి మీద ఆశతో ఇంకా పరుగులు పెడుతున్నావేంటి' అని అడిగాడు ముని. 'స్వామి నేను వాటిలో అవి గొడవ పడటాన్ని గమనించాను. నిరంతరం గొడవపడేవారు. ఎంతో సేపు కలిసి ఉ ండలేరు. ఏ దిక్కున వెళ్లాలి, వలను ఎలా? వదిలించుకోవాలి అనే కొట్లాటలో

అవి వలను ఎక్కువ సేపు మోయలేవు. చూస్తూ ఉండండి అవి కాసేపట్లో నేలకూలడం తథ్యం అన్నాడు. పక్షులు రెండు బిగ్గరగా అరుచుకుంటూ కనిపించాయి. వేటగాడి మాట నిజమైంది. తమలో తాము గొడవ పడుతున్న పక్షులు నేలమీదకి జారిపోవడం కూడా గమనించుకోలేదు. తమలో తాము కొట్లాడుకుంటే అది వారి వినాశానికే దారి తీస్తుంది.

16. కర్మ సిద్ధాంతం - భలే కథ

కళ్లు చెట్టుమీద ఉన్న పండుని చూశాయి. ఆశ పుట్టింది. కళ్లు పండుని తెంపలేవు. కదా అందుకే కాళ్ళు వెళ్లాయి చెట్టు దగ్గరికి. కాళ్లు చెట్టుపై పండును కొయ్యలేవు కదా కాబట్టి చేతులు కోశాయి. చేతులు పండుని తినలేవు కాబట్టి నోరు తినేసింది. ఈ పండు కడుపులోకి వెళ్తుంది. ఇప్పుడు చూడండి ఎవరు చూశారో వాళ్లు వెళ్లలేదు. ఎవరు వెళ్లారో వాళ్లు తెంపలేదు. ఎవరు తెంపారో వాళ్లు తినలేదు. ఎవరు తిన్నారో వాళ్లు ఉంచుకోలేదు. కడుపులోకి వెళ్తుంది. ఎప్పుడైతే తోటమాలి చూశాడో అప్పుడు దెబ్బలు వీపు మీద పడ్డాయి. పాపం వీపు తప్పేమి లేదు. ఎప్పుడైతే వీపు మీద దెబ్బలు పడ్డాయో అప్పుడు కళ్ల నుండి కన్నీళ్లు వచ్చాయి. కళ్ల నుండి ఎందుకంటే అందరికంటే ముందు పండుని చూసింది కళ్లు కాబట్టి. కర్మ సిద్ధాంతం అంటే ఇదే.

17. దేవునిపై విశ్వాసంతో చేసే పనిపై దృష్టి పెడితే విజయం తథ్యం

ఒక అడవిలో ఓ లేడి భారంగా అడుగులు వేస్తూ వెళ్తోంది. అది నిండు గర్భిణి దానికి అప్పుడే నొప్పులు వస్తున్నాయి. అది అనుకూల ప్రదేశం కోసం వెతుకుతోంది. ఒక దట్టమైన గడ్డి భూమి కనబడింది. దానికి అటు పక్క నది

ప్రవహిస్తోంది. అదే అనుకూల ప్రదేశం అనుకుంది. నొప్పులు మొదలయ్యాయి. నిట్టూర్పులు విడుస్తూ అటు ఇటు తిరుగుతోంది. అప్పుడే దట్టమైన మబ్బులు కమ్మాయి. ఉరుములు, పిడుగులు పడ్డాయి. లేడికి కొద్ది దూరంలోనే గడ్డి అంటుకున్నది. దూరంగా తన ఉనికిని గమనించి కుడివైపు నుండి ఒక సింహం వస్తోంది. ఎడమ వైపు నుండి ఒక వేటగాడు బాణం సరి చేసుకుంటున్నాడు. ఇంకోవైపు నది వెళ్లనివ్వదు.

ఏం జరుగుతుంది లేడి బిడ్డకు జన్మనిస్తుందా.. బిడ్డ బ్రతుకుతుందా? ఒక వైపు నిప్పు.. రెండో వైపు నది మిగిలిన రెండు వైపులా మృత్యు రూపంలో వేటగాడు.. సింహం.. కానీ లేడి మాత్రం ఇవేమి పట్టించుకోలేదు. అది తన బిడ్డను కనడం మీదనే దృష్టి పెట్టింది. పిడుగు కాంతికి వేటగాడి కళ్లు చెదిరాయి. గురి తప్పి బాణం సింహానికి తగిలింది. వర్షం పడి సమీపిస్తున్న మంటలు ఆరిపోయాయి.

లేడి పిల్ల తల్లి గర్భంలో నుండి బయటకు వచ్చింది. ఏదైన జరగని నేను బిడ్డకు జన్మనివ్వడం మీదనే దృష్టి పెడతాను అని లేడి అనుకోకుండా లేడి ప్రాణం గురించి ఆలోచించి తప్పటడుగు వేసి ఉండి ఉంటే ఏమి జరిగేది. మన జీవితంలో కూడా అన్ని వైపులా సమస్యలు చుట్టు ముడుతూనే ఉంటాయి. నెగెటివ్ ఆలోచనలతో సతమతమవుతూనే ఉంటాము. మన తక్షణ కర్తవ్యాన్ని విస్మరిస్తాము. భగవంతుడిపై భారం వేసి మన పని మనం చేయడమే ఉత్తమం.

'ఆత్మ విశ్వాసంతో, ధైర్యముతో ధృడ నిశ్చయంతో దేవునిపై విశ్వాసముతో చేసే పనిపై దృష్టి పెడితే విజయం తథ్యం'.

18. నీటిపై నడిచే కుక్క


ఒక వేటగాడు ఒక అద్భుతమైన వేట కుక్కని కొన్నాడు. ఆ కుక్క నీటి మీద నడిచేది. వేటగాడు తన స్నేహితుడిని బాతులు పట్టేందుకు రమ్మని పిలిచాడు. కుక్క నీటి మీద పరిగెత్తి వెళ్లి వాటిని తెచ్చింది. ఈ కుక్కని సంపాదించినందుకు స్నేహితుడు తనని మెచ్చుకుంటాడని వేటగాడు ఎంతో ఆశగా ఎదురు చూశాడు.

కానీ అతని ఆశ నెరవేరలేదు. ఆ స్నేహితుడు ఆ కుక్క గురించి ఏమీ అనలేదు. వాళ్ల ఇంటికి తిరిగి వెళ్లేటప్పుడు వేటగాడు ఉండబట్టలేక తన స్నేహితుడిని 'ఆ కుక్కలో నీకు ఏదైనా వింత కనిపించిందా ?' అని అడిగాడు. స్నేహితుడు ఆ కనపించింది. చాలా పెద్ద వింతే నీ కుక్కకు ఈదడం చేతకాదు అన్నాడు. కొంతమంది ఎప్పుడు అందరితోను, అన్నింటిలోనూ లోటుపాట్లనే చూస్తారు.

19. జంతువుల బడి

ఒక అడవిలో కొన్ని జంతువులు ఒక బడిని ప్రారంభించాలనుకున్నాయి. ఆ బడిలో ఒక పక్షి ఒక ఉడత, చేప, కుక్క కుందేలు, బుద్ధిమాంధ్యం గల ఒక పాము, 'ఈల్' చేప విద్యార్థులుగా చేరాయి. ఒక సమితి ఏర్పడి ఎగరడం,





చెట్లు ఎక్కడం, ఈదడం, బొరియలు తవ్వడం లాంటి విద్యలను విస్తృతంగా నేర్పాలని నిర్ణయించింది. ప్రతి జంతువు అన్ని రకాల విద్యలు నేర్చుకోవాలని కూడా సమితి నిర్ణయించింది.

పక్షి ఎగరడంలో మొదటి మార్కులు తెచ్చుకున్నది. కానీ బొరియలు తవ్వడంలో ముక్కు విరగొట్టుకుని, రెక్కలు పోగొట్టుకొని కింద పడిపోసాగింది. కొద్ది కాలానికి ఎగరటంలో కూడా దాని మార్కులు తగ్గిపోసాగాయి. చెట్లు ఎక్కటంలోనూ ఈదటంలోనూ కనీస మార్కులు కూడా రాలేదు.

ఉడుత చెట్లెక్కడంలో అందరికన్న ముందున్నా ఈదడంలో ఓడిపోయింది. చేప చక్కగా ఈది అన్నింటి కన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకుంది. కానీ నీటిని వదిలి బైటికి రాలేకపోవడం వల్ల మిగతా అన్నింట్లో నెగ్గలేకపోయింది. మొరగటం అనే విద్యలో అసలు పాఠాలు చెప్పడం లేదని బడి అధికారులతో పోట్లాట పెట్టుకుంది కుక్క. కుందేలు బొరియలు తవ్వటంలో మొదటి మార్కులు తెచ్చుకుంది. కానీ చెట్లెక్కడం దానికి పెద్ద సమస్య అయ్యింది. మాటిమాటికి కింద పడిపోతుండడం వల్ల మెదడు దెబ్బతింది.

ఇక్కడ మనం గమనించాల్సింది 99 విషయాలలో 10 శాతం పరిజ్ఞానం కన్నా ఒక్క విషయంలో 100 శాతం పరిజ్ఞానం సంపాదించడం వల్ల మాత్రమే విజేతలుగా తయారవుతాం.


20. మీ గొడ్డలికి పదును పెట్టండి

రాజు అనే కట్టెలు కొట్టేవాడు ఒక కంపెనీలో ఐదేళ్లుగా పని చేస్తున్నా కూడా అతనికి జీతం పెరగలేదు. అదే కంపెనీలో రవికి కూడా ఉద్యోగం ఇచ్చింది. ఒక సంవత్సరంలోనే అతని జీతం పెరిగింది. ఇది చూసి రాజుకి చాలా కోపం వచ్చింది. ఆఫీసర్ దగ్గరికెళ్లి కారణం అడిగాడు. నువ్వు ఐదేళ్ల



క్రితం ఎన్ని చెట్లు కొట్టేవాడివో ఇప్పుడు కూడా అన్నే కొడుతున్నావు. ఇంకా ఎక్కువ చేస్తే జీతం పెంచతాము అని చెప్పాడు ఆఫీసర్. ఎక్కువ పని చేస్తూ ఎక్కువ చెట్లని కొట్టాలని నిర్ణయించుకొని ప్రయత్నించాడు. కానీ ఎక్కువ చెట్లని కొట్టలేకపోయాడు. ఇదే విషయం రవికి అడగగా నేను ఒక్క చెట్టుని కొట్టిన తర్వాత రెండు నిమిషాలు విశ్రాంతి తీసుకుంటాను. ఆ సమయంలో నా గొడ్డలికి పదును పెడతాను. మరి నీ గొడ్డలికి పదును పెట్టి ఎన్నాళ్లయ్యింది' అని అడిగాడు. అనగా ఎప్పటికప్పుడు మన స్కిల్స్‌ని పెంచుకోవాలని అని అర్థం.

21. థామస్ ఎడిసన్



చెవులు సరిగ్గా వినపడని నాలుగేళ్ల కుర్రవాడు ఉండేవాడు. అతను ఒక రోజు బడి నుండి ఇంటికి వెళ్లేటప్పుడు టీచర్ ఒక చీటిని అతని జేబులో ఉంచాడు. దానిలో 'మీ టాని'కి బుర్ర తక్కువ అతను పాఠాలు సరిగ్గా చదవలేదు. అతని స్కూల్లోంచి తీసేయ్యండి. అని రాసి ఉంది. తల్లి ఆ చీటి చదువుకొని నా కొడుకు బుర్ర తక్కువ వాడేమీ కాదు. వాడికి నేనే చదువు నేర్పుకుంటాను అని జవాబు రాసి ఇచ్చింది. ఆ టానియే పెద్దయ్యాక గొప్ప శాస్త్రవేత్త థామస్ ఎడిసన్ అయ్యాడు. ఎడిసన్ స్కూల్‌కి వెళ్లి చదువుకున్నది మూడు నెలలు మాత్రమే.

అన్ని విజయ గాథలు పెద్దపెద్ద ఓటములతో నిండినవే తేడా ఏమిటంటే ఓడిపోయిన ప్రతిసారి కింద పడిన బంతిలాగా వాళ్లు పైకి లేచారు. వెనక్కి తీసుకెళ్లే ఓటమి అనడం కన్నా ముందుకు తీసుకెళ్లే ఓటమి అనటమే సబబు.

22. ఏది ఉచితంగా లభించదు

ఒక రాజు తన సలహాదారులని పిలిచి తరతరాలుగా మనకి అందించబడిన వివేకాన్ని రాసి ఉంచమని అడిగాడు. రాబోయే తరాలకు అది ఉపయోగపడుతుందని అన్నాడు. ఎన్నో గ్రంథాల రూపంలో పొందుపరిచి వాటిని రాజుకి అందజేశారు. రాజు ఆ గ్రంథాలన్నీ తిరగేసి అవి మరీ పెద్దవిగా ఉన్నాయని ఎవరు వాటిని చదవడానికి ఇష్టపడరని అన్నాడు. వాటిని సంక్షిప్తం చేయమని రాజు వారిని ఆదేశించారు. అప్పుడు సలహాదారులు పుస్తకాలన్ని తీసుకెళ్లి కుదించి ఒకే ఒక పుస్తకంలో రాసి తీసుకొచ్చారు. అది కూడా పెద్దదిగా ఉందని అనడంతో మళ్లీ ప్రయత్నించి విషయాన్ని ఒకే ఒక అధ్యాయంలో పొందుపరిచి తెచ్చారు. అది కూడా పెద్దదిగా ఉందని రాజు అన్నాడు. పైగా ఒక పేజీ కూడా ఎక్కువ అవుతుంది అన్నాడు. అప్పుడు సలహాదారులు ఒకే ఒక వాక్యంలో ఆ వివేకాన్నంత కుదించి రాసి తీసుకొచ్చారు. రాజు తృప్తి చెందాడు. ఆయన ఒకే ఒక వాక్యంలో వివేకాన్నంత సలహా రూపంలో ఇవ్వదలచాడు. అదేమిటంటే 'ఏదీ ఉచితంగా లభించదు'.

23. ఏది సులభంగా ఆశించవద్దు

కొన్నాళ్ల క్రితం ఒక అడవిలో పాటలు పాడే ఒక పక్షి ఉండేది. ఒక రైతు ఒక పెట్టె నిండా పురుగులు తీసుకొని ఆ అడవిలోకి వచ్చాడు. పక్షి అతన్ని ఆపి పెట్టెలో ఏమున్నాయి. నువ్వు ఎక్కడికి వెళ్తున్నావు అని అడిగింది.

పురుగులు ఉన్నాయి. వాటిని అమ్మి కొన్ని ఈకలు కొనుక్కోవడానికి తాను సంతకి పోతున్నానని చెప్పాడు.

అప్పుడు పాడే పక్షి నా ఒంటి నిండా చాలా ఈకలు ఉన్నాయి. నేనొక ఈక పీకి ఇస్తాను. దాని వల్ల నేను పురుగులని వెతుక్కునే శ్రమ తప్పుతుంది అంది. అలాగే ఈక ఇచ్చి పురుగులు తీసుకుంటుంది. మర్నాడు కూడా అదే విధంగా జరిగింది. ఇదే విధంగా చాలా కాలం జరిగింది. చివరికి పక్షి ఒంటిమీద ఒక్క ఈక కూడా మిగల్లేదు. అప్పుడిక అది ఎగిరి వెళ్లి పురుగులను వెతుక్కునే శక్తి పోగొట్టుకుంది. చూడటానికి చాలా అంద వికారంగా తయారై పాడటం మానేసి కొన్నిరోజులకే చనిపోయింది.

నీతి : సులభంగా తిండి సంపాదించుకునేందుకు చేసిన ప్రయత్నం చిట్ట చివరికి ఎన్ని కష్టాలు తెచ్చిపెట్టిందో చూశారు కదా..

24. జీవితం ఒక ప్రతిధ్వనిలాంటింది

ఒక చిన్న పిల్లవాడికి వాళ్లమ్మ మీద చాలా కోపం వచ్చింది. అప్పుడు వాడు నువ్వంటే నాకు అసహ్యం, నాకు అసహ్యం అని అరిచాడు. కానీ అలా అన్నాక వాళ్లమ్మ కోప్పుడుతుందేమోనని భయపడి ఇంట్లోంచి బయటికి పారిపోయాడు. అలా వెళ్లి ఒక లోయని చేరుకున్నాడు. అక్కడ మళ్లీ నువ్వంటే నాకు అసహ్యం.. నాకు అసహ్యం అని కేక పెట్టాడు. అతని కేక లోయలో ప్రతిధ్వనించింది. భయపడి తల్లి దగ్గరికి పరిగెత్తాడు. తల్లితో ఇలా చెప్పాడు. లోయలో ఒక చెడ్డ కుర్రవాడు ఉన్నాడని నాకు నువ్వు అంటే అసహ్యం అని అరుస్తూ ఉంటాడని చెప్పాడు. తల్లికి పిల్లవాడు చెప్పింది అర్థమయ్యింది. ఆమె వాడితో మళ్లీ లోయలోకి వెళ్లు నాకు నువ్వంటే ఇష్టం అని అరవమని చెప్పింది. అలాగే అరిచాడు. ప్రతిధ్వని కూడా అలాగే వచ్చింది. అప్పుడా

పిల్లవాడు ఒక పాఠం నేర్చుకున్నాడు. దేనినైతే ఇస్తామో దానిని తిరిగి పొందుతాము. మీ ఆలోచనలు, పనులు, ప్రవర్తనా నేడో రేపో తూ.చ తప్పకుండా అదే రూపంలో మీ దగ్గరికి తిరిగి వస్తాయి.

25. అవతలి వారి పట్ల శ్రద్ధ కనపరచండి..



ఒక పదేళ్ల పిల్లవాడు ఐస్‌క్రీం షాపునకు వెళ్లి బల్ల ముందు కూర్చొని సర్వర్‌ను ' కోన్ ఐస్ క్రీం ధర ఎంత?' అని అడిగాడు. 35రూ॥ అని జవాబు వచ్చింది. తన చేతిలోని చిల్లర లెక్కపెట్టుకొని ఆ పిల్లవాడు ' ఒక చిన్న కప్పు ఐస్‌క్రీం వేల ఎంత అని అడిగాడు సర్వర్ అసహనంగా 25 రూ॥ అని అన్నాడు. నేనొక చిన్న కప్పు తీసుకుంటాను ఇవ్వండి అన్నాడు పిల్లవాడు. ఐస్‌క్రీం తిని బిల్లు చెల్లించి వెళ్లిపోయాడు. ఖాళీ ప్లేటు తీయడానికి వచ్చిన సర్వర్ మనసు చలించి పోయింది. 10 రూ॥ టిప్ కింద వదిలి వెళ్లాడు చిన్నపిల్లవాడు. ఐస్‌క్రీం తెప్పించుకునే ముందు సర్వర్‌ని కూడా దృష్టిలో ఉంచుకున్నాడు. తన గురించి తాను ఆలోచించుకునే ముందు ఇతరుల గురించి కూడా ఆలోచించాలి.

26. మాట జారితే వెనక్కి తీసుకోలేం..

ఒక రైతు తన పక్క పొలంలోని ఇంకో రైతు మీద అపవాదు వేశాడు. కానీ వెంటనే తన తప్పుని తెలుసుకొని క్షమాపణ వేడుకోవడానికి గురువు దగ్గరికి వెళ్లాడు. గురువు గారు ఒక సంచి నిండా పక్షి ఈకలు తీసుకెళ్లి ఊరి


మధ్యలో వాటిని జార విడవమన్నాడు. రైతు గురువు చెప్పినట్లే చేశాడు. తరువాత గురువు గారు ఆ ఈకలన్నీ ఏరి సంచిలో వేయమన్నాడు. ఎంత ప్రయత్నించినా అతను ఆ పని చేయలేకపోయాడు. ఎందుకంటే ఆ ఈకలన్నీ గాలికి చెల్లాచెదురై ఎక్కడెక్కడికో ఎగిరిపోయాయి. అతను ఖాళీ సంచితో తిరిగి వెళ్లాడు. గురువు గారు చెప్పారు. 'మాటలను ఎన్నుకునేటపుడు చాలా జాగ్రత్తగా వాడాలి. వాటిని మళ్లీ వెనక్కి తీసుకోలేము.

27. చిన్న విషయాలే పెద్ద తేడా తీసుకొస్తాయి



ఒక వ్యక్తి ఉదయాన్నే సముద్రపు ఒడ్డుకి వెళ్లాడు. కెరటాలు ఒడ్డుకి వచ్చినపుడు వందలకొద్ది స్టార్ చేపలు కొట్టుకొస్తుండడం, కెరటాలు వెనక్కి తగ్గగానే అవి ఒడ్డునే ఉండిపోవడం చూశాడు. నీళ్లలోంచి బయటికి నెట్టివేయబడ్డ ఆ చేపలు సూర్యుడి కిరణాలు తాకగానే చనిపోవటం ఖాయమని తెలిసి ఇంకా కొన ఊపిరితో ఉన్న ఆ చేపలని ఆయన ఒక్కొక్కటిగా తీసుకొని నీళ్లలో పడవేయసాగాడు. ఆ పని చేస్తుండగా అక్కడికి ఇంకో వ్యక్తి వచ్చాడు. అతనికి ఆయన చేస్తున్నదేమిటో అర్థం కాలేదు. 'మీరు చేస్తున్నదేమిటి? వందల కొద్ది స్టార్ చేపలున్నాయి. ఎన్నిటికని మీరు సాయం చేయగలరు. దాని ఫలితమేమిటి? అని అడిగాడు. మొదటి వ్యక్తి ఇంకో రెండు అడుగులు ముందుకు నడిచి ఇంకో చేపని నీళ్లలో పడవేస్తూ 'ఇదిగో ఈ చేపకి నేను చేసే పని తాలుకు ఫలితం దక్కింది అన్నాడు.

28. పిచ్చుక నేర్పిన పాఠం



ఒక యువకుడు తన గురువు వద్దకెళ్లి 'నాకు ఈ ఊళ్లో పని దొరకడం లేదు. నగరానికి వెళ్తున్నా అక్కడ నాకు మంచి ఉద్యోగం దొరకాలని ఆశీర్వదించండి. అలాగే అని గురువు గారు ఆశీర్వదించి పంపుతాడు. కొన్ని రోజుల తర్వాత గురువు అదే తన ఊళ్లో ఆ యువకుడిని మళ్లీ చూసి ఆశ్చర్యపోతాడు. ఆ యువకుడిని అడుగుతాడు.. నగరానికి అదే రోజు వెళ్తా అన్నావు కదా! వెళ్లలేదా? దానికి యువకుడు ఇలా జవాబిచ్చాడు. 'నేను నగరానికి బయలుదేరాను. రహదారి వెంట నడుస్తూ వెళ్లగా కాసేపు విశ్రాంతి కోసం ఒక చెట్టు క్రింద కూర్చున్నాను. అప్పుడు ఒక దృశ్యం చూశాను. కాలు విరిగిన ఒక పిచ్చుక ఆకలితోను.. బాధతోనూ నడవలేక బాధపడుతుంది. అది ఎలా ఆహారాన్ని తెచ్చుకుంటుంది అని ఆలోచిస్తున్న సమయంలో. ఒక పిచ్చుక ఎగిరి వచ్చింది. తన నోటితో ఆహారం తెచ్చి కాలు విరిగిన పిచ్చుక నోట్లో పెట్టి తినిపించింది. అది చూసి నేను 'ఆహా! కాలు విరిగిన ఈ పిచ్చుకకు కూడా ఆహారం లభించడానికి భగవంతుడు ఒక ఏర్పాటు చేసి ఉంచాడే.. అలాంటి మనిషినైన నాకు ఏర్పాటు చేయకుండా ఉంటాడా? అని అనుకొని తన ప్రయాణాన్ని రద్దు చేసుకొని తిరిగి మన ఊరికే వచ్చేశాను. అంతా విన్న గురువు గారు 'నాయనా ఆ కాలు విరిగిన పిచ్చుకలా ఉండాలని ఎందుకు ఆశిస్తున్నావు' తన శ్రమతో తన ఆహారాన్ని సేకరించుకొని, మరో పిచ్చుకకు కూడా ఆహారం తీసుకువచ్చిన ఆ రెండవ పిచ్చుకగా ఉండాలని నువ్వెందుకు ఆశించడం లేదు. 'ఇతరుల శ్రమతో జీవించాలి' అనుకోవడం సరియైనదికాదు.

29. రామ చిలుకలు నేర్పని పాఠం



ఒక వేటగాడు రామచిలుకలను పట్టుకునే ఉద్దేశంతో చెట్టుకింద వల విసిరి.. దాంట్లో ధాన్యం చల్లాడు. తరువాత అతడు అక్కడి నుంచి ఒక చెట్టు వెనుకకు వెళ్లి దాక్కున్నాడు. ధాన్యం కోసం వచ్చిన రామ చిలుకలు వలలో చిక్కుకున్నాయి. ఈ స్థితిని ఒక ముని చూసి ఆయన హృదయం ద్రవించి పోయింది. వీటిని వదిలి పెట్టు అని ముని చెప్పగా దానికి వేటగాడు ఈ పూటకి ఇవే నా ఆహారం. వేరే ఆహారం మీరు నాకు ఇవ్వగలిగితే ఈ చిలుకలను చంపకుండా వదిలి వేస్తాను అన్నాడు. దీనికి ముని నా దగ్గర కొద్దిగా ఆహారం ఉంది నీకు ఇస్తాను చిలుకలను విడిచి పెట్టు అన్నాడు. అలాగే జరిగింది. చిలుకలను వదిలివేశాడు. అప్పుడు ముని 'చిలుకల్లారా ఇతడు వేటగాడు.. వేటగాడు వస్తాడు వల విసురుతాడు, దాంట్లో ధాన్యం చల్లుతాడు. మీరు చెట్టుమీద నుండి ఎగురుకుంటూ కిందకి వేటగాడు విసిరిన వలలో చిక్కుకోకండి అని హితవు చెప్పాడు.




ముని, వేటగాడు ఇద్దరు వెళ్లిపోయారు. ఒక వారం గడిచింది. వేటగాడు చిలుకలను పట్టుకోవాలనే ఉద్దేశంతో వలతో అదే చెట్టు వద్దకు వచ్చాడు. వేటగాడిని చూడగానే రామ చిలుకలు ముక్త కంఠంతో చిలుకల్లారా..

చిక్కుకోకండి అని పలికాయి. ఈ మాటలు విన్న వేటగాడు చిలుకలు పాత సంఘటన ఇంకా మరిచిపోలేదు. వల విసిరినా చిక్కుకోవు అని అనుకొని వేరే చోటుకి వెళ్లిపోయాడు. ఒక నెల తరువాత వచ్చిన అలానే చెప్పాయి. రెండు నెలల తర్వాత కూడా అలానే చెప్పాయి.. వెనుతిరిగాడు. 4 నెలల తర్వాత వచ్చిన అలాగే చెబితే ఫర్వాలేదు. వేరే పక్షులైనా ఈ వలలో చిక్కుకోవచ్చు కదా! అని ఆలోచించి వల విసిరి దాంట్లో ధాన్యం చల్లాడు. వీటిని చూసిన చిలుకలు ముక్త కంఠంతో చిలుకల్లారా అని చెబుతూ వలలో చిక్కుకున్నాయి. ఇవి చెప్పింది అట్లే తిరిగి చెప్పే చిలుకలు ఈ మాటలకు అర్థం ఏమిటో చిలుకలకు బోధపడలేదు. అందుకే వలలో చిక్కుకున్నాయి. అలాగే చాలా మంది అనేక మంచి విషయాలను వినడం, చదవడం చేస్తున్నారు. కానీ వాటిని జీవితంలో ఆచరణలో మాత్రం చూపడం లేదు.

30. శాస్త్రవేత్త

శాస్త్రవేత్త తన ప్రయోగశాలలో ఏదో ఒక పరిశోధనలో సదా సర్వవేళలా తలమునకై ఉండేవాడు. ఇలా ఉండగా ఒక రోజు ఆ ఊరి ప్రముఖులు కొందరు ఆయనను ఒక కార్యక్రమానికి మీరు ముఖ్య అతిథిగా విచ్చేయాలని విన్నవించుకుంటారు. మొదట రాను అని చెప్పినా తర్వాత ఒప్పుకుంటాడు.





ఒక రోజు ప్రయోగశాలలో మునిగిపోయి కార్యక్రమం గురించి మరిచిపోయాడు. జ్ఞాపకం రాగానే హడావుడిగా పరిశోధన శాల నుండి బయటకు వచ్చాడు. గుర్రపు బండి ఎక్కి కూర్చున్నాడు. త్వరగా బండి పోనివ్వు అని చెప్పి తన వైజ్ఞానిక పరిశోధన గురించిన ఆలోచనల్లో మునిగిపోయాడు. బండివాడు అన్న మాటలు చెవుల్లో పడలేదు. ఇలా ఎన్నిసార్లు అడిగినా చెప్పట్లేదు. త్వరగా బండిని పోనివ్వు త్వరగా బండిని పోనివ్వు అని మాత్రమే చెబుతూ వచ్చాడు. ఆ ఫలానా చోటుకు వచ్చేశామా అని అడిగారు. మీరు చెప్పకుండా ఆ ఫలానా చోటు ఎలా వస్తాము అన్నాడు గుర్రపు బండివాడు.

ఎక్కడి వెళ్లాలో తెలిస్తే సగం ప్రయాణం పూర్తయినట్లే. అలాగే జీవితంలో ఏ స్థాయికి వెళ్లాలి.. ఎంత ధనం సంపాదించాలి.. అనే విషయం నిర్ణయించుకుంటే చాలు అవి తప్పకుండా సాధిస్తాం. కావాల్సింది మొదట నిర్ణయం ఆ తర్వాత నిరంతర శ్రమ.

31. కర్తవ్య రాహిత్యం

ఒక రోజు ధనవంతుడు విలాసార్థం తన గుర్రపు బండిలో షికారుకు బయలుదేరాడు. బండి పట్టణ ప్రాంతాన్ని దాటి ఒక గ్రామం గుండా పోతుంది. వేగంగా పోతున్న గుర్రాలు ఒకింత అదుపు తప్పి కాలిబాట పక్కన నడుస్తున్న ఒక కుర్రవాణ్ణి తాకటము, ఆ తాకిడికి అతను నేల మీద పడిపోగా బండి చక్రాలు అతడి మీద నుండి వెళ్లడము జరిగిపోయాయి. కుర్రవాడు అక్కడికక్కడే మరణించాడు.


కుర్రవాడి బంధువులు కోపంతో బండి వెంట పడ్డారు. పరిస్థితిని ఆ ధనవంతుడు అర్థం చేసుకున్నాడు. మరో ఆలోచన చేయకుండా తన వద్ద సంచిలో ఉన్న వెండి కాసులను గుప్పిళ్లలోకి తీసుకొని వెంటబడి వస్తున్న

జనం వైపు విసిరాడు. కోపంతో పరుగెత్తిన జనాలు ఠక్కున ఆగిపోయారు. వెండి కాసులను ఏరుకోవడంలో మునిగిపోయారు. పుణ్యవంతుడా నిన్ను ఆ భగవంతుడు చల్లగా చూడాలి అన్నారు ముక్తకంఠంతో.

ఆ తర్వాత వాళ్లు గుర్రపు బండిని తరిమితే ఒట్టు.. చిన్నచిన్న లాభాలకై అనేకులు కనీస కర్తవ్యాన్ని విస్మరిస్తున్నారు. మనకు సమాజం పట్ల, తోటి మనిషి పట్ల కొన్ని కర్తవ్యాలు ఉన్నావనడం విస్మరించలేని వాస్తవం.

32. నక్క ఔషధ నిర్దేశనం

ఒక మహారణ్యంలో ఒక సింహం రాజులా జీవిస్తోంది. ఆ సింహానికి ఆహారంగా తక్కిన జంతువులు నిత్యం మాంసం తెచ్చి ఇస్తుండేవి. అందువలన ఆ సింహం తన ఆహార నిమిత్తం అక్కడకు.. ఇక్కడకు వెళ్లకుండా ఒక చోటనే తిష్టవేసి ఉండిపోయింది. ఈ స్థితిలో బాగా బలిసి, కొవ్వు పట్టిన ఆ సింహానికి కూర్చున్న చోటు నుండి లేవడానికి కూడా సాధ్యం కాలేదు. నా ఒళ్లు చిక్కడానికి ఏదైనా మంచి మార్గం ఉందేమో కాస్త చెప్పు అని నక్కని అడిగింది. లేకేం ఉంది సింహరాజా. మీకొక దివ్యమైన ఔషధం నిర్దేశిస్తాను. అది ఏమిటంటే మీరు నిత్యం వేకువ జామునే లేచి వేకువ జామునే పడే మంచు బిందువులను సేకరించి రోజు ఒక గ్లాసెడు తాగండి. ఆ విధంగా మీరు చేస్తే మీ ఒళ్లు చిక్కి



మంచి ఆరోగ్యం పొందుతారు. మంచు బిందువులను సేకరించే పని కుందేళ్లకు అప్పగించింది. ఇలా నాలుగు వారాల పాటు కుందేళ్లు సేకరించి తెచ్చే మంచు బిందువులను తాగినా మునుపటిలాగే దేహం కొవ్వు పట్టి బలిసి ఉంది. నక్కను పిలిపించింది. ఫలితం శూన్యం అని గద్దిస్తూ అడిగింది. కుందేలుకు అప్పజెప్పకుండా వేకువనే లేచి మంచు బిందువులను మీరే సేకరించి తాగితేనే ఆరోగ్యవంతంగా అవుతారు అని చెప్పింది నక్క. అలాగే చేసిన సింహం బాగుంది నీ ఔషధం ఫలితం వస్తుంది అని చెప్పింది నక్కకి. అందుకు నక్క ఓ సింహరాజా నేను మీకు నిర్దేశించింది ఎటువంటి ఔషధము కాదు. వ్యాయామమే మీకు ఓ ఔషధం మాదిరి నిర్దేశించి చెప్పాను. మార్పు రావడానికి మంచు బిందువులు కారణం కానేకాదు వ్యాయామం తప్పనిసరి.

33. కష్టపడి పని చేయండి కలలు కనడం మానేయండి!

ఏ పని చేయకుండా, ధనవంతుడైనట్లు కలలు కనే వ్యక్తిని ఒక రోజు రాత్రి కలలో దేవుడు ప్రత్యక్షమై నీకు ఏ వరం కావాలో కోరుకో అని అడిగితే ఏ పని చేయకుండా బంగారం, డబ్బు రావాలని కోరుకుంటాడు.

ఇంట్లో 100 అడుగుల గోతి తవ్వితే నువ్వు కోరుకున్నది పొందుతావు అని చెబుతాడు. తవ్వడం మొదలు పెడతాడు. కాని ఏమి దొరకదు. చాలా కోపం వస్తుంది. కానీ ఏమీ దొరకదు.

దేవుడు : చూడు నాయన తేలికగా డబ్బు వస్తుందని ఎంతో కష్టపడ్డావు. అదే పని బయటకు వెళ్లి చేస్తే దానికి తగిన ప్రతిఫలం వచ్చేది కదా! కష్టపడకుండా తేలికగా ఏమి దొరకదు.. అని చెప్తాడు. కష్టపడకుండా వచ్చింది ఏది కూడా ఎక్కువకాలం నిలువదు. కాబట్టి ఏ వ్యక్తి అయినా విజయం సాధించాలంటే చక్కటి ప్రణాళిక, కష్టపడి పని చేసే తత్వం రెండు అవసరమే.


There is no gain without pain


Pencil theory


ఒక పెన్సిల్ తీసుకొని షార్ప్ చేయడం మొదలు పెట్టండి షార్ప్ చేస్తూ ఇలా ఆలోచించండి. అయ్యో పాపం దానికి నొప్పిగా ఉందేమో అని వెంటనే ఆలోచించండి నొప్పి భరిస్తేనే కదా! అది చక్కగా రాసేది అలాగే మన తలరాత మారేది.

34. ఊరికోసం పాటు పడటమే యోగం

ఒక భక్తుడు అర్చన నిమిత్తం అరటిపండ్లు, కర్పూరం, పువ్వులు అగరవత్తులు, విభూతి మొదలైనవి శివాలయంలో ఉన్న అర్చకునికి ఇచ్చి అర్చన చేయమని చెప్పాడు. అర్చకుడు అర్చన పూర్తి చేసి కొబ్బరికాయను రెండుగా పగులగొట్టి విగ్రహం ముందు ఉంచాడు. ఆ తర్వాత అర్చకుడు దైవానికి కర్పూర హారతి ఇచ్చాడు. అప్పుడు భక్తులు శంభో శంకర అంటూ చేతులు జోడించి ప్రణామాలు అర్పించారు. తమ ముందుకు కర్పూర హారతి ఇచ్చిన పళ్లెన్ని తెచ్చినపుడు భక్తులు హారతిని కళ్లకు అద్దుకున్నారు. తర్వాత అర్చకుడు పళ్లెన్ని కొబ్బరికాయ, అరటి పండు ఉంచిన చోట ఉంచాడు. కొబ్బరి కాయ అరటి పండుతో ఇలా అన్నది. కొబ్బరికాయ పగులగొట్టి దైవ విగ్రహం ముందు ఉంచినపుడు భక్తులు మౌనంగా ప్రేక్షకుల్లా చూస్తున్నారు. అంతే కర్పూర హారతి ఇస్తున్నపుడు దైవ నామాన్ని ఉచ్చరిస్తూ చేతులు జోడించి నమస్కరించారు ఎందుకలా?







కారణం : కర్పూరం తనను దగ్ధం చేసుకొని భక్తులు దైవ విగ్రహాన్ని బాగా దర్శించడానికి దోహదపడింది. ఆ విధంగా తనను కర్పూరం ఆత్మత్యాగం చేసుకోవడం వలనే దానికి అంతటి గౌరవ మర్యాదాలు లభించాయి. అని తేల్చుకున్నాయి.


మనుషులను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. తమ కోసం తమ భార్య పిల్లలు నిమిత్తం మాత్రమే జీవిస్తారు. కరుడుగట్టిన స్వార్థంతో జీవిస్తారు. వీరు మృగాలు

2. తాము జీవిస్తూ, పక్కన వారిని కూడా జీవింప జేస్తారు. వీరు మనుషులు

3. వీరు ఇతరుల కోసమే జీవిస్తారు. మచ్చుకి రవ్వంత స్వార్థం కూడా ఉండదు. తమ కోసం వీరు ససేమిరా జీవించరు. వీరిని మహామనిషిగా పేర్కొనబడతారు.

35. బాలిక అచంచల విశ్వాసం



ఒక ప్రాంతంలో చాలా కాలంగా మచ్చుకు కూడా వర్షాలు లేవు అందువల్ల ఊరి పెద్దలు 'ఒక శుభ ముహూర్తంలో ఊరి జనమంతా ఒక మైదానంలో సమావేశమై, వాన కోసం సామూహికంగా యజ్ఞం చేద్దాం' అని నిర్ణయించారు. అప్పుడు ఒక బాలిక ఆ సామూహిక ప్రార్థనలో పాల్గొనడానికి గొడుగు తీసుకొని వచ్చింది. అక్కడ వారందరూ నువ్వు గొడుగు ఎందుకు తీసుకొని వచ్చావు. అని అడిగారు. ఇప్పుడు మన

ప్రార్థన పూర్తి కాగానే వర్షం వస్తుంది కదా అని గొడుగు తెచ్చాను అంది ధీమాగా..

వేలమంది అక్కడకు వచ్చారు కానీ ఏ ఒక్కరిలో కూడా మనం భగవంతున్ని ప్రార్థిస్తున్నాం అందువల్ల ఖచ్చితంగా వర్షం వస్తుంది. ఇది తథ్యం అనే నమ్మకం ఏ కోశానా లేదు.

36. రెండు రామ చిలుకలు

ఒక రామ చిలుక తన గూటిలో గుడ్లు పెట్టింది. గుడ్లు పెట్టిన కొన్ని రోజుల తర్వాత ఒక రోజు ఆ రామ చిలుక బైటకు వెళ్లింది. అప్పుడు గాలి కాస్త ఎక్కువగా వీచడంతో గూటిలో ఉన్న గుడ్లలో ఒకటి అటు ఇటు కదిలి కింద పడిపోయి పగిలిపోయింది. ఆ గుడ్డు నుండి చిలుక పిల్ల బయటకు వచ్చింది. ఆ దారిలో యాదృచ్ఛికంగా పోతున్న ఒక వేటగాడు చూశాడు. ఈ చిలుక పిల్లను మరే పక్షి అయినా చూస్తే ఎత్తుకుపోయి ముక్కుతో పొడిచి చంపేస్తుంది. కాబట్టి నేను దీనిని తీసుకుపోయి పెంచుకుంటాను అని వేటగాడు అనుకున్నాడు. కొంత సేపటికి మరో గుడ్డు కింద పడింది.

ఆ గుడ్డు నుండి కూడా ఒక చిలుక పిల్ల బయటకు వచ్చింది. ఆ సమయంలో ఆ దారి గుండా వెళ్తున్న ఒక ముని చూసి ఇక్కడ ఇట్లే పడి ఉంటే తక్కిన జంతువులకు త్వరలోనే ఆహారమై పోతుంది. కాబట్టి దాన్ని నా ఆశ్రమానికి తీసుకొనిపోయి పెంచుకోవడం ఒక్కటే దీన్ని రక్షించే మార్గం అని ఆయన భావించాడు. రెండు కూడా కొంత కాలానికి పెద్ద రామచిలుకలుగా తయారై చక్కగా మాట్లాడుతున్నాయి. ఇలా ఉండగా ఒక రోజు ఈ అడవికి ఒక రాజు వేటకు వచ్చాడు. ఆయన మండుటెండలో పగలంతా వేటాడడంలో మునిగిపోయాడు. దాంతో రాజు బాగా అలసిపోయాడు. తాగడానికి ఎక్కడైనా

నీరు దొరుకుతుందా? అనుకొని వెతుక్కుంటూ నడవ సాగాడు. వేటగాడి గుడిసెకి వెళ్లాడు వేటగాడు లేడు. వేటగాడు పెంచుకుంటున్న చిలుక మాత్రం ఉంది. చిలుక రాజుని చూసి చూడగానే 'ఎవరో ఒక దొంగ వస్తున్నాడు వీడిని కట్టి పడేసి బాగా తన్నాలి అంటూ సంస్కారహీనమైన పలుకులు పలికింది. ఈ మాటలు వినేకంటే వెళ్లిపోవడం మంచిదని వెనుతిరిగి వెళ్లిపోయాడు. కాస్త దూరం నడిచిన తర్వాత రాజుకు ఒక ఆశ్రమం కనిపించింది. అది ముని ఆశ్రమం. ఆశ్రమంలో ముని లేడు.


రాజు రావడాన్ని చిలుక చూసింది. వెంటనే అయ్యా రండి రండి మీకు స్వాగతం మునివర్యులు బయటకు వెళ్లారు. ఆయన కాసేపట్లో వచ్చేస్తారు. మీరు కూర్చోండి. ముందు చల్లని నీరు తాగి, పళ్లు తిని, ఆ తర్వాత పాలు తాగండి పిదప కాసేపు నడుం వాల్చండి అలాగే రాజు విశ్రాంతి తీసుకున్నాడు. పై కథలో మనం చూసిన రెండు చిలుకలు ఒకే తల్లి కన్న పిల్లలు కానీ రెండు చిలుకల మధ్య ఎంతటి వ్యత్యాసం. దీనికి కారణం అవి పెరిగిన వాతావరణం, పొందిన శిక్షణ. మనం ఉన్నతులైన వారితో ఉన్నత సంస్కారాలు గల వారితో సాంగత్యం చేసినపుడు మనము ఉన్నతులమే అవుతాం. వర్షపు నీరు మంచినీరు అది నల్లరంగు మన్నుగల చోట నిలువ ఉంటే నల్లగా ఉంటుంది. ఎర్రరంగు మన్ను గల చోట నిల్వ ఉంటే ఎర్రగా ఉంటుంది. ఈ తారతమ్యం మట్టి రంగు కారణంగా ఏర్పడుతుంది.

37. పూలబుట్ట - చేపల తట్ట

చేపలు అమ్ముకునే యువకులు కొంతమంది ఆ రోజు తాము అన్ని అంగట్లో అమ్ముకొని ఇంటికి బయలుదేరారు. దారిలో పెద్ద వర్షం వచ్చింది. ఓ పూల వర్తకుని ఇల్లు ఆ సమీపంలోనే ఉంది. అందరికీ అతను ఆశ్రయమిచ్చాడు.

యువకులు అలాగే పడుకున్నారు. పూల సువాసన కారణంగా వారికి నిద్ర పట్టలేదు. చేపల తట్టలు తెచ్చుకొని తమ పక్కన తలలకు దగ్గర పెట్టుకొని పడుకున్నారు. అప్పుడు వెంటనే వారికి నిద్ర పట్టింది. చెడు అభ్యాసం ఇట్లాంటిదే చీకటిలో చాలా రోజులు గడిపిన వ్యక్తి వెలుతురు భరించలేరు. అంతే కాదు 'ఎవరి కంపు వారికింపు'

38. నీ సూది నీ ఇంట్లోనే వెతుక్కో..



ఓ అమ్మ కుట్టే సూది పోగొట్టుకుంది. అది ఇంట్లోనే పోయింది. ఆ ఇల్లేమో చీకటిగా ఉంది. ఇంటి ముందు వీధి ఉంది. ఆ వీధిలో వెలుతురు ఉంది. అమ్మ వెలుతురు దగ్గరికి వెళ్లి సూది వెతకడం మొదలు పెట్టింది నిజమే ఆ తల్లి సూది పోయింది నిజమే.. ప్రజలు అలాగే చేస్తుంటారు. ఎక్కడున్నదో అక్కడ వెదకరు. పక్కదారులు తొక్కుతుంటారు. ఆ నిజమైన శాంతి ఆనందం తనలోనే ఉన్నాయి. ఆ ఇల్లు తానే అక్కడే వెతకాలి కానీ మరొక చోట వెతికితే పక్కదారులు తొక్కితే సూది ఎలా దొరుకుతుందటారు. స్వామి రామ తీర్థ.

39. మనస్సును బట్టి లోకం

ఒక యోగి సమాధిలోకి వెళ్లిపోయారు. దేహ ధ్యాస లేదు. దారి పక్కన పడి ఉన్నాడు. అప్పుడు ఆ దారి వెంబడి ఓ దొంగ వచ్చాడు. ఇక్కడెవడో దొంగ ఉన్నాడు అలసిపోయి నిద్రపోతున్నాడు. ఇతణ్ణి ఇప్పుడో అప్పుడో పోలీసులు పట్టుకుంటారు. నేను ఇక్కడ ఉంటే నాకూ ప్రమాదమే. ఇలా భావించి ఆ దొంగ అక్కడి నుంచి పారిపోయాడు. ఆ తర్వాత అదే దారిలో ఓ తాగుబోతు వచ్చి

యోగిని చూశాడు. వీడెవడో తప్పతాగి బాట పక్కన పడ్డాడు. నేను చూడు ఎంత తాగినా ఎంత నిబాయించుకొని ఉన్నానో అంటూ తూలుతూ అక్కడి నుండి వెళ్లిపోయారు. ఆ తర్వాత దారిలో ఒక సాధువు వచ్చాడు. దారి పక్కన పడి ఉన్న యోగి సమాధిలో ఉన్నాడని గుర్తించాడు సాధువు. అతనిని సమీపించి సేవలు చేశాడు. 'మన మనస్సు ఎలా ఉంటే లోకం అలా కనిపిస్తుంది అంతే కదండి!

40. భౌతికమా! భావమా!..

దేశదేశాలు తిరిగి గురుశిష్యులు ఓ నది దగ్గర ఆగారు. ఆ నది దాటి వెళ్లాలి. నది ఎంత లోతుందో తెలియదు. అందుకని ఆలోచిస్తూ నిలుచున్నారు. ఈ లోగా ఒక యువతి వచ్చింది. గురు శిష్యులకు నమస్కరించి తాను అవతలి ఒడ్డుకు వెళ్లాల్సి ఉంది. గురువు గారు ఆమె దిక్కుకు కూడా చూడలేదు. నదిలోతు చూచి వచ్చి మనం నది దాటవచ్చు గురువుగారు అన్నాడు. అయితే బయలుదేరాలి అన్నాడు గురువుగారు 'నన్ను కూడా మీ వెంబడి తీసుకొని వెళ్లండి నేనొక్కదాన్ని వెళ్లలేను ఇక్కడ ఉండలేను అని యువతి వేడుకున్నది. శిష్యా! ఆ యువతిని తీసుకొని వెళ్లవద్దు అసలు స్త్రీలతో మాట్లాడడమే మహాపాపం. పురుషుల మనస్సులు స్త్రీల వల్లనే విచలితమవుతాయి. మనం వెళ్లిపోదాం పద అన్నాడు గురువు. పాపం ఒంటరిగా ఉంది అన్నాడు. నన్ను తీసుకొని వెళితే ప్రాణదానం చేసినంత పుణ్యం దక్కుతుంది అన్నది యువతి దీనంగా. పర్వాలేదు గురువుగారు ఆమెను మనం తాకకుండా తీసుకొని వెళ్దాం అన్నాడు. గురువు గారు గుర్రున చూచి బయలుదేరారు. ముగ్గురు నది దాటుతున్నారు.

గురువు, శిష్యుడు, ఆ యువతి. ఆ యువతి జారిపడుతుంటే శిష్యుడు పట్టుకున్నాడు. మరీ పొట్టిగా ఉంది. నీళ్లలో మునిగిపోయేట్టుంది అందుకని

ఆమెను భుజాల మీదకు ఎత్తుకొని ఒడ్డుకు చేర్చాడు. నది దాటాక గురు శిష్యులకు నమస్కారం చేసి వెళ్లిపోయింది యువతి. గురు శిష్యులు ఆశ్రమానికి వచ్చారు. ఆ యువతితో మాట్లాడినందుకు ఆమెను ముట్టినందుకు, భుజాలపై ఎత్తుకున్నందుకు గొణుగుతూ నాలుగు రోజులు చెవిపోరులాగా మాట్లాడుతున్నాడు. నేను ఆమెను నాలుగు గంటలు మోసాను.

మీరేమో ఆ యువతిని నాలుగు రోజులుగా మోస్తూనే ఉన్నారు. అంటూ పరిణితి మనస్వి అయిన ఆ శిష్యుడు గురువుకే బుద్ధి చెప్పాడు. భావంలో ఉంది. భౌతికంలో ఏముంది మరి..

41. ఒక కన్ను - రెండు కన్నులు

తాను చెడ్డా సరే అవతలి వాడు తనకంటే ఎక్కువగా చెడిపోతే సంతోషించే దుర్మార్గపు గుణాలు సమాజంలో ఎందరికో ఉన్నాయి. పెంటయ్య గడ్డివాము కాలిపోయింది. పోచయ్య బాగా కాలింది అన్నాడు. ఈ సంగతి పెంటయ్యకు తెలిసి కుతకుత ఉడికిపోయాడు.

ఓ నాడు పోచయ్య ఇల్లే కాలిపోయింది. హమ్మయ్య నా కళ్లు ఇప్పటికి చల్లబడ్డాయి అన్నాడు పెంటయ్య. పెంటయ్య తపస్సు చేస్తున్నాడు. ఆయన్ను చూచి పోచయ్య తపస్సుకు కూర్చున్నాడు. శివుడు పెంటయ్యకు ప్రత్యక్షమయ్యాడు. ఏదైనా పోచయ్య కన్నా రెండింతలు తనకు ఎక్కువ కావాలని కోరుకున్నాడు. ఇచ్చాను పో అని శివుడు పోచయ్య దగ్గరకు వెళ్లాడు. పెంటయ్య ఏం కోరుకున్నాడని పోచయ్య అడిగాడు.

శివుడు చెప్పాడు వెంటనే పోచయ్య తన ఒక కన్ను పోవాలని వరం కోరాడు. ఏం జరిగింది. పోచయ్యది ఒక కన్నుపోయింది. పెంటయ్యవి రెండు పోయాయి.

42. పిల్లలు - పెద్దలు

ఓ బ్రహ్మ చెవుడు తాత గారిని మనువడు, మనువరాలు రోజు దేవాలయ ప్రాంగణంలో జరిగే పురాణ ప్రవచనం దగ్గరికి తీసుకొని వచ్చి, గంటన్నర సేపు తాతగారితో కూర్చోని వెళ్లేవారు. అది నలభై రోజులు సాగాల్సిన పురాణం. ఇరవై రోజుల తర్వాత పౌరాణికుడు ఈ తాతగారిని పలకరించాడు. ఆయన మాట్లాడలేదు. పౌరాణికుని చేతిలో అరటపళ్లు, ఒక రూపాయి మంగళహారతిలో పెట్టి వెళ్లిపోయాడు. మీరు ఏం మాట్లాడినా ఆయనకు వినిపించదు కాబట్టి సమాధానం చెప్పలేదు. అని పక్కన ఉన్న వ్యక్తి పౌరాణికునితో అన్నాడు. చివరి రోజు పౌరాణికుడు అతనికి ఎదురుగా వచ్చి నమస్కారం చేసి ఒక కాగితం చేతికిచ్చాడు. తాతగారు కాగితం విప్పి చదివారు.

మీరు పెద్దవారు నన్ను మన్నించాలి. నేను చెప్పిన ఒక్కముక్క కూడా మీ చెవికి ఎక్కదని తెలిసింది. అయినా నలభై రోజులు మీరు వచ్చారు. నావైపు రెప్పవాల్చకుండా చూస్తూ నా భావనకనుగుణంగా స్పందిస్తూ కూచున్నారు. నాకేమీ అర్థం కావడం లేదు.. అజ్ఞానిని. తాతగారు ఆ పౌరాణికుని తలమీద చేయి వేసి నిమిరి ఆశీర్వదించినంత పని చేసి తన జేబులోని కలం కాగితం తీసి ఇలా రాశాడు. నా చెవులు భగవంతుడు తీసుకున్నాడు. అయినా నేను కళ్లద్వారా ప్రపంచాన్ని చదవగలను. నేను కొత్తగా నేర్చుకునేది ఏమీ లేదు. సంపాదించవలసిన అవసరం లేదు. సరిగా నడవ చేతకాదు. అసలు రాకూడదు. కానీ నేను నా కోసం రావడం లేదు. ఈ పిల్లల కొరకు వస్తున్నాను. నన్ను కనిపెట్టుకొని కూర్చున్న ఈ పిల్లలు ఇలాగైనా పౌరాణిక విజ్ఞానం పొందుతారని ఆశ. ఈ పిల్లల్లో నుండి ఓ శివాజీ, ఓ మీరాబాయి తప్పక పుట్టుకు వస్తారు చూడండి.

అది చదివిన పౌరాణికుడి కళ్లల్లో నీళ్లు తిరగగా రెండు చేతులెత్తి మొక్కుతూ అలాగే నిలబడిపోయాడు.

43. మాటలు కోటలు దాటడం కాదు..

అదోక గ్రామం ప్రమాదవశాత్తు ఆ గ్రామానికి నిప్పంటుకున్నది. ఆ నిప్పును ఎట్లా ఆర్పాలా అని సభ ఏర్పాటు చేశారు. సభలో ఒక్కొక్కరూ ఒక్కో విధంగా అంటున్నారు. తాటి ఆకులు పీకేయాలి, గుడిసెలపై మట్టి పోయాలి, మట్టిపోస్తే చల్లారదు. నీళ్లు పోయాలి, ఫైరింజన్లు పిలిపించాలి. ఎవరం వెళ్లాలో నిర్ణయించి పంపాలి. అది రాక ముందు ప్రతి ఇంటి ముందు బావులు తోడాలి. బావుల్లో నీళ్లు బాగా పడాలంటే అంజనం వేసే వాణ్ణి పిలుచుకొని వచ్చి ఎక్కడ నీళ్ళు పడతాయో తెలుసుకొని త్రవ్వకం మొదలు పెట్టాలి.

ఇంకా ఇలా చాలా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఊరూ ఊరంతా కాలిపోయింది. ప్రతి ఇంటిలోని బిందెల నీళ్లు మొదట తేవాల్సింది. అందినంత మట్టి సమీకరించి మంట మీద చల్లాల్సింది. అది చేయక ఊరు ఊరినే కాల్చుకుంటే మిగిలిందేమి? బూడిదే. లక్షల ఆలోచనల కన్నా, వేల మాటల కన్న ఒక్క ఆచరణ ముఖ్యం

44. కాపాడడం నా స్వభావం

అదో ప్రవాహం అందులోకి దిగి ఎందరో పవిత్ర స్నానాలు చేస్తున్నారు. ఓ స్వామిజీ ఆ ప్రవాహంలోకి దిగారు. పూజలు, ప్రార్థనలు చేసి మునిగి లేచారు. అప్పుడు ప్రవాహంలో కొట్టుకుపోతున్న తేలు వారి కంట పడింది. అయ్యో ప్రాణం





ఉన్న తేలు కొట్టుకొని పోతుంది అని ఆ స్వామిజీ దానిని పట్టుకొని ఒడ్డుకు విసిరేయపోయాడు. కానీ అది కుట్టింది. స్వామిజీ వదిలేశాడు. అది కొట్టుకొని పోతున్నది. స్వామిజీ మళ్లీ దాన్ని పట్టుకొన్నారు. అది మళ్లీ స్వామిజీని కుట్టింది. ఇలా ఎన్నిసార్లు కుట్టినా స్వామి తన పట్టు వదలకుండా ప్రయత్నించి దానిని ఒడ్డుకు విసిరేశాడు. స్వామిజీ ఒడ్డుకు వచ్చిన తర్వాత అది అన్ని సార్లు కుట్టిన ఎందుకు విసిరేశారు' అని అడిగారు.

కుట్టడం దాని సహజ స్వభావం – కాపాడడం నా స్వభావం. విషపురుగుకే అంత పట్టుదల ఉంటే నాకెంత ఉండాలి అందులో నేను సాధువును' అంటూ వెళ్లిపోయాడు.

45. బాటసారి- కల్పవృక్షం

భగవంతుడు కల్పవృక్షం వంటివాడు. ఆయన ఎవరేది కోరితే అది ఇస్తాడు. అయితే ఐహిక వాంఛలను వదలాలి అప్పుడే ఆ ఇచ్చింది.. ఆ మనిషికి.. సమాజానికి ఉపకరిస్తుంది. దీనికి ఒక కథ వినండి.

ఓ బాటసారి ప్రయాణంలో అలసిసొలసి ఓ చెట్టుక్రింద పడుకున్నాడు. తనకు ఓ పాన్పు ఉంటే బాగుండు అనుకున్నాడు. వెంటనే అక్కడ పాన్పు కనిపించింది. దానిమీద పడుకున్నాడు. కాళ్ళు లాగుతున్నాయి. ఒత్తితే సుఖంగా ఉంటుందనుకున్నాడు. అంతే సుందరి వచ్చి కాళ్ళు ఒత్తింది. ఆకలి అవుతుంది. మంచి ఆహారం లభిస్తే బాగుంటుందని అనుకున్నాడు. వెంటనే ఆహారం ప్రత్యక్షం అయ్యింది.

కడుపు నిండా తిని పడుకొని ఇక్కడికి పెద్దపులి వచ్చి గటుక్కున మ్రింగితే అనుకున్నాడు. అంతే పెద్దపులి వచ్చింది మ్రింగింది. ఆ బాటసారి కల్పవృక్షం క్రింద పడుకున్నాడు. కోరికలన్నీ తీరుతాయి. భగవంతుడు కూడా ఇలాగే తీరుస్తాడు.

కానీ వాటి వెనుక ఉన్న పెద్దపులిని గుర్తించకపోతే ఆ మనిషి వలే ఆ కోరికలకే బలి అయిపోయే ప్రమాదముందని ఈ కథ సందేశమిస్తుంది.

46. న్యాయబద్ధ జీవితం

నాయనా బొట్టు పెట్టుకొని అన్నం తిను అన్నాడు గురువుగారు. వ్యవసాయం చేసేటప్పుడు బొట్టు చెదిరిపోతుంది. అంటే దానికి ఎవరి ముఖంలోనన్న బొట్టు చూచి భోజనం చెయ్యి అన్నాడు. చివరికి గురువు చెప్పినట్లు ఆ రోజు నుండి భార్య ముఖంలో కుంకుమ బొట్టు చూచే భోజనం చేస్తున్నాడు. అలా 6 నెలలు గడిచిపోయాయి. ఓ రోజు ఆమె బొట్టుపెట్టుకోవడం మరచిపోయింది. పొలంలో అన్నం పళ్లెం ముందు కూర్చొని ఆమె వైపు చూశాడు. ఆమెకు అర్థం అయ్యింది. ఇంటికెళ్లి బొట్టుపెట్టుకొని వస్తానుండమన్నది. అంతసేపు ఆగలేనన్నాడు. తన పొలం పక్కనే కిష్టయ్య కుండల కొరకు మట్టి తీస్తుంటాడు. అతని ముఖం చూచి వస్తానని వెళ్లాడు. కిష్టయ్య మట్టి తీసుకుంటే బంగారు నాణేలు ఉన్న బిందె దొరికింది. అప్పుడే వచ్చిన కాపు కిష్టయ్యను చూచి పరిగెత్తుకు వెళ్లి అన్నం తినడం మొదలు పెట్టాడు. చూచింది బొట్టు,కానీ బిందె అనుకున్నాడు.

ఇదిగో చూడు కాపాయన నాకు దొరికింది నువ్వు చూచినావు. నీకు సగం నాకు సగం అని సగమిచ్చి వెళ్లిపోయాడు. ఒక్క బొట్టు నియమం పాటిస్తే ఇంత దొరికితే గురువుగారు చెప్పిన అన్ని నియమాలు పాటిస్తే ఇంకెంత దొరకాలి. అందుకే పెద్దల మాట వినాలి.

47. కోకిల తెలుపు- కొంగ నలుపు

రామలక్ష్మణులు అడవిలో సీత కోసం తిరుగుతున్నారు. అప్పుడు కోకిల తీయగా కూసింది. సీతమ్మను రాక్షసుడు ఎత్తుకొని పోయాడని కోకిల వేదనతో

కూకూ అని అరిచింది. సీత జాడ తెలిసినందుకు రాముడు సంతోషించాడు. ఓ కోకిల నీ కూత ఇలాగే మధురంగా ఉండనీ అన్నాడు. ఇప్పటికీ అలాగే తీయగా ఉంది. చేపలు తింటున్న కొంగను రామలక్ష్మణులు సీత సంగతి అడిగారు. కొంగ ఆ మాట విని విననట్టుగానే ఉంది. చేపలు పట్టుకొని తింటూనే ఉంది. లక్ష్మణుడు కోపంతో కొంగ మెడ పట్టుకొని లాగాడు. రాముడు వారించడంతో వదిలి పెట్టాడు. అప్పటి నుండి కొంగ మెడ ఇంకా పొడుగ్గానే ఉంది.

ఈ రెండు కట్టు కథలే కావచ్చు. మంచి వారికి ఏ దుర్మార్గుడైన అపకారం చేస్తే ఊరుకోకూడదు. ఎదిరించడం సాధ్యం కాకపోయినా ఎదిరించే వారికి సహకరించాలి.. లేకపోతే కొంగలా తగిన శాస్తి జరుగుతుంది.

48. శీల దేవత

సద్గుణాలన్ని దివ్యమైనవే అందువల్ల వాటిని దేవతలని పిలుచుకుంటారు. దాన దేవత, ధర్మ దేవత అలాగే శీల దేవత. ప్రహ్లాదుడు ధానధర్మాలెన్నో చేసి కీర్తి ప్రతిష్టలు గడించాడు. ఎవరేది అడిగితే అది ఇస్తున్నాడు. ఒక రోజు ఆయనకు కల వచ్చింది. కలలో ఎవరో స్త్రీ మూర్తి తన నుండి వెళ్లిపోతున్నట్లు అనిపించింది. ఎవరు మీరు అని అడిగాడు. పాడి దేవత అన్నది. ఆమె మరొకరు వెళ్తున్నారు. మీరెవరు అని అడిగితే పంట దేవత. ఈ విధంగా అందరూ ఒక్కొక్కరూ వదిలిపెట్టారు. ఎవరిని ఆపగలం అనుకున్నాడు. చివరికి దివ్య తేజస్సుతో ఒక దేవత వెళ్లిపోతున్నది.

నీవు ఎవరు అని అడిగాడు. నేను శీల దేవత అంది ఆ దివ్య జ్యోతి ప్రహ్లాదుడు ఆ నిద్రలోనే లేచి కూర్చున్నాడు. ఎవరు పోయిన సరే నీవు వెళ్లకు అని చేతులెత్తి ప్రార్థించాడు. ఆ శీల దేవత ఆగిపోయింది. వెళ్లిన దేవతలందరూ తిరిగి వచ్చారు. ఏమిటి మీరందరూ తిరిగి వచ్చారు అని అడిగాడు ప్రహ్లాదుడు.

ఎక్కడ శీల దేవత ఉంటుందో అక్కడే మేమందరం ఉంటాం అన్నాయి దివ్య శక్తులు శీలం ఉంటే అన్నీ ఉన్నట్లే అన్నమాట.

49. చరవేతి (ముందుకు సాగిపో)

కట్టెలు కొట్టి జీవించే వాడొకడు ఉన్నాడు. వాడు ఒక సారి అడవిలో కట్టెలు కొడుతున్నాడు. అప్పుడు అతనికి ఒక సాధువు కనిపించి నాయనా 'మరికొంత ముందుకు పో' అని సలహా ఇచ్చి తన దారిన తాను వెళ్లిపోయాడు. పని ముగించుకొని కట్టెలు కొట్టేవాడు ఇల్లు చేరాడు. కానీ సాధువు చెప్పిన మాట వాడి మనస్సులో ఇంకా మెదలుతూనే ఉంది. ఒక రోజు అడవిలో ముందుకు పోవాలి అని నిర్ణయించుకున్నాడు.

ఆ నిర్ణయం ప్రకారం అడవిలో ఇంకా దూరం వెళ్లే సరికి లెక్కలేనన్ని మంచి గంధపు చెట్లు కనిపించాయి. బండ్లలో మంచి గంధపు చెక్కలు తెచ్చి బజారులో అమ్మి చాలా భాగ్యవంతుడైనాడు. కాలం గడుస్తూనే ఉంది సాధువు చెప్పింది మళ్లీ గుర్తుకు వచ్చింది. అడవిలో మరింత దూరం వెళ్లాడు. అతనికి అక్కడ ఒక నది దగ్గర వెండి గని కనిపించింది. ఇలాంటి పరిణామం కలలో కూడా ఊహించలేదు.

తన అదృష్టాన్ని మెచ్చుకుంటూ గనిలో నుండి వెండి బయటికి తీసి బజారులో విక్రయించాడు. ధనవంతుడైనాడు. సాధువు 'వెండి గని ఉంది పో' అని చెప్పలేదు గదా ముందుకు సాగిపోమ్మని మాత్రమే చెప్పాడు. ఈ సారి ముందుకు పోయి చూస్తాను ఇలా అనుకొని నదిని దాటి అవతలి గట్టుకు చేరుకున్నాడు.

అక్కడ వాడికి బంగారు గని కనిపించింది. అరే చూశావా ఇందుకోసమే ఆయన నన్ను ముందుకు పోమ్మని సలహా ఇచ్చాడు. కాబట్టి మహాశయా మీరు

ఏ పని చేసినా ముందుకు సాగిపోతే మీరు సాధించిన వాటి కంటే ఇంకా విలువైనవి లభిస్తాయి. మీ హృదయంలో బంగారు గని దాగి ఉంది. కానీ అది మీకు తెలియదు.

50. మనస్సే అన్నింటికి కారణం

ఒకసారి ఇద్దరు స్నేహితులు రోడ్డుమీద వెళ్తున్నారు. దారిలో భాగవత పురాణ కాలక్షేపం జరుగుతోంది. వాళ్లలో ఒకడు ఒరేయ్ పురాణం విందాము రారా! అని లోపలికి వెళ్లి కూర్చొని వినసాగాడు. కానీ రెండవ వాడు మాత్రం లోపలికి తొంగి చూచి అక్కడి నుండి వెళ్లిపోయాడు. వాడు నేరుగా ఒక పబ్ చేరుకున్నాడు. కానీ ఎక్కువ సేపు అక్కడ ఉండలేక పోయాడు. ఆ పరిసరాలు, వాళ్ల ప్రవర్తన అతడికి విరక్తి కలిగించాయి. ఛీ ఎంత సిగ్గుచేటు నా స్నేహితుడు పవిత్రమైన హరినామాన్ని వింటూ సత్కాలక్షేపం చేస్తుంటే నేనేం చేస్తున్నాను అని పశ్చాతాప పడ్డాడు.

ఇక రెండో వాడి సంగతి వాడు భాగవతం వింటూ విసుగుచెందాడు. నేనేంతో బుద్ధి హీనుడిని వాడి వాగుడు వింటూ ఇక్కడ కూర్చున్నాను. నా మిత్రుడు ఆనందం అనుభవిస్తుంటాడు అని వాపోయాడు.

కాలం తీరి వాళ్లిద్దరు మరణించారు. యమ భటులు భాగవతం విన్నవాడిని నరకానికి, పబ్‌కి వెళ్లిన వాడిని స్వర్గానికి తీసుకువచ్చారు.

51. ఓపిక!

ఒకసారి ఒకడు బావి త్రవ్వుదామనుకున్నాడు. మరొకడి సలహా అడిగితే ఒక చోట త్రవ్వమని చెప్పాడు. 15 అడుగులు లోతు తవ్వాక దానిలో నీళ్లు పడకపోయేసరికి అతడు నిరాశ చెందాడు. ఇంతలో అక్కడికి మరొకడు వచ్చి

తెలివి తక్కువ ప్రయత్నాన్ని హేళన చేసి తనకు తోచిన మరొక చోట తవ్వమని సలహా ఇచ్చాడు. అక్కడకు వెళ్లి మళ్లీ తవ్వడం ప్రారంభించాడు. ఇలా 30 అడుగులు త్రవ్వి వదిలేశాడు. అప్పటిదాక నాలుగుచోట్లలో కలిపి 85 అడుగులు తవ్వాడు. అతడే కనుక ఓపిక పట్టుదల ఉంటే ఒకే చోట దానిలో సగం లోతు తవ్వినా తప్పకుండా నీరు లభించేది. ఓపికతో ప్రయత్నిస్తూ వెళ్లడం ముఖ్యం.

52. విజయం అంటే ఏమిటి?

మన దేశం నుండి ఒక ప్రొఫెసర్ అమెరికా వెళ్లారు. అక్కడ ఒక కాలేజీలో విద్యార్థులతో మాట్లాడుతూ విజయం అంటే ఏమిటి? అని అడిగితే ఒక యువతి "విజయం అంటే ఎక్కువ ధనం సంపాదించడం" అనింది.

అపుడు ఆ ప్రొఫెసర్ అయితే ఇరవైఏళ్ళ క్రితం ప్రపంచంలో అత్యంత ధనవంతుడు ఎవరో చెప్పండి? అంటే ఎవరూ చెప్పలేదు. (ఎందుకటే ప్రతి ఏడాదికి అది మారిపోతూవుంటుంది కాబట్టి) బ్రతకడానికి కొంత ధనం కావాలి కానీ, ధనమే బ్రతుకు కాదు. అంటే విజయమంటే ధన సంపాదనకాదన్నమాట.

మరో యువకుడు లేచి "విజయం అంటే బలం/శక్తి" అన్నాడు. అలా అయితే అలెగ్జాండర్, నెపోలియన్, ముస్సోలిని, హిట్లర్, స్టాలిన్, బిన్ లాడెన్ వీళ్ళంతా బలవంతులు, ప్రపంచాన్ని గెలవాలని అనుకొన్నవారే కదా, వీళ్ళు జీవితంలో సంతోషంగా వుండగలిగారా? వీళ్ళ జీవితాలు ఎలా గడిచి, ముగిశాయో చరిత్ర చెపుతున్నది కదా!

తన బలంతో, తన ముష్టిఘాతాలతో మహా బలవంతులను మట్టికరిపించిన మహమ్మద్ అలీ అనే ప్రపంచ చాంపియన్ బాక్సర్, తరువాత కొన్నేళ్ళకు పార్కిన్ సన్ వ్యాధి వల్ల కాఫీకప్పును కూడా పట్టుకోలేక పోయాడు.

అయితే విజయమంటే బలం/శక్తి సంపాదన కాదు అన్నమాట.

మరో యువతి "విజయమంటే ప్రఖ్యాతి, అందం" అంది. అయితే కేట్ మోస్, జీన్ ష్రింప్టన్, సోఫియాలారెన్, మార్లిన్ మన్రో లాంటి అతిలోక సౌందర్యవతుల జీవితాలు ఎంత బాధాకరంగా వుండేవో చాలామందికి తెలియదు.

భారత్ విషయానికొస్తే, పర్విన్ బాబీ అనే ఒక హిందీ హీరోయిన్ వుండేది. ఆమె ఎంత అందగత్తే అంటే, అమితాబ్ బచ్చన్‌తో సహా, ఆమెను పెళ్ళి చేసుకోవాలి అని అనుకొనని హిందీ సినిమా హీరోనే లేదు. డానీ, కబీర్ బేడీ, మహేష్ భట్‌లతో ఆమె ప్రేమ, పెళ్ళి నడిచి అవన్నీ విఫమయ్యాయి. ధర్మేంద్ర, రాజేష్ ఖన్నా, అమితాబ్ బచ్చన్ ఇలా అందరూ ఆమె వెంట పడ్డవారే.

కొద్దిరోజులకు ఆమెకు జీవితం అంటే శూన్యం అని తెలిసిపోయి, నమ్మిన వాళ్ళు మోసం చేస్తే, తాగుడుకు బానిస అయ్యి, ఒక దశలో కాలికి కురుపు లేచి, అది ఒళ్ళంతా ప్రాకి, ఏ శరీరం కోసం అయితే అంతమంది మగవాళ్ళు పిచ్చిక్కిపోయారో, అదే శరీరమే కంపు వాసన కొడుతూవుంటే, ఆమెకు ఏదో వింతవ్యాధి వచ్చిందని, జనం ఆమెను తాళ్ళతో కట్టి, ముంబాయి వీధుల్లో లాగుకొంటూ తీసుకెళ్ళి ఆమె ఇంట్లో పడేస్తే, ఆఖరుకు పక్కింటి వాళ్ళు ఆమె ఇంట్లోనుండి భరించలేనంత కంపు వస్తోందని ఫిర్యాదు చేస్తే, కార్పొరేషన్ వాళ్ళు వచ్చి 3 రోజులక్రితమే చనిపోయిన ఆమెను చూసి తీసుకెళ్ళి పూడ్చేసారు.

మన తెలుగు చలన చిత్ర కథానాయిక సావిత్రి గారి అందం సంపద అన్నీ కరిగిపోయి చివరకు అవసాన దశలో ఆమెకు భయంకరమైన మరణం సంభవించింది.

అయితే అందం, ప్రఖ్యాతి అనేవి విజయం కావన్నమాట. మరోసారి మరొకరు "విజయమంటే అధికారం" అని అన్నారు. అయితే కాగితం మీద ఈ దేశాన్ని పాలించిన ప్రధానమంత్రుల పేర్లు అన్నీ వ్రాయండి అని అంటే వున్న 50 మందిలో 39 మంది అందరు ప్రధానుల పేర్లూ వ్రాయలేకపోయారు.

మా అనంతపురంలో ఒకప్పుడు రాష్ట్రపతిగా వెలిగిన సంజీవరెడ్డి గారి ఇంటిదగ్గర ఇపుడు పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి, పందులు దొర్లుతున్నాయి. విజయం అంటే అధికారం కాదు అన్న మాట.

చివరగా ఆదే ప్రొఫెసర్ భారత్‌లో మరో యూనివర్సిటీలో యువతీ యువకులను ఇదే ప్రశ్న వేసారు "విజయం అంటే ఏమిటి?" అని, అందరూ మౌనంగా వుంటే అపుడు ఆయన అన్నారు, 'మీ అవ్వ తాతల పేర్లు మీకు తెలుసా?" అందరూ తెలుసు అన్నారు. 'వాళ్ళ అవ్వ, తాతల పేర్లు తెలుసా?' అని అడిగితే అయిదారుమంది 'తెలుసు' అన్నారు. 'వాళ్ళ అవ్వ తాతల పేర్లు తెలుసా?" అని అడిగితే "తెలియదు" అన్నారు. అపుడు ప్రొఫెసర్ గారు" శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, బుద్ధుడు, ఆదిశంకరుడు, అందరూ 'ఓ, తెలుసు' అని ముక్తకంఠంతో బదులిచ్చారు. మీకు మీ స్వంత అవ్వ తాతలు గుర్తుకులేరు కానీ మీరు ఎన్నడూ చూడని వీళ్లంతా ఎలా గుర్తుకున్నారు? అని అడిగినపుడు పద్మిని అనే ఒక యువతి, ప్రొఫెసర్ గారు అంతదాకా చేసిన గొప్ప ఉపన్యాసానికి చాలా ఎమోషనల్ అయ్యి కళ్లలో నీరు తిరుగుతుండగా ఇలా అనింది, 'సార్, మీ ప్రశ్నకు నేను జవాబు చెపుతాను. మాకు మా పూర్వీకుల పేర్లు తెలియకపోవడం రాముడు, కృష్ణుడు, బుద్ధుడి పేర్లు ఇంకా గుర్తువుండటానికి కారణం, తమ కోసం, తమ కుటుంబం కోసం మాత్రమే జీవించేవారిని ఈ లోకం మరచిపోతుంది, ఇతరులకోసం జీవించేవారిని ఈ లోకం ఎప్పటికీ గుర్తుకుపెట్టుకొనేవుంటుంది. ఇదే విజయం అంటే.!

"నా గురించి నేను దుఃఖించకపోవడమే నా ఆనందానికి కారణం" అని 2600 ఏళ్ళ క్రితం బుద్ధుడు చెప్పిన మాట, "ఇతరులకోసం జీవించేవారే నిజంగా జీవించినట్టు, అలా చేయని ఇతరులు జీవించివున్నా మరణించినట్టే లెక్క" (Only they live who live for others , the others are more dead than alive) అని వివేకానంద 1896 లో అన్న మాట ఇదే కదా.

53. తాను ఆచరించిన దానినే మరొకరికి చెప్పాలి..

ఒకసారి ఒక వైద్యుడు రోగికి మందు ఇస్తూ ఇవాళ నీకు మందు ఇచ్చాను గదా.. పత్యం సంగతి చెబుతాను. ఫలానా రోజు రా అన్నాడు. రోగి చాలా దూరం నుండి వచ్చాడు. అప్పుడు వైద్యుడు ఆ రోగితో ' అబ్బాయి పత్యం విషయంలో నీవు జాగ్రత్తగా ఉండాలి. బెల్లంపాక తినడం నీ ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి దీనిని నువ్వు ముట్టవద్దు అని చెప్పాడు. సరే అని సెలవు తీసుకొని రోగి వెళ్లిపోయాడు. ఇదంతా గమనిస్తున్న ఒక వ్యక్తి వైద్యునితో డాక్టర్ గారు ఎంతో దూరం నుండి వచ్చిన ఆ రోగిని మళ్లీ రమ్మన్నారు. సలహా ఆ రోజే చెప్పి ఉండవచ్చు కదా.. ఆ రోజే చెప్పి ఉంటే నా మాట మీద విశ్వాసం కలగదు. నా గదిలో చాలా జాడీల నిండా బెల్లం పాకం ఉంది. బెల్లం పాకం అంత చెడ్డది అయితే వైద్యుడు ఎందుకు తింటాడు. అందువల్ల నా గదిలో నుండి జాడీలన్నింటిని తీసివేయించాను. నేను కూడా మానేశాను. అందుకే ఈ రోజు చెప్పాను.

54. ఏడు బిందెల బంగారం



ఒక బుద్ధిమంతుడు ఒక భూతం ఆవహించిన చెట్టు కింద నడుస్తూ బంగారంతో నిండిన ఏడు బిందెలు నీకు కావాలా? అన్న అదృశ్య వాణిని విన్నాడు. ఎవ్వరూ కనపబడలేదు. ఏడు బిందెల బంగారం ఇస్తానన్న మాట అతడిలో పేరాశ కలిగించింది. వాడు హా! తీసుకుంటాను అని గట్టిగా అరిచాడు.'ఇంటికి పో ఆ ఏడు బిందెల్ని నీ ఇంటికి చేర్చాను అని సమాధానం వినిపించింది. ఇల్లు చేరి చూసేసరికి బిందెలు ఎదురుగా కనపడ్డాయి. తెరిచి చూస్తే అన్ని బంగారు నాణేలతో నిండి ఉన్నాయి. కానీ ఏడవ దానిలో

కొంచెం వెలితి ఉంది. ఆ మంగలి మనస్సులో ఇప్పుడొక తీవ్రమైన కోరిక కలిగింది. ఏడవ బిందెను కూడా నింపాలని తన ఇంట్లో ఉన్న వెండి, బంగారం నగలన్నింటిని అమ్మివేసి వరహాలుగా మార్చి ఆ బిందెలో వేశాడు. ఆ బింది నిండలేదు. దానిలో ఇంకా కొంత వెలితి ఉంది. దీంతో ఆ యువకుడికి చాలా అసంతృప్తి తీరని ఆరాటం కలిగాయి. సరిగా తిండి కూడా తినకుండా కడుపు మాడ్చుకొని మరి కొంత ధనం పోగు చేసి ఆ బిందెలో వేశాడు. కానీ ఆ వింత బిందె ఎప్పటిలా వెలితిగానే ఉంటుంది. రాజుగారి వద్ద పని చేసేవాడు. తన జీతాన్ని పెంచమని కోరాడు. రాజు వాడి జీతం రెట్టింపు చేశాడు. లోకంలో కొందరి పరిస్థితి ఇలాగే ఉంటుంది. భర్తీ చేయడానికి చేసే ప్రయత్నంలో ఉన్నదానితో సంతోషంగా ఉండట్లేదు.

55. దేవుడు నవ్వుతాడు


ఒక రోగి తల్లితో వైద్యుడు భయపడకమ్మా తప్పకుండా మీ కొడుకు వ్యాధి నేను నయం చేస్తాను అన్నప్పుడు దేవుడు నవ్వుకుంటూ 'నేను అతని ప్రాణాలను కొన్ని క్షణాల్లో తీసువేయబోతున్నాను. ఇతడేమో అతణ్ణి రక్షిస్తాను అంటున్నాడు. భగవంతుడే అన్ని చేసేవాడని మర్చిపోయి ఆ వైద్యుడు తాను సర్వశక్తుమంతుడిని అనుకుంటున్నాడు.

ఈ వైపు భూమి నాది. ఆ వైపు భూమి నీది అనుకుంటునప్పుడు భగవంతుడు మళ్లీ నవ్వుతాడు. ఈ విశ్వమంత నాది కానీ వాళ్లు ఇది నా భాగం అది నీ భాగం అనుకుంటారే అని తనలో తాను నవ్వుతుంటాడు.

56. దేవుడు నీలోనే ఉన్నాడు

మానవుడు దేనినైతే వెతుకుతున్నాడో అది అతడికి సమీపంలోనే ఉంది. అయినా అతడు దానిని అక్కడ ఇక్కడ వెతుకుతుంటాడు. ఒకడు చుట్ట కాల్చుకోవాలని అనుకున్నాడు. నిప్పు కోసం పొరుగింటికి వెళ్లాడు. అది అర్ధరాత్రి కావడం వల్ల అందరూ గాఢ నిద్రలో మునిగి ఉన్నారు. వాడు మొదట పిలిచాడు. తలుపు తట్టాడు. ఎవరు పలుక లేదు. అందరూ గాఢ నిద్రలో మునిగి ఉన్నారు. తరువాత తలుపుని బాదడం మొదలు పెట్టాడు. తలుపు తీశారు. 'ఏమిటండి ఏం సంగతి ఇంత రాత్రి వేళ వచ్చారు. అని ప్రశ్నించాడు. ఆ ధూమపాన ప్రియుడు వెంటనే ఆ మాత్రం తెలీదా? నాకు చుట్ట కాల్చడం అంటే ఇష్టం అని నీకు తెలియదా? నిప్పు అడుగుదామని వచ్చాను. బిగ్గరగా నవ్వుతూ 'మీరు భలే వారండి దీని కోసమా ఈ అర్ధరాత్రి తలుపు బాధుతున్నారు. వెలుగుతున్న లాంతరు మీ చేతిలోనే ఉంది కదా! అన్నాడు.


57. శుభస్య శీఘ్రం



వెనుకటికొకడు సముద్రంలో స్నానానికి బయలుదేరాడు. సముద్రంలో ఆటు-పోట్లతో వచ్చే అలలను చూసి హడలిపోయి అలలు తగ్గిన తర్వాత స్నానం చేద్దామని తీరుబడిగా సముద్రం ఒడ్డున కూర్చున్నాడు. సముద్రంలో అలలు ఆగే ప్రసక్తే లేదు కాబట్టి అతను నిరీక్షణను చాలించి ఇంటి ముఖం పట్టాడు. ఇదే మన జీవితంలో మనకు తెలియకుండా జరిగే కథ. మన జీవితంలో ఎప్పుడు ఏదో ఒక సమస్య ఉండనే ఉంటుంది. అయితే మనం ఈ సమస్యలు

సమసిపోయిన తర్వాత కార్యోన్ముఖులం అవుదామనుకోవడం వెర్రితనం. 'శుభస్య శీఘ్రం' అనడం అలవాటు చేసుకొని పనులను వాయిదా వేయ్యడం మానేయ్యాలి. 'లేవండి మేల్కొండి గమ్యం చేరే వరకు విశ్రమించకండి' అనే విషయం మన హృదయాంతరాలలో ఎల్లపుడు మారుమోగుతూ ఉండాలి.

58. దృఢ నిశ్చయుడైన రైతు కథ



ఒక ప్రాంతంలో ఒకప్పుడు అనావృష్టి సంభవించింది. చాలా దూరంలో ఏటి నుండి తమ పొలంలోకి నీరు పారటానికి రైతులు కాలువలను త్రవ్వాలనుకున్నారు. కాలువ, ఏటిని కలిపే వరకు తమ కాలువను త్రవ్వటం ఆపనని శపథం చేశాడు. అతడు త్రవ్వడానికి ఉపక్రమించాడు. స్నానం చేసే వేళ అవడంతో అతడి భార్య, కుమార్తెతో నూనె పంపించింది. 'నాన్న ఒంటికి నూనె పట్టించుకొని స్నానం చేయి అంది' వెళ్లిపో ఇక్కడి నుంచి ఇంకా ఎంతో పని చేయాల్సి ఉంది అంటు గద్దించాడు.

రైతు మధ్యాహ్నం దాటిపోయిన రైతు ఇంకా పొలంలోనే ఉన్నాడు. భార్య పొలానికి వచ్చి 'నువ్వు అన్ని అతిగా చేస్తావు మిగిలిన పనిని రేపు చేసుకోవచ్చు అన్నది. రైతు కోపావేశంతో ఇలా గద్దించాడు. నీకు ఏమైనా బుద్ధి ఉందా వర్షాలు బొత్తిగా లేవు. పంటలు ఎండిపోతున్నాయి. పిల్లలు ఏమి తింటారు అని అనగానే భార్య అక్కడి నుండి వెళ్లిపోయింది. శ్రమించి సాయంకానికి తాను తవ్విన కాలువను ఏటితో కలపగలిగాడు. తరువాత గలగల ధ్వనితో నీరు తన పొలంలోకి

పారటంతో ఆ రైతు తాపీగా కూర్చొని చూడసాగాడు. ఇంటికి వెళ్లి భార్యను పిలిచి ఇప్పుడు నూనె పట్రా అన్నాడు. ప్రశాంతంగా స్నానం చేసి తృప్తిగా భోజనం చేసి చీకు చింత లేక హాయిగా నిద్రపోయాడు. ఆ రైతు కనబరిచిన దృఢ సంకల్పం అంకిత భావానికి ఒక ఉదాహరణ..

59. పలాయనం చిత్తగించకు క్లిష్టపరిస్థితులను ప్రతిఘటించు - కర్ణుడి కథ

కవచకుండలాలతో బోసి నవ్వులు చిందిస్తూ పసిపాపగా ఉన్న కర్ణుడిని పుట్టగానే కుంతి దేవీ పెట్టెలో పెట్టి నదిలో వదిలివేస్తుంది. భార్గవ రాముని వద్ద తాను క్షత్రియ పుత్రుడిని అని నిజాన్ని కప్పి పుచ్చి బ్రాహ్మణుడను అసత్యం పలికి అస్త్రశస్త్రాలను నేర్చుకున్నాడు. ఆ తర్వాత నిజం బయట పడినపుడు భార్గవ రాముడు తాను ఇచ్చిన అస్త్రాలేవీ ఉపకరించవని కర్ణుడిని శపించాడు. కర్ణుడు అధైర్యపడకుండా ముందుకు సాగాడు. కర్ణుడు పొరపాటున ఒక గోవుని చంపాడు. దాంతో ఆ గోవు యజమాని ఇలా శపించాడు. 'నా జీవనాధారాన్ని పోగొట్టావు కాబట్టి నీవు యుద్ధ భూమిలో నిరాయుధుడిగా మరణిస్తావు' కర్ణుడు ఈ శాపానికి కుంగిపోలే ధైర్యంతో ముందుకుసాగాడు.

ఒక బాలిక చేతిలో ఉన్న నూనె నేలపై పడిపోగా ఆ మట్టిని పిండి తిరిగి నూనెను తీసి బాలికకు ఇచ్చే ప్రయత్నం చేసాడు కర్ణుడు. 'నా గుండెను పిండావు కాబట్టి యుద్ధ సమయంలో నీ రథం నేలలో కుంగిపోతుంది' అని శపించింది భూమాత. ఇన్ని క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా కవచ కుండలాలను కపటవేషధారి ఇంద్రుడు దానంగా అడిగితే మారు మాట్లాడకుండా మరో ఉద్దేశం లేకుండా కవచ కుండలాలను దానం చేసేసాడు.

ఇన్ని శాపాలు ఉన్నప్పటికీ, యుద్ధ భూమిలో తన రథం కుంగిపోతుందని తాను నిరాయుధుడిగా యుద్ధభూమి యందు మరణిస్తానని ముందుగా తెలిసినా కర్ణుడు యుద్ధ రంగానికి వెళ్లడం మానలేదు. యుద్ధరంగంలో పోరాడి వీరుడిగా మరణించాడు..

60. ఆత్మవిశ్వాసం.. డెమస్తనీసు విశ్వవిఖ్యాత ఉపన్యాసకుడు

తనపై తనకు అఖండ విశ్వాసం ఉన్న ప్రతి వ్యక్తి జీవితంలో పతాకస్థాయికి ఎదుగుతాడు. తాను ఒక మహోపన్యాసకుడు కావాలన్నదే డెమస్తనీసుకు ఉన్న తీవ్ర అభిలాష. డెమస్తనీసు అకుంఠిత ఆత్మవిశ్వాసం అతని స్వప్నాన్ని సాకారం చేయడంలో కీలకమైన పాత్ర వహించింది. అతను ఎన్ని విషమ పరిస్థితులను ఎదుర్కొన్నాడో చూద్దాం..

తన ఏడవ యేటనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిపోయాడు. అతని తండ్రి నుండి సంక్రమించవలసిన ఆస్తిని బంధువులు రాబందులవలే కొట్టుకుపోగా.. న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. అతనికి నత్తి ఉండటం వలన స్పష్టంగా మాట్లాడలేకపోయేవాడు. పెద్ద వాక్యాలను అనర్గళంగా చెప్పలేకపోయేవాడు. అతనికి మొహమాటం ఎక్కువగా ఉండి పదిమంది ముందు నిస్సంకోచంగా మాట్లాడలేకపోయేవాడు. అతని వాక్కు చాలా బలహీనంగా ఉండి స్పష్టమైన ఉచ్చారణ ఉండేది కాదు.

ఈ సమస్యలన్నింటిని అఖండ ఆత్మవిశ్వాసమనే ఖడ్గంతో ఖండించి వేశాడు. వైద్యుల సలహా ప్రకారం తన నాలుక కింద గులక రాళ్లు ఉంచుకొని స్పష్టంగాను, బిగ్గరగాను ఉచ్చరించడానికి విసుగు విరామం లేకుండా కృషి చేశాడు. సముద్ర తీరంలో ఒంటరిగా కూర్చొని గట్టిగా గంభీర కంఠంతో మాట్లాడడం సాధన

చేశాడు. రోజుకు 15 గంటల పాటు గ్రంథాలయంలో అనేక పుస్తకాలు చదివి విద్యా వాచస్పతి అయ్యాడు. గది లోపల నుండి గొళ్లెం పెట్టి, ఒక పెద్ద అద్దం ముందు నిలబడి తన శరీరాన్ని తాను శ్రద్ధగా గమనిస్తూ గంభీర ఉపన్యాసాలను ఇవ్వడం సాధన చేసేవాడు. చిట్ట చివరకు మహావక్తగా నివాళులు అందుకున్నారు. అకుంఠిత ఆత్మవిశ్వాసం ఉంటే ఎంతటి మహోన్నత స్వప్నాన్ని అయినా యదార్థంగా మార్చగలమని డెమస్తనీసు మనకు రుజువు చేశాడు.

61. పరనింద చేయడం హానికరం!

ఒక దేవాలయం సమీపంలో ఒక సన్యాసి నివసించేవాడు. ఎదురుగా ఒక వేశ్య ఇల్లు ఉండేది. విటులు నిరంతరం ఆమె ఇంటికి వస్తూ పోతూ ఉండడం



చూసి సన్యాసి ఆమెను ఒక రోజు ఇలా మందలించాడు. 'నువ్వు మహా పాపివి రేయింబవళ్లు పాపానికి ఒడిగడుతున్నావు. నీకు భయంకరమైన దుర్దశ కలుగుతుంది. ఈ మాటలు విన్న వేశ్య ఎంతో పరితపిస్తూ తన పాపాలను క్షమించమని భగవంతున్ని ప్రార్థించేది. కాని సన్యాసి గారు భగవచ్చింతన లేక ఎప్పుడు వేశ్య చేసే పాపాల గురించే ఆలోచిస్తూ తన సమయాన్ని వ్యర్థం చేసుకునే వాడు.

కొన్ని గులకరాళ్లు పోగు చేసుకొని ఆ వేశ్య ఇంట విటుడు ప్రవేశించినప్పుడల్లా ఒక గులక రాయిని తీసి గుర్తుగా ఒక చోట వేయసాగాడు. క్రమంగా ఆ రాళ్ళు ఒక పెద్ద గుట్టగా తయారైంది. ఒక రోజు సన్యాసి వేశ్యకు

ఆ గుట్టను చూపిస్తూ చూశావా నీ పాపాల గుట్ట నీకు ఘోర దుస్థితి కలుగుతుంది అని భయపెట్టాడు. పాపం ఆ వేశ్య తన పాపరాశిని చూసి భయకంపితురాలై భగవంతుడితో మొరపెట్టుకుంది.

ఆమె దీనమైన ప్రార్థనను భగవంతుడు ఆలకించి కరుణించాడు. ఆ రోజే వేశ్య మరణించింది. సన్యాసి కూడా అదే రోజు మరణించాడు. యమదూతలు ఆ సన్యాసిని నరకానికి తీసుకొని వెళ్తుండగా, విష్ణు దూతలు వచ్చి ఆ వేశ్యను వైకుంఠానికి తీసుకుపోతున్నారు. అది చూసి సన్యాసి కోపంతో ఇలా అన్నాడు. 'ఇది అన్యాయం, భగవంతుడి విధానంలో ధర్మం లోపిస్తుంది. విష్ణు దూతలు ఇలా సమాధానం చెప్పారు.

'నువ్వు జీవితమంతా నీ మనస్సులో వేశ్య చేసే పాప కార్యాలను మననం చేయడంలోనూ, ఆమెను నిందిచండంతోనే గడిపావు. కానీ ఈ వేశ్య తన శరీరం పాపం చేసినా ఆమె మనస్సు అహర్నిషలు హృదయపూర్వకంగా భగవంతుడిని ప్రార్థించింది. విధాత నిర్ణయం ఎల్లప్పుడు న్యాయబద్ధంగానే ఉంటుంది.

62. మహాకవి కాళిదాసు

మహాకవి కాళిదాసు మొదట్లో ఒక నిరక్షరాస్యుడు మహా పండితురాలైన యువరాణి తనను శాస్త్ర చర్చలలో ఓడించిన వాణ్ణి వివాహం చేసుకుంటానని ప్రకటించింది. ఓడిపోయిన వారిని గాడిదపై ఊరేగించి దేశం నుంచి తరిమి వేయబడుతుంది. ఇది వరకు మహారాణితో శాస్త్ర చర్చల్లో ఓడిపోయిన కొందరు పండితులు ఒక పన్నాగం పన్ని మూర్ఖుడైన కాళిదాసుతో ఆమె వివాహం జరిపించారు.

కాళిదాసు మూర్ఖుడనే విషయం బయటపడగానే యువరాణి కాళిదాసును తీవ్రంగా అవమానించింది. తన ఆత్మగౌరవం మంట కలిసి అవమానంతో

కృంగిపోయాడు కాళిదాసు. ఈ మానసిక వేదన అతనిలోని ఆత్మవిశ్వాసాన్ని రగిలించింది. అతడు ఇంటిని వదలివెళ్లి 12 సంవత్సరాల కఠోర శ్రమపడి మహాపండితుడిగా మారిపోయాడు.

రఘువంశము, కుమార సంభవము అనే మహత్తర కావ్యాలను రచించాడు కాళిదాసు. 'అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్ని మిత్రము' మొదలైన మహత్తరమైన నాటకాలు మహాకవి కాళిదాసు కలం నుండి వెలువడినవే. ఏవరికైతే అవమానం జరుగుతుందో అప్పుడు జీవితం మీది కసి పెరుగుతుది.

63. ధృవ నక్షత్రం


ఉత్తానపాత మహారాజుకు సునీత, సురిచి అనే ఇరువురు భార్యలుండేవారు. ఈయనకు సునిత వల్ల ధృవుడు, సురిచి వల్ల ఉత్తముడు అనే కుమారులు కలిగారు. సురిచి ఉత్తానపాత మహారాజును ఆధీనంలో ఉంచుకొనటం చేత సునిత పనిమనిషి వలే జీవితం వెళ్లిబుచ్చవలసి వచ్చింది. ధృవుడు 5 సు॥లు వయస్సులో ఉన్నపుడు ఒకసారి ఇరువురు రాజకుమారులు మహారాజు ఒడిలో కుర్చుందామని పరిగెత్తారు. గర్విష్టి అయిన సురిచి ధృవుణ్ణి చీదరిస్తూ తన కడుపున పుట్టకపోవడం వల్ల ధృవుడికి ఆ అర్హత లేదని అవమానించింది. సునిత అవమానభరితుడైన తన కుమారుడిని ఓదార్చి భగంతుని కోసం తపస్సు చేయమని సలహా ఇచ్చింది.

ధృవుడు నారద మహాముని వద్ద నుండి 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే మంత్రాన్ని దీక్ష తీసుకొని తపస్సుకు పూనుకున్నాడు. నిద్రాహారాలు మాని ఆరునెలలు ఏకధాటిగా తపస్సులో లీనం అయిపోయాడు. స్వర్గలోకం కూడా కంపించి పోయే అతని తపస్సుకు మెచ్చి విష్ణు దేవుడు ప్రత్యక్షమైనాడు. తన శంఖంతో ధృవుడి గడ్డాన్ని స్పృశించి అతడు కోరిన రాజ్యాన్ని అనుగ్రహించడమే

గాక జీవిత అంతిమ దశలో అతడు నక్షత్రంగా వెలుగుతూ మహా ప్రళయం సంభవించినపుడు కూడా వినాశనం చెందదని వరం ఇచ్చాడు.

ధృవుడు తన రాజ్యానికి తిరిగి రాగానే అందరూ అతణ్ణి ఎంతో గౌరవంతో ఆదరించి అంత చిన్న వయస్సులోనే సింహాసనంపై అధిష్టింప చేశారు. ధృవుడు చాలా కాలంపాటు ధర్మబద్ధంగా రాజ్యపాలన చేసి చివరకు నక్షత్రస్థితిని పొందాడు.

64. నైతిక ధైర్యం



గ్రద్ధ నైతిక ధైర్యానికి ఒక మహోత్తరమైన ఉదాహరణ. గద్దకు 70 ఏళ్లపాటు జీవించే అవకాశం ఉంది. నైతిక ధైర్యం విషయంలో గ్రద్ద మనకు అనేక గూఢ రహస్యాలను తెలియజేస్తుంది. గ్రద్ధకు 40 ఏళ్ల వయస్సు వచ్చేటప్పటికి అనేక సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. అపుడు దానికి రెండే మార్గాలు. 1. మరణించడం, 2. అత్యంత బాధాకరమైన మార్పుని అనుసరించి 150 రోజుల పాటు కఠోర శ్రమ చేయడం గ్రద్ధకు ఉన్న ఈ అసాధారణమైన మానసిక ధైర్యం భౌతిక శరీరాన్ని వదిలివేయకుండానే పునర్జన్మనిస్తుంది. నైతిక ధైర్యం అండతో గ్రద్ధ అత్యంత బాధాకరమైన జీవిత పునర్నిర్మాణ కార్యక్రమం మొదలు పెడుతుంది.

40 సం॥ల వయస్సులో ఈ క్రింది సమస్యలు ప్రారంభమవుతాయి.

1. పొడవుగా, వాడిగా, పదునుగా ఉండే దాని ముక్కు నిరంతర రాపిడి వల్ల అరుగుదల వల్ల కుంగిపోతుంది.

2. పొడవుగా ఉండి సులభంగా వంగి ఆహారాన్ని సులభంగా తన్నుకు తీసుకుపోయేందుకు ఉపకరించే దాని కాలి గోళ్ళు బలహీనమై ఆహారాన్ని గుంజుకు

తీసుకుపోయే సామర్థ్యాన్ని కోల్పోతాయి.

3. వయస్సు వల్ల దాని బరువైన రెక్కలు, దట్టమైన ఈకలు దాని గుండెకు అతుక్కొని పోయి ఎగరడం కష్టం కలిగిస్తాయి.

ఈ సమయంలో అది పర్వతాల మీదకు పోయి అక్కడ ఒక గూడును నిర్మించుకుంటుంది. అప్పుడు కొండరాతిపై తన ముక్కును ఢీ కొడుతూ దాన్ని రాల్చివేసి దాని ప్రదేశంలో ఒక కొత్త ముక్కు పెరిగే వరకు వేచి ఉంటుంది. అప్పుడు కొత్తగా వచ్చిన ముక్కుతో తన కాలి గోళ్లను పీకివేసి కొత్త గోళ్లు పెరిగే వరకు వేచి ఉంటుంది.

కొత్త గోళ్లు పెరిగిన తర్వాత ఎంతో బాధకు ఓర్చి తన బరువైన రెక్కలను పీకి వేసి కొత్త రెక్కలు ఎదిగే వరకు వేచి ఉంటుంది. ఈ విధంగా 5 నెలలు పాటు అష్టకష్టాలు పడి ఒక నూతన జీవితాన్ని పొంది మరొక 30 సం॥లు జీవిస్తుంది. క్లిష్ట పరిస్థితుల్లో నైతిక ధైర్యంతో నవీన పద్ధతుల్లో మార్పును అనుసరించాలి.

65. మానసిక ధైర్యం - గాడిద



ఒకానొకసారి ఒక రైతు యొక్క ముసలి గాడిద పాడుపడిన నుయ్యిలో కాలు జారి పడిపోయింది. మొదట్లో ఆ రైతు గాడిదను రక్షించడానికి అయిష్టతతో ప్రయత్నించాడు. తదుపరి ఈ పని కష్టంగా కనిపించి ఇలా ఆలోచించాడు.

1. ఈ ముసలి గాడిదను రక్షించడం వల్ల ఒరిగేదేమీ లేదు. 2. ఈ పాడుబడిన నుయ్యిని పూడ్చి వేయాలి. దీని వల్ల ఇందులో ఎవరైన పడే ప్రమాదం తప్పుతుంది.

వెంటనే ఆ రైతు తోటి వారిని సహాయానికి పిలిచి ఆ నూతిలో మట్టిన

పోయడం ప్రారంభించాడు. జరుగుతున్న ప్రమాదాన్ని పసిగట్టిన ముసలి గాడిద నిస్సహాయంగా అరవడం మొదలు పెట్టింది. అరవడంతో ప్రయోజనం లేదని మానసిక ధైర్యంతో మాత్రమే తప్పించుకోగలననే ఆలోచనకు వచ్చింది. పార నుండి తనపై మట్టి పడగానే వదిలించుకొని ఆ మట్టి పైకి ఎక్కి నిలబడసాగింది. ఈ విధంగా రైతులు పారతో మట్టి పడవేసినపుడల్లా విదిలించుకొని ఆ మట్టి పైకి ఎక్కుతూ చివరకు నూతి నుండి బయటకు వచ్చి పారిపోయింది.

66. టేకు చెట్లు - ఓర్పు



మనం టేకు చెట్ల పెంపకం నుండి ఓర్పును గురించి చాలా నేర్చుకొనవచ్చును. టేకు చెట్టు దాదాపు 30 నుంచి 40 మీటర్లు ఎదగగలదు. ఇందుకు దాదాపు 30 సు॥లు వ్యవధి కావాలి. అపుడు దాని వ్యాసము దాదాపు 50 సెం.మీ వరకు పెరుగుతుంది. కానీ ఇంతకాలం ఓర్పులేక అప్పుడే నరకకుండా ఎంత ఎక్కువ కాలం ఆగితే అంత ఎక్కువ ఫలితాన్ని మనం టేకు చెట్టు నుండి పొందవచ్చును. 7 సంవత్సరాలు ఎదిగిన టేకు చెట్టును కొట్టి వేస్తే మనకు కేవలం 125 రూ॥ ఆదాయం వస్తుంది. ఎందుకంటే ఆ స్థితిలో ఉన్న టేకు చెట్టు కేవలం మాములు స్తంభంగానే ఉపయోగపడుతుంది. అదే 14 సు॥లు చెట్టును పడగొడితే మనకు దక్కేది 300 రూ॥ కాని మరొక 6 సం॥ల అంటే 20 సం॥ల ఎదిగిన టేకు చెట్టును పడగొడితే మనకు 6500 రూపాయల ఆదాయం లభిస్తుంది. మరొక 10 సం॥లు ఓర్పు వహిస్తే అంటే 30 సం॥ల టేకు చెట్టును నరికివేస్తే మనకు 15000 రూ॥ చేతికి చిక్కుతుంది.

ఎంత ఓర్పు వహిస్తే అంత ఫలితం దక్కుతుందని టేకు చెట్టు మనకు చాటి చెబుతుంది.

67. 99 అనే వలలో పడిపోకు

ఒక ఊర్లో ఒక బీదవాడు తన భార్యతో గుడిసెలో కాపురం చేసేవాడు. వాళ్లిద్దరు రోజంతా కష్టపడి దినభత్యం సంపాదించుకునే వారు. అతనికి ఇంకో ప్రపంచపు గొడవ లేదు. అతని గుడిసె ప్రక్కనే ధనవంతుడు ఉండేవాడు. ఎప్పుడు చింతాక్రాంతుడై ఉండేవాడు. అతడికి సౌఖ్యమే లేదు. ఒక నాడు ఒక సన్యాసి ఈ ఇద్దరిని గమనించాడు. భాగ్యవంతుడి దగ్గరికెళ్లి 'నీ దు:ఖానికి విచారానికి కారణం నీ సంపదే అన్నాడు. ఆ సన్యాసి బీదవాడిని చూపిస్తూ అతణ్ణి చూడు అతనికేమైన సంపద ఉందా? అయిన అతని ముఖంలో ఆనందం తాండవమాడుతున్నది. హాయిగా ఆడుకుంటూ పాడుకుంటూ పనికి వెళ్తున్నాడు. ఆ ధనికుడు అలాంటి ఆనందాన్ని ఎప్పుడు అనుభవించి ఎరుగడు. దాంతో సన్యాసి చెప్పిన విషయాన్ని పరీక్షించాలని నిర్ణయించుకున్నాడు. సన్యాసి చెప్పిన ప్రకారం ఒక నాడు ఆ పేదవాని ఇంట్లో 99 రూ॥ కట్టగట్టి ఒక పెట్టెలో పెట్టి వచ్చాడు. మరునాడు పేదవాని గుడిసెలో నిప్పు రాజుకోలేదు, పొగ రాలేదు. ప్రతి రోజు తాను సంపాదించిన కాస్తలోనే కావాల్సినవి తెచ్చుకొని సుఖంగా తినేవాడు. ఆ ముందు రాత్రి పొయ్యిలో పడుకున్న పిల్లి లేవలేదు. ఏమి వండుకోలేదు. ఆ రోజంతా ఉపవాసం చేశాడు.

మరునాడు ఉదయం సన్యాసి ధనికుడితో ఆ పేదవాని ఇంటికి వెళ్లి నిన్న రోజంతా నిప్పు వెలిగించలేదు ఎందుకు ? అని అడిగాడు. దాంతో ఆ పేదవాడు మామూలుగా నేను సంపాదించుకున్న దాంతోనే రోజుకు కావాల్సిన ధాన్యం, పిండి వగైరాలు కొనుక్కునే వాణ్ణి. అయితే నిన్న మా ఇంట్లో 99 రూపాయలున్న

ఒక చిన్న పెట్టె దొరికింది. ఆ డబ్బును చూడగానే ఒక రూపాయి పూర్తి చేయడానికి మేము దినం మార్చి దినం ఉపవాసం చేసి కూడబెట్టదలచుకున్నాము అన్నాడు. అదంతా విన్న భాగ్యవంతుడికి జ్ఞానోదయమైంది.

ధనికుల దు:ఖంలోని రహస్యమిదే. వాళ్లకున్న సంపదతో తృప్తి చెందక దాన్ని పెంచుకోవాలని ఆలోచిస్తుంటారు.

68. విశ్వాసమున్నప్పుడే సత్ఫలితం సిద్ధిస్తుంది.




భారత్‌లో కుంభమేళాలు జరుగుతుంటాయి. అందులో లక్షలాది భక్తులు పాల్గొంటారు. కుంభమేళాలో స్నానాలు చేస్తే పుణ్యం లభిస్తుందని కైలాసానికి వెళ్తామని భారతీయుల భావన.

అయితే ఇంతమంది ప్రజలు కుంభమేళాకు వచ్చి స్నానం చేసి కైలాసం వస్తే ఎలా అని పార్వతికి ఒక అనుమానం వచ్చింది. ఇక్కడ స్థలం సరిపోదు కదా! అని తన భర్త సదాశివుడిని నిలదీసింది. అపుడు పరమశివుడు నవ్వుతూ నీకు సమాధానం లభిస్తుంది. మనమిద్దరం మారు వేషాలలో కుంభమేళా జరుగుతున్న స్థలానికి పోదాం పదా అన్నాడు. ఆరోగ్యం సరిగా లేని ముసలివాడిలా పరమశివుడు అతని భార్యగా అందమైన యువతి రూపంలోకి పార్వతి మారి హరిద్వార్‌లో గంగానది ఒడ్డున కూర్చున్నారు.

కాసేపటి తర్వాత ఆ యువతి లేచి నిలబడి తన భర్త అనారోగ్యం విషయం చెప్పి ఎవరైనా ఆయనను నదిలోకి తీసుకెళ్లి స్నానం చేయించమని కోరింది. నదిలో స్నానం చేయిస్తే ఆయన ఆరోగ్యం బాగవుతుందని చెప్పింది.


ఒక నియమం పెట్టింది. పాపం చేయని వారు మాత్రమే తన భర్తను నదిలోకి తీసుకెళ్లి స్నానం చేయించాలని. పాపం చేయని వారు కాకపోతే తన భర్త చనిపోతాడని చెప్పింది. ఆ మాట వినగానే ఉత్సాహంగా ముందుకు వచ్చిన కొందరు వెనకడుగు వేశారు. ఇంతలో ఒక యువకుడు ఆమెను కాసేపు ఆగమని గంగలోకి వెళ్లి మునక వేసి వచ్చి ఆ ముదుసలిని తీసుకొని గంగలోకి వెళ్లాడు. ఆ దృశ్యం చూసిన అక్కడి వారందరికీ ఆ యువకుడిపై కోపం వచ్చింది. నువ్వు ఏమీ పాపం చేయలేదా అని అడిగారు. దానికి ఆ యువకుడు నేను పాపాలు చేశాను.. అందుకే కదా మొదట గంగలో మునిగి వచ్చాను. కాబట్టి నా పాపాలు అన్నీ పోయాయని నమ్మాను. గంగా నదిలో స్నానం చేస్తే తాము అప్పటి వరకు చేసిన పాపాలు తొలగిపోతాయనే విశ్వాసం ఉన్న భక్తులంతా నోటి మాట రాక నిల్చుండి పోయారు. పార్వతీ దేవి అనుమానం తొలగిపోయింది. ఏదైనా పని చేస్తున్నప్పుడు ఆ పనిలో విశ్వాసం ఉండాలి. అనేక మంది ఒకే పని చేస్తుండవచ్చు. కానీ ఆ పని పట్ల విశ్వాసం ఉన్నవారే అందులో విజయం సాధిస్తారు.

69. మన కష్టాలే మంచివి...



ఓ వ్యక్తి నెలల తరబడి ప్రతిరోజు రాత్రి నిద్రపోయే ముందు భగవంతుడిని ఇలా ప్రార్థిస్తుంటాడు. "భగవంతుడా. నాకోసం ఒక్క సహాయం చెయ్యి, కేవలం ఒకే ఒక్కటి, ఈ సహాయం తప్ప నాకు ఇంకేమి వద్దు. నా పూర్తి జీవితంలో ఇక ఎప్పుడు నిన్ను ఏ కోరికా కోరను, ఈ ఒక్క కోరిక మాత్రం తీర్చు". "ఈ లోకంలో నాకున్న కష్టాలు ఇంకెవ్వరికి లేవు, నా కష్టాలు ఒకే వరంతో తీర్చమని

అడిగే అత్యాశ నాకు లేదు, కాని నా కష్టాలను మార్చుకుందామని అనుకుంటున్నాను. కాబట్టి నా కష్టాలు ఇంకొకరికి ఇచ్చి అతని కష్టాలు నాకివ్వాలు (ఎందుకంటే తన కష్టాల కన్నా మిగిలిన వారివి చాలా తక్కువ కష్టాలు అని అతని భ్రమ)". నాకు ఇంకేమి వద్దు. ఈ ఒక్క కోరిక తీర్చు..! అని ఆ వ్యక్తి ప్రతిరోజు వేడుకుంటాడు.



నెలల తరబడి ఆ వ్యక్తి అడుగుతున్న కోరిక భగవంతునికి చేరింది. ఆరోజు రాత్రి భగవంతుడు అతని కలలోకి వచ్చి ఇలా చెప్పాడు. "కుమారా. నువ్వు ప్రతిరోజు నాకు చెబుతున్న సమస్యకు రేపటితో అంతిమ పరిష్కారం ఇవ్వబోతున్నా. అందుకోసం ముందుగా నువ్వు ఒక పని చెయ్యాలి. నీ కష్టాల చిట్టా అంతా ఒక కాగితం మీద రాసి దానిని రేపు నా దేవాలయానికి తీసుకురా" అని చెప్పాడు. ఇక ఆ వ్యక్తి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఎంతో ఆనందంతో తన జీవితంలో బాధాకర కష్టాలన్ని ఒక పేపర్ మీద రాయడం మొదలుపెట్టాడు.

ఆ కష్టాలు ఒక్క కాగితంలో సరిపోలేదు. అతనికున్న కష్టాలన్ని రాసేసరికి ముందుగా అనుకున్న ఒక్క కాగితం కాస్త చాలా కాగితాలయ్యాయి. ఆ కాగితాలన్ని ఒక కట్టగా కట్టి మరుసటి రోజు ఉదయం దేవాలయానికి బయలుదేరాడు. ఆనందంతో దేవాలయానికి వెళుతున్న ఆ వ్యక్తికి ఒక ఆశ్చర్యకరమైన దృశ్యం కనిపించింది.. అదే దారిలో తన లాగే పేపర్ల కట్టలు కట్టుకుని తోటి గ్రామస్తులంతా

గుడికి వస్తున్నారు. ఆ వ్యక్తికి అప్పుడే అర్థమయ్యింది, "నా ఒక్కడికే కాదు నాతో పాటు భగవంతుడు వీరందరి కలలోకి వచ్చి నాకు చెప్పిందే చెప్పాడన్నమాట" అని. అక్కడున్న మిగిలిన వారి పేపరు కట్టలన్ని తన పేపర్ల కన్నా పెద్దగా కనిపిస్తున్నాయి.

అంతకు ముందు తనతో పరిచయమున్న వారందరు ఆ కట్టలతో వచ్చేస్తున్నారు. ఆ వ్యక్తికి ఆశ్చర్యం కలుగుతుంది "వీరందరికి నాకన్నా మంచి బట్టలున్నాయి, డబ్బులున్నాయి. ప్రతిరోజు పైకి అందరితో నవ్వుతు మాట్లాడతారు.. కాని తన కన్నా వారి దగ్గరున్న కష్టాల కట్టలు ఎక్కువ ఉండేసరికి అతనికి నెమ్మదిగా నిజం తెలుస్తుంది. గుడి తలుపులు సమీపిస్తున్న కొద్ది ఆ వ్యక్తిలో భయంతో కూడుకున్న అలజడి మొదలయ్యింది. ఈ అలజడి ఆ వ్యక్తికి మాత్రమే కాదు అక్కడున్న గ్రామస్తులందరికి పాకింది. అనుకున్న సమయం రానే వచ్చేసింది. గ్రామస్తులంతా ఆ గుడిలోనికి ప్రవేశించారు. అప్పుడే భగవంతుడు అదృశ్యవాణిగా ఇలా చెప్పాడు. "మీ కష్టాలు రాసిన ఆ కాగితపు కట్టలన్ని కింద పెట్టండి". చెప్పినట్టుగానే అందరు వారి కట్టలన్ని కింద పెట్టారు.

అప్పుడు భగవంతుడు. "ఇప్పుడు ప్రతి ఒక్కరు అక్కడున్న ఏదో ఒక కట్టను తీసుకోండి, మీరు కోరుకున్నట్టుగానే ఆ కట్టలో రాసివున్న కష్టాలన్ని మీకు బదిలి చేయబడతాయి" అని అన్నాడు. అక్కడున్న ప్రతి ఒక్కరిలో భయం చేరింది. "అదే భయంలో అందరు ఒక నిర్ణయానికి వచ్చి వెంటనే అక్కడున్న వారంత ఎవరి కట్టను వారు తీసుకోడానికి ప్రయత్నించారు". ఎక్కడ తమ కష్టాలు కాకుండా ఇంకొకరి ఊహించని కష్టాలు వస్తాయో, మనకు తెలిసిన కష్టాలతో మనం పోరాడవచ్చు కాని మనం జీవితంలో ఊహించని కష్టాలు వస్తే..? అని అందరు ఆలోచిస్తూ ప్రాణ భయంతో వారి కట్టలను వారే తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ వ్యక్తి కూడా అదే ప్రయత్నిస్తున్నాడు.

ఒక్కసారిగా సుడిగాలి ఆ ప్రాంతాన్ని కమ్మేసినట్టుగా ఉంది అక్కడి దృశ్యం. అక్కడున్న వారంత ఎదుటి వ్యక్తిలోని ఎంతటి ఊహించని కష్టాలు ఉన్నాయో అవి ఎక్కడ అనుభవించాల్సి వస్తుందో అని భయపడుతున్నారు. కొద్దిసేపటికి చూస్తే ఎవరి కట్టను వారే తీసుకోగలిగారు. అప్పటివరకు ఏదో మృత్యువు తరుముతున్నట్టుగా ఉన్న వారంత తమ కష్టాల కట్ట తాము తీసుకోగానే ప్రశాంతంగా ఊపిరి పీల్చుకోసాగారు. అందరు చాలా ఆనందంగా ఉన్నారు. ఆ వ్యక్తి కూడా చాలా ఆనందంగా ఉన్నాడు. వారందరికి స్పష్టంగా ఒక విషయం అర్థమయ్యింది. "తమ కష్టాలే చిన్నవి, అనవసరంగా భయపడ్డాము". వీటికి పరిష్కార మార్గాలను వెతకాలి, పోరాడాలి, విజయం సాధించాలి అని ధృడ సంకల్పంతో ముందుకు కదిలారు.

నీతి: భగవంతుడు నీకు ఏమి ఇచ్చిన దానికి ఒక అర్థం అంతకు మించి మనకు తెలియని ఏదో పరమార్థం దాగి వుంటుంది అని ముందు వెళ్ళండి. చివరగా, ఒక్క మాట ఎప్పుడూ ఎవరినీ కూడా నా కష్టం నీకు వస్తే తెలుస్తుంది, అని అనవద్దు. నా శత్రువు కి కూడా నాలాంటి కష్టం రాకూడదని అనుకునేవారు ధన్యులు....


70. సహాయం నిరాకరిస్తే..

అనగనగా ఒక ఊళ్ళో ఒక నది. ఆ నది ఒడ్డున రెండు పెద్ద చెట్లు. ఆ దారిన వెళుతున్న ఒక చిన్న పిట్ట తన పిల్లలకు చిన్నగూడు కట్టుకుందామనుకొని, మొదటి చెట్టు దగ్గరకు వెళ్ళింది. వర్షాకాలం వస్తోంది, నేనూ నా పిల్లలూ ఉండటానికి నీ కొమ్మ మీద గూడు కట్టుకోనా? అని అడిగింది. వద్దు అనేసింది మొదటి చెట్టు. ఆ పిట్ట చిన్నబుచ్చుకుంది. నిరశగా రెండో చెట్టు దగ్గరకు పోయి సహాయం కోసం వేడుకుంది. సరే అంది రెండో చెట్టు. ఆనందంగా ఎగిరి గంతులేస్తూ గూడుకట్టే పని మొదలుపెట్టింది పిట్ట.

వానాకాలం వచ్చేలోపే రెండో చెట్టు మీద గూడు కట్టేసుకుంది. పిల్లలతో ఆనందంగా కాలం గడపసాగింది. ఈలోగా వర్షాకాలం వచ్చేసింది. ఓరోజు వర్షం మొదలైంది. చూస్తుండగానే పెద్దదైంది. వరద రావడం మొదలైంది. ఆ వరదలో మొదటి చెట్టు కూకటివేళ్ళతో సహా కూలిపోయి, నీటిలో కొట్టుకునిపోతోంది. ఆ దృశ్యాన్ని రెండో చెట్టు మీద కూర్చున్న పిట్ట చూస్తూ...' భగవంతుడు నీకు తగిన శిక్ష వేశాడు. నాకు సహాయం చేయడానికి నిరాకరించావుగా 'అంది నవ్వుతూ. 'నేను బలహీనమైనదానినని నాకు తెలుసు. వరద వస్తే కొట్టుకోనిపోతానని కూడా తెలుసు. నాతోపాటు నీ గూడు కూడా కొట్టుకుపోకూడదనే నువ్వు గూడు కట్టుకునేందుకు నిరాకరించాను. నన్ను క్షమించు. పిల్లలతో పదికాలాలు సుఖంగా ఉండు 'అంది. ఆ చిన్నపిట్ట గుండెలనిండా పశ్చాత్తపం.

నీతి: ఎవరైనా సహాయం చేయడానికి నిరాకరిస్తే తప్పుగా అనుకోకుడదు. వారు ఏ నిస్సహాయ పరిస్థితిలో అలా చేశారో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి.

71. సత్సాంగత్యం - ఎలా ఉండాలి ? జీవన్ముక్తి - ఎలా?



ఒకసారి ఒక వేటగాడు వేటకు వెళ్ళాడు, ఏమి దొరకలేదు, అలసిపోయి ఒక చెట్టు కింద పడుకున్నాడు... గాలి వేగం ఎక్కువగా ఉండి కొమ్మల కదలిక కారణంగా చెట్టు నీడ తక్కువ అవుతోంది. అప్పుడే అక్కడ నుండి

ఒక అందమైన హంస ఎగురుతూ అక్కడకు వచ్చింది, ఎవరో పడుకున్నారు, అతని పై నీడ రావడం లేదు, కలత చెందుతున్నాడని అతని పై ఎండ వస్తోంది అని గమనించి, ఆ చెట్టు యొక్క కొమ్మపై రెక్కలు తెరచి కూర్చుంది.

వేటగాడు ఆ హంస యొక్క నీడలో హాయిగా నిద్రపోయేలా చేసింది... కొంత సమయం తరువాత వేటగాడు నిద్రిస్తున్నప్పుడు, ఒక కాకి వచ్చి అదే కొమ్మపై కూర్చుని, ఇటు అటు చూసి ఎటువంటి ఆలోచన లేకుండా, అతని మీద రెట్ట వేసి ఎగిరిపోయింది. అప్పుడు ఆ వేటగాడు లేచి ఇటు అటు కోపంగా చూసి వెంటనే విల్లు తీసి ఎదురుగా కనిపించిన హంసను చంపేసాడు...

హంస కింద పడి చనిపోతూ, ఇలా అన్నది.. నేను నీకు సేవ చేసాను, నీకు నీడ కూడా ఇచ్చాను, నీవు నన్ను చంపావు.. ఇందులో నా తప్పు ఏమిటి.. అని అడిగింది... అప్పుడు వేటగాడు ఇలా అన్నాడు... నీవు ఉన్నత కుటుంబంలో జన్మించావు, నీ ఆలోచనలు నీ శరీరంలాగే అందంగా ఉన్నాయి, నీ ఆచారాలు స్వచ్ఛమైనవి, నాకు సేవ చేయాలనే మంచి ఉద్దేశ్యంతోనే ఉన్నావు, కానీ నీవు ఒక్క పొరపాటు చేసావు, కాకి వచ్చి నీతో కూర్చున్నప్పుడు, వెంటనే నీవు ఎగిరిపోయి ఉండాల్సింది. ఆ దుష్ట కాకి సాంగత్యం క్షణ కాలమే అయినా నిన్ను మరణ ద్వారం వద్దకు తీసుకువెళ్ళింది...అందుకే మన పూర్వీకులు, పెద్దలు ఎల్లప్పుడూ చెపుతుంటారు మంచి సత్సాంగత్యం లోనే వుండమని...


సత్సంగత్వే - నిస్సంగత్వం,
నిస్సంఘత్వే - నిర్మోహత్వం,
నిర్మోహత్వే - నిశ్చల తత్వం,
నిశ్చల తత్వే - జీవన్ముక్తి

। శుభమస్తు ।

॥ సమస్త లోకా సుఖినోభవంతు ॥

72. అనగనగా ఒక శివుని దేవాలయం

ఒకరోజు ఆ దేవాలయంలో పూజ చేయాలని అందరు దేవతలూ వస్తుంటారు మొదటగా యమధర్మరాజు తన వాహనమైన దున్నపోతు పై వచ్చి వాహనం దిగి గుడి పక్కన ఉన్న చెట్టు కొమ్మపై ఉన్న చిన్న పిట్టను చూసి నవ్వి గుడి లోపలికి వెళతాడు. తర్వాత కొంత సమయానికి శ్రీ మహావిష్ణువు తన వాహనం గరుత్మంతుడిపై వచ్చి వాహనం దిగి గుడి లోపలికి వెళతాడు. ఆ విధంగా అందరు దేవతలూ గుడిలోకి వెళతారు వాహనాలు గుడి బయట ఉంటాయి.



అంతలో గుడి పక్కన ఉన్న చెట్టు కొమ్మపై ఉన్న చిన్న పిట్ట తన పక్షి జాతికి చెందిన గరుత్మంతుడి దగ్గరకు వచ్చి "యమధర్మరాజు అంటేనే మరణానికి సంకేతం, అటువంటి యమధర్మరాజు గుడిలో కి వెళ్లేముందు నన్ను చూసి నవ్వాడు. నాకు భయంగా ఉంది నన్నెలాగైనా కాపాడు'' అని గరుత్మంతుడిని వేడుకుంది. అప్పుడు గరుత్మంతుడు "నేను అన్నిటికన్నా వేగంగా పోగలను, మూడు ఘడియలలోపు నిన్ను ఏడు సముద్రాలకు అవతల వదిలి వస్తాను, అప్పుడు నువ్వు యమధర్మరాజుకు కనిపించవు యముడు నిన్నేమీ చేయలేడు" అని చెప్పి ఆ చిన్న పిట్టను వేగంగా తీసుకెళ్ళి ఏడు సముద్రాలకు అవతల ఒక దీవిలో ఒక చెట్టు తొర్రలో వదిలి 'నీకేం కాదులే హాయిగా ఉండు' అని చెప్పి అంతే వేగంగా తిరిగి వచ్చేస్తాడు. కొంత సేపటికి దేవతలందరూ పూజ ముగించుకుని బయటకు వస్తారు.

అప్పుడు గరుత్మంతుడు యమధర్మరాజుతో " యమధర్మరాజా నువ్వు గుడి లోపలికి వెళ్లే ముందు ఆ చెట్టు కొమ్మపై ఉన్న చిన్న పిట్టను చూసి నవ్వావట ఎందుకు" అని అడిగాడు. అప్పుడు యమధర్మరాజు "ఏం లేదు నాకు బ్రహ్మ దేవుడు రాసిన అందరి తలరాతలూ కనిపిస్తాయి, ఆ చిన్న పిట్ట తలరాత చూసి నవ్వొచ్చింది" అని అన్నాడు. ఆ పిట్ట తలరాతలో ఏం రాసి ఉంది అని గరుత్మంతుడు అడిగాడు. "ఆ చిన్న పిట్ట మూడు ఘడియలలో ఏడు సముద్రాలకు అవతల ఉన్న ఒక చెట్టు తొర్రలో ఉన్న ఒక పాముకు ఆహారం కాబోతోంది అని రాసి ఉంది, ఆ చిన్న పిట్ట మూడు ఘడియలలోపు ఏడు సముద్రాలు దాటి వెళ్లలేదు, ఆ పాము కూడా ఏడు సముద్రాలు దాటి ఇక్కడికి రాలేదు కానీ బ్రహ్మరాత మాత్రం జరిగి తీరుతుంది. ఎలా జరుగుతుందో అని తలుచుకొని నవ్వొచ్చింది" అన్నాడు యమధర్మరాజు తానొకటి తలచిన దైవమొకటి తలచు.

73. కుటుంబం

ఓ రాజు వేటకోసం అడవిలోకి వెళ్ళాడు. దట్టమైన ఆ అడవిలో ఓ సాధువు చెట్టు కింద ధ్యానంలో నిమగ్నమై ఉండటం చూసి దగ్గరగా వెళ్ళాడు. వినయంగా అడిగాడు- 'ఇంత దట్టమైన అడవిలో మీరిలా ఒంటరిగా ఉన్నారు. రకరకాల క్రూరమృగాలు సంచరిస్తుంటాయి. భయం అనిపించదా?'

ధ్యానంలోంచి తేరుకుంటూ సగం తెరిచిన కళ్లతో- 'నేను ఒంటరిని కాను. నా కుమారుడు, నా కుటుంబం నాతోనే ఉన్నారు కదా' అన్నాడు. రాజుకు అనుమానం వచ్చింది. చుట్టూ కలియజూశాడు. ఎవరూ కనిపించకపోవడంతో 'స్వామీ, ఎవరూ లేరే... కుటుంబం అంటున్నారు... ఎక్కడ?' అని అడిగాడు. ఆ సాధువు శాంతంగా 'మహారాజా, ప్రపంచంలో అన్నీ వ్యక్తం కావాలన్న నియమం

లేదు. కొన్నింటిని చూడగలం. మరికొన్నింటిని చూడలేం. అర్థంకాని రాజు 'నాకు బోధపడలేదు మీరేమంటున్నారో. మీ కుటుంబాన్ని పరిచయం చేయరూ' అనడిగాడు తెలివిగా.

'సహనం నా తండ్రి. క్షమ నా తల్లి. శాంతి నా తోడు. కరుణ, అహింస నా సోదరీమణులు. జ్ఞానం నా ఆహారం... వీటితో బంధుత్వం కలిగిఉన్నప్పుడు ఎవరికైనా భయం ఎలా కలుగుతుంది?' రాజుకు ఆ మాటలు చిత్రంగా అనిపించాయి. ఎవరైతే కోరికల్లాంటివి లేకుండా తటస్థంగా ఉంటారో, ఆత్మతో లీనమై ఉంటారో... వారికి తత్వం బోధపడుతుంది.

ప్రతి వ్యక్తికీ రెండు కుటుంబాలు ఉంటాయి. ఒకటి వ్యక్తం, మరోటి అవ్యక్తం. సాధారణంగా తండ్రిగాని తల్లిగాని కుటుంబ పెద్ద ఆధ్యాత్మికం విషయానికొస్తే ఓర్పు కుటుంబపెద్ద ఎవరినైనా రక్షిస్తుంది. తొందరపాటు ఉండకూడదు. కష్టాలొచ్చినప్పుడూ ఓర్పుతో ఉండటం మంచిది. క్షమాగుణాన్ని తల్లితో పోలుస్తారు. ఓర్పునకు మారుపేరుగా భూమాతను చెబుతారు. ప్రతి ఒక్కరినీ భూమి మాతృమూర్తిలా లాలిస్తుంది. ఎవరైతే ఆధ్యాత్మిక కుటుంబం కలిగిఉంటారో, వారు దేనికీ భయపడనవసరం లేదు. ఓర్పు, క్షమాగుణం కలిగినవారు, ముఖ్యంగా ఏ తప్పూ చేయనివారు దేనికీ భయపడకపోగా ఒత్తిళ్లకు దూరంగా ఉంటారు.

శాంతి ఒక తోడూనీడలా ఉంటుంది. అందుకే ఆనందం ప్రశాంతత... సత్యం కొడుకు... ఈ ప్రపంచంలో రక్షించేవి, సమస్యల్లో చిక్కుకోకుండా చూసేవి... కరుణ, అహింస సోదరీమణులు. ఇవి కలిగిఉన్నవారు మానసికంగా, శారీరకంగా, కనీసం వాక్కు ద్వారానైనా ఎవరికీ హాని తలపెట్టరు. మానసిక నియంత్రణశక్తి సోదరుడు. సోదరుడు ఎన్నో విషయాల్లో అండగా నిలుస్తాడు. నియంత్రణ లేని మనసు అనేక సమస్యలకు కారణమవుతుంది. అలాగే ఇంద్రియాల

విషయంలోనూ వీటిని అదుపులో ఉంచుకుంటూ ఉపయోగించుకునే కళను అలవరచుకోగలిగితే అధైర్యం దరిచేరదు. ఇలా ఆధ్యాత్మిక కుటుంబం కలిగినవారు గొప్ప సంపన్నులు, అదృష్టవంతులు.

భౌతిక కుటుంబం ఒక్కటే కలిగిఉండి, ఆధ్యాత్మిక కుటుంబం లేకపోతే జీవితంలో బాధలు, ఒత్తిళ్లు ఎదుర్కొనక తప్పదు. ఎందుకంటే- సొంతమనుకునే భార్యా పిల్లలు, సోదరసోదరీమణులు... ఎవరినీ పూర్తిగా విశ్వసించలేని పరిస్థితులు వస్తాయి. కాలానుగుణంగా ఏర్పడిన బంధుత్వాలు, సంబంధాలు... పరిస్థితులు అనుకూలించకపోతే ఎవరికి వారు వదిలేసి వెళ్ళిపోవచ్చు కేవలం భౌతిక కుటుంబంపైనే ఆధారపడకుండా ఆధ్యాత్మిక కుటుంబాన్నీ ఏర్పరచుకోవాలి. ఈ రెండు కుటుంబాలను ఎవరు బలంగా కలిగిఉంటారో- వారంత శక్తిమంతులు, అదృష్టవంతులు మరొకరు ఉండరు!

74. ఒక చిన్న నీతి కథ



ఊరి బయట పొలం దగ్గర ఇద్దరబ్బాయిలు పరుగులు పెట్టి అడుకుంటున్నారు. ఒకడు పదేళ్ల వాడు. ఇంకొకడు ఆరేళ్ల వాడు. చిన్నోడు ముట్టుకునేందుకు వస్తున్నాడు. పెద్దోడు వాడికందకుండా వెనక్కి చూస్తూ వేగంగా పరుగెడుతున్నాడు. ముందు పెద్ద బావి ఉంది. పెద్దోడు చూసుకోలేదు. అందులో పడిపోయాడు. వాడికి ఈత రాదు. బావి చాలా లోతుగా ఉంది. చుట్టుపక్కల ఎవరూ లేరు. అరిచినా సాయానికి వచ్చేందుకు నరప్రాణి లేదు. చిన్నోడికి ఒక తాడు కట్టిన బొక్కెన కనిపించింది. తాడును పట్టుకుని బొక్కెనను బావిలోకి

విసిరాడు. "అన్నా... దీన్ని పట్టుకో" అన్నాడు. నీట మునిగి తేలుతూ కేకలేస్తున్న పెద్దవాడు తాడును పట్టుకున్నాడు. చిన్నోడు తన శక్తినంతా కూడగట్టుకుని తాడును పైకి లాగడం మొదలు పెట్టాడు. "అన్నా ... భయపడకు..?

జాగ్రత్తగా పట్టుకో..! పడిపోకుండా చూసుకో" అని అరిచాడు. తాడు చివరను ఒక చెట్టుకి కట్టాడు. నెమ్మదిగా లాగుతూనే ఉన్నాడు. ఒక అరగంట పెనుగులాడిన తరువాత పెద్దోడు సురక్షితంగా బయటకి వచ్చాడు. ఆ తరువాత పెద్దోడు చిన్నోడు ఊళ్లోకి పరుగెత్తారు. ఊళ్లో వాళ్లకి జరిగింది చెప్పారు. చిన్నోడు పెద్దోడిని ఎలా కాపాడాడో చెప్పారు. ఊళ్లో ఎవరూ నమ్మలేదు. ఆరేళ్ల వాడేమిటి.. పదేళ్ల వాడిని లాగడమేమిటి ? అందునా బావి నుంచి లాగడమేమిటి? అసాధ్యం..! వాడు చేయలేడు అని అన్నారు.

ఎంత చెప్పినా ఎవరూ నమ్మలేదు. ఈ సంగతి ఆ నోటా ఈ నోటా పాకింది. ఆ ఊరు పెద్దమనిషికి విషయం తెలిసింది. "మీరు నమ్ముతారా' అని అడిగారు నమ్ముతాను అన్నాడు. ఎలా? చిన్నోడు లాగి పెద్దోడిని బావి నుంచి బయటకి తీసి రక్షించాడు. అదెలా సాధ్యం... అంత చిన్నోడు ఎలా చేయగలడు? తనకి అంత బలం లేదన్న సంగతి, వాడు పెద్దోడిని బావినుంచి లాగలేడన్న సంగతి చిన్నోడికి తెలియదు. ఒరేయ్..! నీకంత బలం లేదురా, నువ్వు చేయలేవురా, అది నీవల్ల సాధ్యం కాదురా. అని చెప్పేవారెవరూ కూడా...

ఆ పరిసరాల్లో లేరు, కాబట్టి వాడు చేయగలిగాడు. నీవల్ల కాదని చెప్పే వాళ్లుంటే వాడు ప్రయత్నించేవాడే కాదు. ఏడుస్తూ ఊళ్లోకి పరిగెత్తుకు వచ్చేవాడు. మనం బావి దగ్గరికి వెళ్లే సరికి పెద్దోడు శవమై తేలి ఉండేవాడు. ప్రశ్నవేసిన వాడు మాట్లాడలేకపోయాడు. నీవల్ల కాదు అని చెప్పేవాడు లేకుంటే మనిషి ఎంత పనైనా చేస్తాడు. అది బావైనా, బతుకైనా అంతే..." అన్నాడు పెద్దమనిషి. మీరు ఇతరులకు ధైర్యం ఇవ్వకున్నా పర్లేదులే గానీ దయచేసి మీ భయాన్ని మాత్రం ఇతరులపై రుద్దకండి.


75. తెలివి ఒక్కరి సొత్తు మాత్రమే కాదు

ఒక చేపలు పట్టే వ్యక్తి చేపను రాజు దగ్గరకు తీసుకు వచ్చి రాజా ఈ చేప మీకోసమే పట్టుకువచ్చాను అని చెప్పాడు. అందుకు సంతోషించిన రాజు ఆ జాలరికి 500 వరహాలు బహుమతిగా ఇచ్చారు. అతడు ఆనందంతో అక్కడ నుండి బయల్దేరగా మహారాణి ఈ చిన్న చేపకు 500 వరహాలు ఇచ్చారా నేను ఒప్పుకోను వెంటనే చేపను అతనికే ఇచ్చేసి ఆ మొత్తాన్ని వెనక్కు తీసుకోండి అని చెప్పింది. రాజు ఒక్కసారి ఇచ్చిన మాట సమర్పించిన బహుమతి వెనక్కు తీసుకోకూడదు అని చెప్పిన ఆమె వినలేదు. ఆ జాలరిని పిలవండి ఈ చేప అడా మగా అని అడగండి అడ చేప అంటే మగ చేప కావాలని మగ చేప అంటే ఆడ చేప కావాలని చెప్పి డబ్బులు వెనక్కు తీసుకోమని సలహా ఇచ్చింది. వెనక్కు పిలిచిన జాలరికి ఎందుకో అర్థం కాకపోయినా రాజుగారిని కలిసాడు.

రాణిగారు వేసిన ప్రశ్నకు ఈ తెలివైన జాలరి అమ్మ అది మగ కాదు ఆడ కాదు ఒక అద్భుతమైన చేప అందుకే రాజుగారికి ఇచ్చాను అని చెప్పాడు. అది విన్న రాజు మరో 500 వరహాలు బహూకరించాడు అందులో ఒక బిళ్ళ కింద పడిపోగా జాలరి వెతికి మరి దాన్ని తీసుకున్నాడు. అసలే కోపం తో రగిలిపోతున్న రాణి ఎంత ఆశ చూడండి ఒక్క బిల్లే కదా పనివాళ్ళు తీసుకుంటారు కదా వదిలేయొచ్చు కదా అని అనడంతో ఆశ కాదమ్మా ఆ బిళ్ళ పైన రాజుగారి చిత్రం చిత్రించబడింది అది ఎవరైనా తొక్కేస్తే నేను తట్టుకోలేనమ్మా అని జాలరి సమాధానం ఇచ్చాడు. అంతే ఆ మాటకు ఉప్పొంగిపోయిన రాజు మరో 500 వరహాలు బహూకరించాడు ఇంతటితో ఇక ఒక్క మాట కూడా మాట్లాడకుండా నోరు మూసుకున్నారు రాణి గారు...

ఇతరుల కష్టాన్ని గుర్తించండి. ఇతరులు బహుమతిగా ఇస్తే వాటికి వెల కట్టకండి ప్రపంచంలో మీరే తెలివైనవారని ఊహించుకుని ఎదుటి వ్యక్తిని చిన్న చూపు చూడకండి.

76. పదును ఫలితం..



ఒకానొక ఊర్లో బీద కూలివాడు ఉండేవాడు. ఒకరోజు ఒక కట్టెల వ్యాపారి దగ్గరకు వెళ్లి ఏదైనా పని చెప్పండి అని బ్రతిమలాడాడు. ఆ వ్యాపారి సరే అని చెప్పి.. జీతం మాత్రం నువ్వు ఎంత చేస్తే అంత అని చెప్పాడు. కూలివాడు నాకు నా,పిల్లలకు రోజుకు బ్రతకడానికి 100 రూపాయలు అవసరము అవతాయి. కాబట్టి నాకు 100 రూపాయలు ఇస్తే చాలు అన్నాడు. అప్పుడు కలప వ్యాపారం చేసే యజమాని అలా కుదరదు. నీ పనికి తగ్గట్టుగా నీ జీతం ఉంటుంది.

పని ఎంత ఎక్కువగా చేస్తే అంత డబ్బు వస్తుంది అని బదులిచ్చాడు. కూలివాడు వేరే దారి లేక యజమాని చెప్పిన దానికి సరే అన్నాడు. అప్పుడు ఆ యజమాని ఆ కూలివాడికి ఒక మంచి బలమైన కత్తి ఒకటిచ్చి అడవిలో పెద్ద పెద్ద చెట్లను నరికి తెమ్మన్నాడు. కూలివాడు సరే అని వెళ్లి అడవిలో చెట్లను నరకడం మొదలుపెట్టాడు. ఎలా అయితేనేమి పొద్దు పోయేసరికి 15 చెట్లను నరికి వాటిని తెచ్చి యజమానికి అప్పజెప్పాడు. యజమాని భళా దాసుడా.. ఎవ్వరైనా ఒక్కరోజులో 7 చెట్లకంటే ఎక్కువగా నరకలేరు. నువ్వు ఏకంగా 15 చెట్లు నరికావు. భళా అని పొగిడి.. నువ్వు మొదటి రోజే చాలా ఎక్కువ కష్టపడ్డావ్ అని మెచ్చుకుని. చెట్టుకు 10 రూపాయల చొప్పున ఆ కూలివాడికి 150

రూపాయలు ఇచ్చాడు. ఆ కూలివాడు మరుసటి రోజు అడవికి వెళ్లి ఇంకా ఎక్కువ కష్టపడితే ఇంకా డబ్బులువస్తాయి కదా అని మొదటి రోజు కంటే ఎక్కువ సేపు కష్టపడి పొద్దుపోయేసరికి 10 చెట్లను నరికి తెచ్చి యజమానికి చెట్టుకు 10 రూపాయలు చొప్పున 10 చెట్లు అప్పజెప్పి 100 రూపాయలు కూలి తీసుకున్నాడు.

మూడవరోజు కూలివాడు ఇంకా కష్టపడి పనిచేసి పొద్దు పోయేసరికి 5 చెట్లు నరికి యజమానికి అప్పజెప్పి చెట్టుకు 10 రూపాయలు చొప్పున 50 రూపాయలు తీసుకుని వెళ్ళిపోయాడు. మరుసటి రోజు ఎలా అయిన ఎక్కువ చెట్లు నరకాలని వేకువ జామునే బయలుదేరివెళ్లి ఆ అడవిలో ఎన్నడూ లేనంతగా కష్టపడి వేకువజామున నుండి చీకటి పడేవరకు కష్టపడి ఒకే ఒక చెట్టు నరికి యజమానికి అప్పజెప్పాడు. అప్పుడు ఆ యజమాని చెట్టుకు 10 రూపాయలు చొప్పున పది రూపాయలు తీసి ఆ పనివాడి చేతిలో పెట్టాడు. పనివాడు పది రూపాయల నోటు వైపు దీనంగా చూస్తూ శాయశక్తులా కష్టం చేసినా ఫలితం పది రూపాయలే అని తలచి.

ఎంత చేస్తే అంత అన్న యజమానితో ఉన్న ఒప్పందం గుర్తెరిగి చేసేది ఏమీ లేక. వెళ్ళిపోతూ... అయ్యగారు నా కష్టంలో ఎటువంటి లోపం లేదు. చీకటి పడేవరకు చెమటోడ్చి శ్రమించాను కాని ఒకటి కంటే ఎక్కువ నరకలేకపోయాను. అని దీనంగా అన్నాడు. అపుడు యజమాని నేను నీకు ఇచ్చిన కత్తికి పదును పెట్టి ఎన్నాళ్ళు అవుతుంది? అని అడగగానే. కూలివాడు నేను రోజు నా పనిలో మునిగిపోవడంవలన కత్తికి పదును పెట్టే సమయం నాకు లేదు.

అందుకే కత్తికి ఒక్కసారికూడా పదును పెట్టలేదు అని అన్నాడు. అపుడు యజమాని అర్థం లేని నీ శ్రమకు, నీ ఆర్థిక పతనానికి, నీ శరీర శ్రమలకి


కారణం కత్తికి పదును లేకపోవడమే. పదును ఫలితం. ఎటువంటి సమస్యనైనా సులువుగా కోసిపారేయడమే. మార్పు లేని జీవితం, పదును లేని మొద్దుబారిన కత్తిలాంటిది. ఏవేవో శ్రమలు పడతాం కాని ఫలితం ఆవిరి. కష్టపడుతున్న.. కష్టపెట్టే పరిస్థితులు మాత్రం మారనే మారవు పదునైన ఆలోచనలతో మాత్రమే గొప్ప విజయాలు సాధించగలము.

77. సంతృప్తి..

ఆఫీస్ కు రెండు రోజులు సెలవు రావడంతో అమ్మా, నాన్నలతో గడపడానికి మా ఊరికి బయలుదేరాను. బస్టాండ్‌కు చేరుకున్న నేను, అప్పుడే వచ్చిన బస్ ఎక్కాను. పరిస్థితి చూస్తే కూర్చోడానికి సీటు దొరికేలా లేదు. అప్పుడే.. ఒకతను లేచి నిలబడి అతని సీటు నాకు ఇచ్చి, అతను వేరే దగ్గరకి వెళ్ళి నిలుచున్నాడు. హమ్మయ్య.. అనుకుంటూ అతనికి థ్యాంక్స్ చెప్పి అక్కడ కూర్చున్నాను. నాకు సీటు ఇచ్చిన అతనికి పక్కనే ఒక అతను లేవడంతో అతను ఆ సీట్లో కూర్చోవడం జరిగింది.

ఇంతలో వేరే అతను బస్సు ఎక్కడంతో అతను లేచి నిలబడి మళ్లీ అతని సీటు ఆ వచ్చిన అతనికి ఇచ్చాడు. ఇలా అతను తరువాత నాలుగు అయిదు స్టాపులలో అందరికీ అలాగనే అతను కూర్చున్న సీటు ఇవ్వడం చేస్తూ ఉన్నాడు. ఇదంతా గమనిస్తున్న నేను, చివరి స్టేజీలో బస్సు దిగబోయే ముందు అతనితో మాట్లాడాను. 'నువ్వు కూర్చోకుండా ప్రతిసారి నీ సీటు వేరే వాళ్లకు ఎందుకిస్తున్నావు?' అని అడిగాను.అతని సమాధానం నన్ను ఆశ్చర్యపరిచింది. 'నేను ఏమి చదువుకోలేదు, డబ్బున్నవాణ్ణి కూడా కాదు. కూలి పనులు చేసుకునే వాణ్ణి. ఏ విధంగానూ ఎవరికీ ఏమి ఇవ్వలేక పోయాను. అందువలన నేను రోజూ ఈ పని చేస్తున్నాను. ఈ పని తేలిక కూడ" అన్నాడు.

కూలి చేసుకునే నాకు నిలబడడం కష్టం కాదు. నేను సీటు ఇచ్చిన వారు తిరిగి నాకు కృతజ్ఞతలు చెప్తారు. ఎవరికీ ఏమీ ఇవ్వలేని నాకు, ఈ తృప్తి చాలు. ఆ తృప్తితో నాకు సుఖంగా నిద్రపడుతుంది అన్నాడు. నాకు నోటి వెంట మాట రాలేదు. ప్రతిరోజూ ఏదో ఒకటి ఇవ్వటం అంటే అది వారికి గిఫ్ట్ తో సమానమే... ఎదుటివాళ్లకు ఇవ్వాలంటే మన దగ్గర ఏమీలేకపోయిన ఇవ్వచ్చు అని అతన్ని చూసి తెలుసుకొన్నాను.




మనం ధనవంతులం, స్థితిమంతులం ఐతేనే ఇతరులకు ఇవ్వగలం అనుకోవటం తప్పు. ఇచ్చే మనసున్న ఎవరైన "ధనవంతుడే" అని అతన్ని చూశాక తెలుసుకున్నాను. ఒకరికి ఇవ్వడంలో గల "సంతృప్తి", మరెందులోనూ రాదని అర్థమైంది మిత్రులారా దయచేసి సేవాగుణాన్ని, సంతృప్తిని పిల్లలలో అలవరచండి. మనం కూడా అలవరచుకునే ప్రయత్నం చేద్దాం.!

78. బావిలో కప్ప-సముద్రపు కప్ప

ఒక బావిలో ఒక కప్ప వుండేది. చాలాకాలంగా అది దాంట్లో నివసిస్తోంది. అందులోనే పుట్టి అందులోనే పెరిగింది చిన్నకప్ప. అది బావిలోని నీటిని పురుగులు, క్రిముల నుండి పరిశుభ్రపరుస్తుంది. ఈ విధంగా కాలం గడుపుతుండగా, క్రమంగా అది కొంత బలిష్టంగా తయారైంది. ఇలా వుండగా, సముద్రంలో నివసిస్తున్న మరొక కప్ప వచ్చి ఒకరోజు ఆ బావిలో పొరపాటున పడింది.



"నువ్వెక్కణ్ణుంచి వస్తున్నావు?" బావిలోని కప్ప అడిగింది. "సముద్రం నుంచి." "సముద్రమా! అది ఎంత పెద్దది? అది నా బావి అంత పెద్దదా?" అంటూ ఈవైపు నుంచి ఆ వైపునకు ఆ కప్ప చెంగున దూకింది.




ఇది చూసి సముద్రపు కప్ప "మిత్రమా, నీ చిన్న బావితో సముద్రాన్ని ఎలా పోలుస్తావు?" అంది. అప్పుడు బావికప్ప మరొకసారి చెంగున దూకి "మీ సముద్రం ఇంత పెద్దదా?" అడిగింది. "నీ అర్థంలేని ప్రలాపం! సముద్రాన్ని నీ బావితో పోల్చుటమా?" అందుకు బావికప్ప "నా బావికంటే ఏదీ పెద్దదై వుండజాలదు. ఇంతకంటే పెద్దదేదైనా సరే వుండటం అసంభవం ఈ సముద్రపుకప్ప వట్టి 'అబద్ధాలకోరు'. దీన్ని తరిమి వెయ్యాలి" అనుకుంది. నీ చిన్నబావిలో నీవు కూర్చుని యావత్ ప్రపంచమూ చిన్న బావే అనుకుంటున్నావు. పరస్పర దూషణలను మానుకొని విశాల దృక్పథం అలవరచుకున్నప్పుడే ఈ పరస్పర విభేదాలు సమసిపోతాయి మిత్రమా! అంది సముద్రపు కప్ప.

పిల్లలూ! మనకు తెలియని ప్రపంచం ఎంతో వుంది. విశాల దృక్పథం, మంచి మనసుతో దాన్ని తెలుసుకోవడం మంచిది.

79. కష్టేఫలి!


ఒక రైతుకు ద్రాక్షతోట వుండేది. రాత్రింబవళ్ళు కష్టపడి ఆ ద్రాక్ష తోటను కాపాడుకుని జీవించేవాడు. అతనికి నలుగురు కొడుకులు. అతని బాధల్లా ఆ కొడుకులు ఎలా బతుకుతారో ఏమైపోతారో అని. ఎందుకంటే వాళ్ళు నలుగురూ బద్దకస్తులు. సోమరిపోతులు. ఏ పనీచెయ్యకుండా తిని తిరుగుతూ వుండేవారు.

రైతు పెద్దవాడయిపోయాడు. ఇంక ఎంతో కాలం బతకనని ఆలోచిస్తూ మంచం పట్టాడు. చివరి ఘడియలు సమీపించాయి. వాళ్ళను చూసి 'నాయనలారా! మీకు ఏమీ ఇవ్వలేకపోయాను. నేను ఎంతో కాలం బతకను. కానీ మా నాన్న చెప్పేవాడు. మన ద్రాక్షతోటలో ఎక్కడో బంగారు పాతిపెట్టానని. కాబట్టి మీరు ఆ ద్రాక్షతోటంతా తవ్వేచూస్తే తప్పకుండా మీకు బంగారం దొరకవచ్చు, ప్రయత్నించండి" అని కన్ను మూశాడు. నలుగురు కొడుకులు ద్రాక్ష తోటకి వెళ్ళి తవ్వడం మొదలు పెట్టారు ఒకరోజు. వారంరోజులు తవ్వారు. కొంత నేలకూడా మిగలకుండా తవ్వేశారు. బంగారం దొరకలేదు. అలసిపోయారు, నీరసించిపోయారు. ఏమిటి మానాన్న ఇలా చెప్పాడే. మానాన్న అబద్ధం చెప్పాడే' అనుకున్నారు. రోజులు గడిచాయి. వర్షాలు వచ్చాయి. ద్రాక్షతోట విరగగాచింది. రైతు ఎంత కష్టపడినా రాని పంట ఆ సంవత్సరం వచ్చి, చాలా డబ్బులు వచ్చాయి. నలుగురు కొడుకులూ అంత డబ్బు ఎప్పుడూ కళ్ళ జూడలేదు. అప్పుడు వాళ్ళకు తెలిసి వచ్చింది. వాళ్ళ నాన్న ద్రాక్షతోటలో బంగారు వుందని చెప్పిన మాటలకి అర్థమేమిటో. కష్టపడితే బంగారు దొరుకుతుందన్న సంగతి వాళ్ళకు తెలిసి వచ్చింది. పిల్లలూ! ఏ పనినైనా కష్టపడిచేస్తే ఫలితం తప్పక లభిస్తుంది.



80. తృప్తికర జీవితానికి మూడు సూత్రాలు

ఒక రోజు సాయంత్రం రాణిగారు రథంలో కూచుని ఊరి చివరగా వచ్చి ప్రకృతి దృశ్యాల్ని చూస్తూ ఆగింది. సూర్యాస్తమయం, చల్లగాలి ఆమెను ఎంతో



ఉల్లాసపరిచాయి. ఊరి చివర వున్న పేదవాళ్ళు వచ్చి రాణిగారికి నమస్కరించారు. అందమైన పూల గుత్తులు, పండ్లు ఇచ్చారు. చాలా సంతోషంతో రాణిగారు అవన్నీ తీసుకుంది. ప్రజలు తనపట్ల అంత అభిమానం చూపిస్తున్నందుకు పొంగిపోయింది. మెల్లగా చీకటి పడింది.


ఉన్నట్లుండి ఆకాశంలోకి మేఘాలు వచ్చాయి. సన్నగా తుంపర మొదలయింది. రాణి రథంలో కూచుంది. రథసారథి రథాన్ని ముందుకు పోనిచ్చాడు. గుర్రాల్ని అదిలించాడు. వర్షం క్రమక్రమంగా ఎక్కువైంది. గుర్రాలు అడుగు ముందుకు వెయ్యలేకపోయాయి. సారథికి ఏం చెయ్యాలో దిక్కుతోచలేదు. దగ్గర్లో ఇళ్ళ కోసం చూశాడు. ఒక్క గుడిసె తప్ప చుట్టుపక్కల ఇళ్ళులేవు. తప్పనిసరై రథాన్ని గుడిసె ముందు ఆపాడు. శబ్దం విని ఒకావిడ తలుపు తెరిచింది. ఎదురుగా రాణి. ఎంతో వినయంతో ఆమె రాణిగారిని ఇంట్లోకి ఆహ్వానించింది. కుర్చీవేసింది. రాణి కూర్చుంది. రాణి ఆ గుడిసెను పరిశీలించి చూసింది. అదిపూరి గుడిసె. కాని చాలా శుభ్రంగా వుంది. ఎదురుగా ముగ్గురు అమ్మాయిలు కూచుని జొన్న అన్నం, ఎర్రకారంలో కలుపుకుని తింటున్నారు. కానీ ఆ అమ్మాయిలు నిండుగా, పుష్టిగా, ఆనందంగా కనిపించారు. అంత పేద తిండి తింటూ వాళ్ళు అంత అందంగా, ఆరోగ్యంగా ఎలా వున్నారా అని ఆ రాణి ఆశ్చర్యపోయింది. ఆ సంగతే ఆ పిల్లల తల్లిని అడిగింది. రాణిగారూ! నా పిల్లలు అంత ఆనందంగా వుండడానికి మూడు కారణాలున్నాయి.

మొదటిది:వాళ్ళు కష్టజీవులు. తమ రెక్కల కష్టంతో సంపాదించిన తిండిని తింటున్నారు.

రెండోది : ఇతరుల నుంచి ఏమీ ఆశించరు. ఇతరులు ఊరికే ఇచ్చింది తినరు. **మూడోది :** బయటి ప్రపంచంలోని దేనికీ ఆశించరు. ఆకర్షింపబడరు.

వాళ్ళ ఆరోగ్య రహస్యాన్ని, ఆనంద రహస్యాన్ని తెలుసుకుని రాణి ఆశ్చర్యపోయింది. ఆత్మాభిమానం వున్నవాళ్ళే ఆనందంగా జీవించగలరని, కష్టజీవులే తృప్తికర జీవితాన్ని అనుభవించగలరని రాణి తెలుసుకుంది. కష్టపడి పనిచేసేవారే తృప్తికర జీవితాన్ని అనుభవించగలరు.

81. ముత్యాల సంచి



ఓ బాటసారి ఒకసారి దారి తప్పి అడవిలోకి వెళ్ళాడు. దారికోసం తెగతిరిగాడు. చెట్లుపుట్టలు తప్ప దారే కనిపించలేదు. దారిలో ప్రయాణానికి తెచ్చుకున్న అన్నం తిన్నాడు. నీళ్ళు తాగాడు. సాయంత్రమయింది. రాత్రయింది. బాటసారికి భయం పట్టుకుని ఏ పులో, సింహమో తనని చంపేస్తుందని వణికిపోయాడు. ఒక చెట్టుకి రెండు కొమ్మల మధ్య పడుకుని ఆ రాత్రి గడిపాడు. ఉదయం లేచి మళ్లీ బయల్దేరాడు. ఎంత దూరం వెళ్ళినా దారి దొరకలేదు. నీరసించిపోయాడు. నడవలేకపోయాడు. కళ్ళు తేలిపోతున్నాయి. సాయంత్రం కావచ్చింది. అడవిలో దిక్కులేని చావు చావమని దైవం తనకు శిక్ష విధించినట్లున్నాడని దిగులు పడిపోయాడు. మెల్లగా తూలుతూ ఎదురుగా వున్న పెద్ద మర్రి చెట్టుకిందకు చేరాడు. ఆ చెట్టు నీడలో పడుకుని కళ్ళుమూసుకున్నాడు. ఆకలి దహించుకు పోతోంది. దాహంతో గొంతు ఎండిపోతోంది.. ఐదు నిముషాలయ్యాకా మెల్లగా కళ్ళు తెరిచి చుట్టూ చూశాడు. చుట్టూ చెట్లే, చెట్లు తప్ప ఏమీ లేవు. ఒక్కసారిగా బాటసారికి దుఃఖం పొంగి

పొర్లింది. ఇంటి దగ్గరున్న భార్యాపిల్లలు గుర్తుకొచ్చారు. అంతలో ఒక మర్రిచెట్టు మొదట్లో ఒక సంచి కనిపించింది. ఎవరో అడవిలోకి వచ్చి మరచిపోయి వదిలి పెట్టి వుంటారనుకున్నాడు. ఒక రొట్టె, కాస్త అన్నము ఆ సంచిలో వుంటే దేవుడా బతుకంతా నీ మేలు మరచిపోను అనుకుని చెట్టు ఎక్కి ఆ సంచి విప్పిచూశాడు. మెరిసిపోతూ సంచి నిండా ముత్యాలు కనిపించాయి. ఆ ముత్యాలతో అతను గొప్ప ధనవంతుడయి పోవచ్చు. కానీ పిడికెడు మెతుకులు ముందు అతని పరిస్థితికి అవి ఎందుకూ పనికిరానివి. 'దేవుడా! నేను వీటిని ఏం చేసుకోను' అని బావురుమని ఏడ్చి సంచిని పక్కకు పడేశాడు. అంతలో దూరం నుంచి ఒక ఒంటె వస్తూ కనిపించింది.

ఆ ఒంటెమీద ఒక మావటీ వాడు ఉన్నాడు. అతను ఆ మర్రి చెట్టు మొదటికి వచ్చి తను మరచిపోయిన ముత్యాల సంచిని చూసి ఆనందించాడు. చావు బతుకుల్లో వున్న బాటసారికి నీళ్ళు, రొట్టె యిచ్చి ప్రాణాలు కాపాడి తనతో పాటు ఒంటెపై కూర్చోబెట్టుకుని అడవి దాటించాడు. అప్పుడు మావటివాడు చూడు! దేవుడు ఏ పని అయినా మన మంచికే చేస్తాడు. నేను ముత్యాల సంచి మరచిపోకుంటే నిన్ను చూడగలిగే వాణ్ణికాను. నేను చూడకుంటే నువ్వు తిండి దొరకక చనిపోయేవాడివి" అన్నాడు. ఇద్దరూ దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. మనిషికి ఆకలి వేసినపుడు అన్నమే దేవుడితో సమానం. అందుకే పెద్దలు "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అన్నారు.

82. మరపురాని గతం

రాజుగారి కోశాధికారి మీద ఆరోపణలు వచ్చాయి. అతను కోశాగారం నుండి ధనాన్ని అపహరించి రహస్యంగా తరలిస్తున్నాడని, ఒక రహస్య గృహాన్ని కట్టుకున్నాడని పుకార్లు వ్యాపించాయి. నిజానికి కోశాగారం నుంచి ధనమేమీ

మాయం కాలేదు. ఎక్కడి బంగారు అక్కడే వుంది. వదంతులు విపరీతంగా వ్యాపించాయి. నిజానిజాలు తెలుసుకోవాలని రాజు గారికి అనిపించింది. కోశాధికారి ఇల్లు ఊరికి చివరన వుంది. రాజుగారు కోశాధికారి ఇంటికి హఠాత్తుగా వెళ్ళాడు. రాజుగార్ని చూసి కోశాధికారి ఆశ్చర్యపోయాడు. రాజుగారు కోశాధికారితో మాట్లాడకుండా సేవకుడితో ఆ రహస్య గృహద్వారాల్ని తెరవమన్నాడు. సేవకుడు తెరిచాడు. రాజుగారితో పాటు కోశాధికారి కూడా ఆ గదిలోకి వచ్చాడు. ఆ గదిలో వస్తువులు చూసి రాజు ఆశ్చర్యపోయాడు. ఒక బల్లపై పిల్లనగ్రోవి, గోడకు ఆనించిన ఒక పాతబట్టల మూట, ఒక చిన్న తలపాగా, గోడకు ఆనించిన ఒక కట్టె మాత్రమే ఉన్నాయి. రాజుగారు కిటికీ దగ్గరికెళ్ళి చూశాడు. దూరంగా కొండలు, పక్షులు. నీలాకాశం. "ఏమిటిదంతా?" అన్నాడు రాజు. వినయంగా కోశాధికారి చెప్పడం మొదలు పెట్టాడు. "రాజుగారూ! ఇదంతా నా గతం. నేను గొర్రెలు మేపుకునే సామాన్యమైన కాపరిని. ఆ సంచిలో ఉన్నది నేను అప్పుడు కప్పుకున్న కంబళి. గోడకు ఆనించిన కర్ర నేను గొర్రెల్ని అదిలించడానికి ఉపయోగపడేది. బల్లపై వున్న పిల్లనగ్రోవి నేను అప్పుడు వాయించిన పిల్లనగ్రోవి. కిటికీలో నుంచి కనిపించే ప్రకృతి అంతా ఆ రోజుల్లో నన్ను కన్నతల్లిలా కాపాడింది. ఇవేవీ నేను మరచిపోలేను.

నా నిరాడంబర జీవితం నామనసును ఎప్పుడూ వదిలిపోలేదు. నా నిరాడంబర జీవితాన్ని నా ఆనందాన్ని చూసి ముచ్చట పడి నన్ను తీసుకొచ్చి ఈ కోశాధ్యక్ష పదవిని యిచ్చారు. కానీ నేను నా గతాన్ని మరచిపోలేను. ఎంతవాడైనా, ఎన్ని సాధించినా, ఎప్పుడూ నీ గతాన్ని మరచిపోవద్దని నా తండ్రి చెప్పాడు. రాజుగారూ! నేను దాచుకున్న ధనం యిది అన్నాడు కోశాధ్యక్షుడు. ఇంత నిజాయితీ పరుడు, నిస్వార్థపరుడు, నిరాడంబరుడు తన కోశాధికారి అయినందుకు రాజుగారు ఎంతో ఆనందించాడు నిజాయితీ, నిస్వార్థత, నిరాడంబరత మానవుడ్ని మహనీయుణ్ణి చేస్తుంది.

83. అలవాటు



ఇంగ్లీషులో Habit అంటే అలవాటు. ఆ పదంలో H తీసేసినా abit అని మిగుల్తుంది. a తీసేస్తే bit మిగుల్తుంది. b తీసేస్తే it వుంటుంది.. i తీసేస్తే t మిగుల్తుంది. Tలో 'టీ' అన్న ధ్వని వుంది. అంటే అలవాటు ఒక పట్టాన వదిలించుకోలేం అని అర్థం.

కిరణ్ అనే లారీ డ్రైవర్‌కు తాగుడు అలవాటు వుంది. ఒకసారి ఆరోగ్యం బాగాలేక డాక్టర్ దగ్గరకు వెళ్ళాడు. రక్త పరీక్షలు మొదలైనవి చేశాకా డాక్టర్ 'మీకేమైనా అలవాట్లు వున్నాయా? అని అడిగాడు. రామారావు వున్నాయన్నాడు. 'డాక్టర్ గారూ! నేను రాత్రిళ్ళు లారీని చాలా దూరం డ్రైవ్ చేయాల్సి వుంటుంది. ఒళ్ళునొప్పులు తగ్గాలన్నా నిద్రపట్టాలన్నా నేను సారా తాగక తప్పదు. రోజుకు ఒక బాటిల్ తాగుతాను' అన్నాడు. అంతా విని డాక్టర్! నువ్వు తాగుడు మానెయ్యకపోతే నీ ఆరోగ్యం బాగు పడడం కష్టం' అన్నాడు. 'డాక్టర్ గారూ! ఇది ఒకరోజులో వచ్చిన అలవాటు కాదు. ఒక్కరోజులో మానేయ్యమంటే కష్టం' అని రామారావు చెప్పాడు. డాక్టర్ ఆలోచనలో పడ్డాడు. అలవాటు అన్నది ఎవరైనా ఒక్కసారిగా వదులుకోవడం అంత సులభం కాదు. కనుక దీనికి ఏదైనా ఒక మార్గం ఆలోచించాలనుకున్నాడు. లోపలికి వెళ్ళి పెద్ద బాటిల్ తెచ్చిచ్చాడు. దాని నిండుగా చిన్న చాక్లెట్ల సైజులో తెల్లరాళ్ళున్నాయి.

డాక్టర్ ఆ బాటిల్ రామారావుకు ఇచ్చి 'నువ్వు తాగుడు మానవద్దు. కానీ ప్రతి రోజు తెల్లగా గుండ్రంగా వున్న ఈ మాత్రల్ని మాత్రం నువ్వు రోజుకొకటి బాటిల్లో వేసుకుని తాగు. ప్రతిరోజూ ఈ మాత్రల్ని బాటిల్లో వేసి అందులోనే నీ మందు వేసుకుని తాగాలి. అవి కరగవు. ఈ రోజు ఒక మాత్ర, రేపు రెండు

అలా బాటిల్లో వెయ్యి' అన్నాడు. సారావల్ల ప్రమాదాన్ని తగ్గించే మాత్రల్లా వున్నాయనుకున్నాడు రామారావు. రోజుకో రాయి బాటిల్లో వేస్తూ తాగుతూ పోయాడు. దానివల్ల రోజుకొక స్పూన్ తక్కువగా తాగుతూ వచ్చాడు. రాళ్ళన్నీ సీసాలో వెయ్యక ముందే నెలరోజులు తిరక్కముందే అతను సారా తాగడం మానేశాడు. అలవాటును నెమ్మదిగా తగ్గించుకోవచ్చు కానీ ఒక్కసారిగా మానిపించడం ఎవరివల్లా కాదని ఈ కథ చెబుతుంది. ఏ అలవాటునైనా నెమ్మదిగా తగ్గించుకోవచ్చు.

84. బ్రాహ్మణుడు - నలుగురు దొంగలు

తామ్రపర్ణి నది ఒడ్డున శ్రీరామపురం అనే ఊరిలో వసంతుడు అనే బ్రాహ్మణుడు నివసించేవాడు. అతడు యజ్ఞం చేయాలని తలపెట్టి, నాలుగు మేకలు యజ్ఞానికి కావాలని అనుకున్నాడు. పక్కనున్న పల్లెకు వెళ్ళి బాగా బలిసిన మేకల్ని కొని, వాటి మెడకు తాడుకట్టి వాటితో ఇంటి ముఖం పట్టాడు. దారిలో నలుగురు దొంగలు ఆ మేకలను చూసి వాటిని తస్కరించాలని అనుకున్నారు. బ్రాహ్మణున్ని నమ్మించి మోసం చేయాలని పన్నాగం పన్నారు. అందులో ఒక దొంగ బ్రాహ్మణునికి ఎదురుగా వచ్చి "ఎందుకయ్యా అన్ని పిచ్చికుక్కల్ని తోలుకెళ్తున్నావు?" అని ప్రశ్నించాడు. బ్రాహ్మణుడు ఆ వ్యక్తిని వెర్రివాడనుకొని ముందుకు సాగాడు. కొంత దూరం పోయాక రెండవ దొంగ ఆ బ్రాహ్మణునితో "ఏమిటి స్వామి! పిచ్చి కుక్కల్ని తోలుకెళ్తున్నావు? జాగ్రత్త! అవి నిన్ను కరిచేవు" అని అన్నాడు.


రెండవ వాని మాటలు విని బ్రాహ్మణునికి కాస్త అనుమానం కలిగింది. కాసేపు నడిచిన తరువాత మూడవ దొంగ ఎదురుపడి చాల కోపంతో "ఏమిటయ్యా! దారినపోయే వాళ్ళమీదకు నీ పిచ్చి కుక్కల్ని తరుముతావా?

బాటసారులను బతకనివ్వవా" అని అన్నాడు. బ్రాహ్మణుడు మూడవవాని మాటలు విని తను తోలుకెళ్తున్నవి పిచ్చి కుక్కలే కాబోలు అని నిశ్చయించుకున్నాడు. ఇక నాలుగవ దొంగ వచ్చి "ఆ నాలుగు పిచ్చి కుక్కల్ని ఒక చెట్టుకు కట్టేయవయ్యా, లేకపోతే అవి మనుషుల మీదకు దూకి కరిచి చంపేస్తాయి" అని గట్టిగా అరిచాడు.

ఆ మాటలు విన్న బ్రాహ్మణుడు ఆ మేకల్ని ఒక చెట్టుకు కట్టేసి అక్కడ నుంచి పారిపోయాడు. అప్పుడా నలుగురు దొంగలు ఆ మేకల్ని చెట్టునుంచి కట్లు విప్పి వాటిని తోలుకెళ్ళిపోయి దగ్గరలో వున్న సంతలో అమ్మేసి వచ్చిన డబ్బును పంచుకున్నారు.

అందుకే లోకంలో తప్పయినా ఒప్పయినా "నలుగురు మాటాడిందే మాట, నలుగురు నడిచిందే బాట" అన్నారు. అబద్ధమైనా నలుగురు పలికితే 'నిజం'గా చలామణి అవుతుంది.

85. గొర్రె పిల్ల - సింహం



అదొక మహారణ్యం. ఆ అరణ్యంలో ప్రసవ దశలో ఉన్న సింహం. అనారోగ్యానికి గురై ప్రసవించి మరణించింది. సింహం పిల్ల ఇంకా సరిగా కళ్ళు కూడా తెరవలేదు. రోజూ అటువైపుగా తన గొర్రెల మందతో వచ్చే గొర్రెల కాపరి ఆ రోజూ వచ్చాడు. అతనిది పెద్ద మంద. ఆ మందలో ఈ సింహం పిల్ల కలిసిపోయింది. మందలోకి వెళ్ళిన తర్వాత అది కూడా గొర్రె పిల్లల్లో ఒకటయింది. ఆ గొర్రె పిల్లల మాదిరిగానే తల వంచుకోడం, గడ్డి పోచలు మేయడం, "బేబే" అనడం మొదలు పెట్టింది. మందతో పాటు అడవికి పోతుంది.. మళ్ళీ కొట్టానికి వస్తుంది.

ఓనాడు అడవిలో ఓ సింహం ఈ గొర్రెల మందను తరిమింది. అన్నిటికన్నా వెనుక ఉన్న ఈ సింహం పిల్లనది పట్టుకొంది. ఆ సింహం పిల్ల 'బేబే' అంది, నన్ను విడువుమని మరీ దీనంగా బేబే అన్నది. సింహం ఆశ్చర్యపోయి దానిని ఓ బావి దగ్గరికి తీసుకొని వెళ్ళి బావిలోకి తొంగిచూడమంది. అది చూచి తన ఆకారం, సింహం ఆకారం ఒకే విధంగా ఉంది అంది. ఆకారమే కాదు గర్జన కూడా విను అంటూ సింహం గర్జించింది. పంజాతో ఒక్క దెబ్బ వేసింది సింహం. అప్పుడు సింహం పిల్లకు తన శక్తి ఏంటో తెలిసి వచ్చింది.

86. పిచ్చివాడి తెలివి

ఒక ఆటవిక రాజ్యంలో నేర్పరి అయిన కమ్మరి ఒకడుండేవాడు. ఆ రాజ్యంలో గల పరికరాలను వేటగాళ్ళు, వ్యవసాయదార్లు తమకు కావలసినవి ఆ కమ్మరి చేతనే చేయించుకునేవారు. ఒకరోజు ఉదయం కమ్మరి తన కొలిమికి తిత్తిపోసి పని ప్రారంభించబోతుండగా, రాజభటుడొకడు వచ్చి, రాజుగారు వెంటనే రమ్మంటున్నారని చెప్పాడు. వెంటనే కమ్మరి కొలిమి ముందు నుంచి లేచి, బట్టలు మార్చుకుని రాజుగారి వద్దకు బయలుదేరాడు. కమ్మరి వచ్చాడని భటులు చెప్పగానే రాజు అతన్ని తన సమక్షానికి రప్పించి, అనేక ఉక్కుముక్కలు అతనిముందు పెట్టి, 'నువ్వు వీటిని తీసుకుపోయి కరిగించి, మనిషిని తయారుచెయ్యాలి. ఉక్కుతో చేసిన మనిషి కాదు రక్తమాంసాలు గలిగి, అన్ని పనులూ చేస్తూ ఆలోచించగల ఉక్కుమనిషిని తయారు చెయ్యాలి.

నీకు నెలరోజులు గడువిచ్చాను," అన్నాడు. కమ్మరికి మతి పోయినట్టయింది. రాజాజ్ఞకు ఎదురుచెప్పటానికి లేదు. చెప్పినట్టు చెయ్యకపోతే రాజు తల తీయించి వేస్తాడు. అందుచేత కమ్మరి గుండెలో రాయి పడింది. అతను రాజుకు వంగి నమస్కారం చేసి, ఇంటిదారి పట్టాడు. తరువాత కమ్మరి

మిత్రులంతా అతని ఇంటికి వచ్చి, అతనికి ఏర్పడిన ప్రమాద పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఆ ప్రమాదం నుంచి అతను బయటపడటానికి తలా ఒక మార్గమూ చెప్పారు. కాని ఈ సూచనలేవీ కమ్మరికి ఆచరణయోగ్యంగా తోచలేదు. అతను అహోరాత్రాలూ మనోవ్యాధికి గురి అయి, నిద్రాహారాలు మాని, మనుషుల మధ్య ఉండలేక అరణ్యంలో తిరుగుతూ, తనలో తాను మాట్లాడుకునే స్థితికి వచ్చాడు. ఇలా అతను తిరుగుతూండగా అరణ్యంలో ఒకచోట ఒక పిచ్చివాడు, అకస్మాత్తుగా ఎదురుపడి, "నువ్వేనా కమ్మరన్నా? ఈ పూట మా ఇంటికి విందుకు రావాలి" అన్నాడు..

ఈ పిచ్చివాడు కమ్మరికి పాత స్నేహితుడే, కొంతకాలం కిందట అతనికి మతి చలించింది. అది మొదలు అతను అరణ్యంలోనే తిరుగుతున్నాడు. ఎవరికంటా పడటంలేదు. ఆ పిచ్చివాణ్ణి చూడగానే కమ్మరికి జాలితోబాటు అసూయ కూడా కలిగింది. వాడికి ఏ విచారమూ లేదు. హాయిగా ఉన్నాడు. కమ్మరిని పిచ్చివాడు ఒక చెట్టుకిందికి తీసుకుపోయి, "ఇదే మన ఇల్లు, ఇదుగో విందు!" అంటూ ఇన్ని నేరేడు పళ్ళూ, తేనెపట్టూ తెచ్చి కమ్మరికి ఇచ్చాడు. ఇద్దరూ నేరేడుపళ్ళు తిని, తేనెపట్టు పిండుకు తాగారు. చాలా రోజులుగా తిండిలేక మాడుతున్న కమ్మరికీ భోజనం అమృతంలాగా ఉన్నది.. కమ్మరి ఆ పిచ్చివాడితో, రాజుగారు తనకిచ్చిన పని గురించి చెప్పి, "ఉక్కుతో నిజమైన మనిషిని చెయ్యమంటాడు రాజు. అది సాధ్యమా? చెయ్యకపోతే నన్ను రాజు చంపేస్తాడు." అన్నాడు.

పిచ్చివాడు కొంచెం ఆలోచించి, "ఉక్కుతో మనిషిని చెయ్యొచ్చునే! అదేం కష్టం?" అన్నాడు. "ఎలా?" అన్నాడు కమ్మరీ. పిచ్చివాడు కమ్మరికి దగ్గిరగా జరిగి, "ఇది రహస్యం, స్నేహితుడివి. కనక చెబుతున్నాను. కొలిమిలో మనిషి వెంట్రుకలతో మంట చేసి ఉక్కు కరిగించాలి. మంట మరీ జాస్తి అయినప్పుడు

మనిషి కన్నీళ్ళు దానిమీద చల్లుతూ ఉండాలి. అలా ఉక్కుని కరిగించి పోత పోస్తే నిజమైన మనిషి తయారవుతాడు. ఈ రహస్యం జ్ఞాపకం ఉంచుకో "అని చెప్పాడు. కమ్మరి తలలో ఒక ఆలోచన మెరిసింది. "బాగుందన్నా, నువ్వు చెప్పినట్టే చేస్తాను. మళ్ళీ కనిపిస్తాను" అంటూ అతను పిచ్చివాడి దగ్గర సెలవు తీసుకుని, తిన్నగా రాజుగారి వద్దకు వెళ్ళి, "మహారాజా, ఉక్కుతో మనిషిని చెయ్యటానికి ఏర్పాట్లన్నీ చేశాను.

నాకు కావలసిన సరుకు సామాను తమరు తెప్పించాలి" అన్నాడు. ఆ సామాన్లేమిటని రాజు అడిగాడు. "ఉక్కు కరిగించటానికి బొగ్గు పనికిరాదు. మనిషి వెంట్రుకలు కావాలి అవి ఒక వెయ్యి బళ్ళు తెప్పించండి. కొలిమి మరీ వేడెక్కినప్పుడు చల్లటానికి మనిషి కన్నీరు కావాలి. అవి ఒక వెయ్యి కడవలు తెప్పించండి. ఇవన్నీ దగ్గిర పెట్టుకుని కాని ఉక్కుమనిషిని చేసే పని ప్రారంభించటానికి లేదు" అన్నాడు కమ్మరి. రాజు సరేనని తన రాజభటులను రాజ్యంమీదికి పంపాడు. వాళ్ళు తిరిగివచ్చి, "మహారాజా, కమ్మరి కోరే సామాన్లు దొరికేటట్టులేవు. ఒక బండెడు వెంట్రుకలూ, ఒక కడివెడు కన్నీరూ అయితే దొరుకుతుందేమో కాని అంతకుమించి దొరకదు," అని చెప్పాడు. రాజు నిరుత్సాహం చెంది, కమ్మరిని పిలిపించి, "ఉక్కుతో మనిషిని చెయ్యటానికి కావలసిన ద్రవ్యాలు, రాజ్యంలో ఎక్కడా దొరికేటట్టు లేవు. పోనీ ఆ పని మానేద్దాం" అన్నాడు. కమ్మరి, ప్రాణాలు కుదుటపడి, బతుకుజీవుడా అని ఇంటికి చేరుకున్నాడు. అతను అరణ్యంలో ఉంటున్న పిచ్చివాణ్ణి తెచ్చి తన ఇంట్లోనే ఉంచుకుని, తిండీ బట్టా ఇచ్చి పోషించాడు.

నీతి : తెలివైన ఆలోచన ఒక్కో సారి ప్రాణాల్ని కూడా నిలబెడుతుంది.

87. తండ్రి ఆశీర్వచనం

ఒక వర్తకుడికి ఒక కొడుకుండేవాడు. వర్తకుడి కొడుకు చిన్నతనంలోనే భార్య చనిపోయింది. అందుచేత ఆయన కొడుకును చాలా గారాబంగా పెంచి, వాడికోసం బంగారాన్ని రెండుచేతులా ఆర్జించి, వాడి సుఖం కోసం దాన్ని మంచినీటిలాగా ఖర్చుచేస్తూ వచ్చాడు. తన కొడుకు సుఖం తప్ప ఆ మానవుడికి మరొక ఆలోచనే ఉండేది కాదు.

కొంతకాలానికి వర్తకుడు మంచాన పడ్డాడు. చావు దగ్గర పడినట్టు తెలుసుకుని ఆయన తన కొడుకును పిలిచి, "బాబూ, నువు మట్టి పట్టినా అది బంగారం కావాలని నా ఆఖరు ఘడియలో నిన్ను మనస్ఫూర్తిగా దీవిస్తున్నాను," అంటూ ప్రాణాలు వదిలాడు. వర్తకుడి కొడుకు తండ్రికోసం కొన్ని వారాలపాటు శోకించి, ఆ శోకం ఉపశమించాక, తండ్రిలాగే వర్తకంలోకి దిగాడు. తండ్రికి లాగే కొడుక్కి కూడా వ్యాపారం అమితంగా కలిసివచ్చి, కనకవర్షం కురిసింది.

కొంతకాలం ఇలా ఎడాపెడా ధనం సంపాదించాక కుర్రవాడికి తన తండ్రి చేసిన ఆఖరు ఆశీర్వచనం జ్ఞాపకం వచ్చింది. ఆయన నోటి చలవ చేతనే తనకిలా వద్దంటే డబ్బు వచ్చిపడుతున్నదనుకుని, "అదృష్టం ఇలా కలిసిరావటం అపాయకరం. దీనికి ఏదన్నా విరుగుడు చూడాలి." అనుకున్నాడు వాడు. తన అదృష్టానికి కళ్ళెం వేసే ఉద్దేశంతో వాడు వర్తకపు సరుకులను హెచ్చుధర ఉండే ప్రాంతంలో కొని, తక్కువ ధర ఉండే ప్రాంతంలో అమ్మటానికి నిశ్చయించాడు.

ఆ ఉద్దేశంతో వాడు చాలా గిరాకీగా ఉండేచోట ఖర్జూరాలు కొని, వాటిని ఈజిప్టుదేశంలో అమ్మటానికి తీసుకుపోయాడు. ఆ దేశంలో ఖర్జూరాలు కారుచవక. ఎవరో వర్తకుడు ఎక్కడినుంచో ఖర్జూరాలు తెచ్చి తన దేశంలో అమ్ముతున్నట్టు ఈజిప్టు రాజుకు తెలిసింది. ఆయన తన ఉద్యోగులతో, "ఎవరీ వింత వర్తకుడు?" అన్నాడు. రాజోద్యోగులు రాజును కుర్రవాడివద్దకు తీసుకుపోయారు. "ఈ మతిలేని

వ్యాపారం చేసి ఉన్నదంతా ఎందుకు తగలేసుకుంటున్నావు?" అని రాజు యువకుణ్ణి అడిగాడు.

"మహారాజా! మా నాన్న ఆశీర్వాదం చేత నేను ఎంత నిర్లక్ష్యంగా వర్తకం చేసినా కనకవర్షం కురుస్తున్నది. అదృష్టం అంతగా కలిసిరావటం మంచిదికాదని దానికి విఘ్నం కలిగించే ప్రయత్నంలో ఉన్నాను," అన్నాడు యువకుడు. "ఇలా మట్టి తీసుకుంటే బంగారమవుతుందని మా నాన్న చనిపోతూ నన్ను ఆశీర్వదించాడు," అంటూ ఆ కుర్రవాడు నేలకు వంగి, పిడికెడు మన్ను తీసి కిందికి జారవిడిచాడు. మన్ను చేతినుంచి రాలిపోగా యువకుడి చేతిలో ఏదో దిగబడింది. ఏమిటది? అన్నాడు రాజు ఆశ్చర్యంతో. "ఏదో ముద్రికలాగుంది", అంటూ ఆ యువకుడు దాన్ని రాజు చేతిలో పెట్టాడు. అది రాజుగారి ముద్రికే. ఏడాదిక్రితం అది ఎక్కడో పోయింది. దానిపైన గల అభిమానంకొద్దీ రాజు ఎంతో ధనం వ్యయంచేసి ఆ ముద్రికకోసం వెతికించాడు. కాని ప్రయోజనం లేకపోయింది.

"నిజంగా మీ తండ్రి ఆశీర్వచనం అమోఘం. నీ అదృష్టాన్ని మార్చటం దేవుడితరం కూడా కాదు," అని రాజు, ఆ కుర్రవాడికి తనకుమార్తెనిచ్చి పెళ్ళిచేశాడు. తరవాత ఆ కుర్రవాడే ఈజిప్టుకు రాజుకూడా అయ్యాడు.

నీతి : కన్నతండ్రి ఆశీర్వచనం కన్నబిడ్డకి అదృష్టాన్ని తెచ్చిపెడుతుంది.

88. మాటనేర్పు

సొంత ఊళ్లో చెప్పుల దుకాణం పెట్టాడు రంగయ్య. చెప్పులు కొనడానికి కొంతమంది వస్తున్నా, రకరకాల కారణాలు చెప్పి కొనకుండానే తిరిగి వెళ్లిపోతున్నారు. రంగయ్యకు ఏంచేయాలో అర్థంకాక, కిష్టయ్య దగ్గరకు వెళ్లి తన బాధను వెళ్లబోసుకున్నాడు. అంతా విన్న కిష్టయ్య రేపు నీ దుకాణంలో నేనే

కూర్చుని అమ్ముతాను. నువ్వు ఆలోచించకుండా ఇంటికి వెళ్లు' అన్నాడు. మర్నాడు కిష్టయ్య దుకాణంలో కూర్చున్నాడు. ఒక ముసలాయన రాగానే 'రా పెద్దాయనా, ఇలా కూర్చో... ఈ చెప్పులు నీకు సరిగ్గా సరిపోతాయి' అని చెప్పులు చూపించాడు. 'ఇవి బానే ఉన్నాయి. కానీ బిగుతైపోయాయి' అన్నాడు. వెంటనే కిష్టయ్య 'ఇవి నాణ్యమైన తోలుతో చేసిన చెప్పులు. నాలుగురోజులు తొడుక్కుంటే వదులైపోతాయి. ఏడాది వరకూ మళ్లీ కొనే పనే ఉండదు పెద్దాయనా' అన్నాడు.

'సరే నువ్వు ఇంతగా చెబుతుంటే కాదనేది ఏముంది. అలాగే ఇవ్వు' అని చెప్పులు తీసుకున్నాడా పెద్దమనిషి. మరొక వ్యక్తి తన కొడుక్కి చెప్పులు కొనడానికి వచ్చి... 'చెప్పులు బాగున్నాయి కానీ వదులైపోయాయి అన్నాడు. వెంటనే కిష్టయ్య కల్పించుకుని 'ఎదిగే పిల్లాడికి కాస్త వదులు చెప్పులే ఉండాలండీ. రెండుమూడు నెలల్లో బిగుతైపోతే మరో జత కొనాల్సి వస్తుంది' అన్నాడు. 'సమయానికి బాగానే గుర్తుచేశావు. నాకు తట్టలేదు సుమా' అని కొడుక్కి అవే చెప్పులు తీసుకున్నాడు. కిష్టయ్యను గమనించిన రంగయ్యకు వ్యాపారం చేయడానికి మాట నేర్పు ఎంత అవసరమో తెలిసివచ్చింది.

నీతి : వ్యాపారానికైనా వ్యవహారానికైనా మాటనేర్పు అవసరం.

89. దైవజ్ఞుడు

ఒక గ్రామంలో రామయ్య అనే భూస్వామి ఉండేవాడు. అతని భార్యకు క్రమంగా ఆరోగ్యం చెడి చివరకు మంచం పట్టింది. 'జబ్బేమిటో వైద్యులకు అంతుచిక్కలేదు. వ్యాధిలక్షణాలను బట్టి మందులూ, మాకులూ ఇస్తే అవేవీ పనిచెయ్యలేదు. రామయ్య ఉండే గ్రామానికి దగ్గరలోనే మరొక గ్రామంలో దైవజ్ఞుడొకడుండేవాడు. కోరికలు తీరనివారెవరైనా ఆయనవద్దకు వెళ్ళి దక్షిణాతాంబూలమూ ఇచ్చి కూర్చుంటే, ఆ దైవజ్ఞుడు వాళ్ళు వచ్చిన పని

తెలుసుకుని, ఆ పని సానుకూలమయ్యే మార్గం చెప్పేవాడు. ఆయనతో ఒకటే చిక్కు ఆయన చెప్పేది జాగ్రత్తగా విని, సరిగా అర్థంచేసుకోవాలి. సరిగా వినకపోయినా, విన్నది అర్థంకాక ప్రశ్నలు వేసినా ఆయన రౌద్రంగా మండిపడి, అవతలివాడు ఎంతటివాడైనా సరే కోపంతో తూలనాడేవాడు, ఆ తరవాత తాను చెప్పిన దాన్ని వివరంగా తెలియజేసేవాడు.

ఈ కారణంచేత కాస్త అభిమానంగల వాళ్ళు ఆయన దగ్గిరికి వెళ్ళటానికి ఇష్టపడేవారుకారు. పని జరగటం ప్రధానంగా పెట్టుకున్న వాళ్ళు, ఆయనచేత నాలుగు మాటలు పడటానికి సిద్ధమై వెళ్ళేవారు.

రామయ్యకు ఈ దైవజ్ఞుణ్ణి చూసి, తన భార్య ఆరోగ్యం బాగుచేయించుకోవాలన్న ఆలోచన చాలాసార్లు కలిగింది. కాని ఆత్మాభిమాని కావటంచేత ఆయనచేత అవమానం పొందవలసివస్తుందని సంకోచిస్తూ రోజులు గడవనిచ్చాడు. అయితే, తన భార్య జబ్బు తగ్గాలంటే దైవజ్ఞుడి దగ్గరికి పోకతప్పదని రామయ్యకు తోచింది. అందుచేత అతను ఒక మంచిరోజు చూసి, దక్షిణ తాంబూలం చేతబట్టుకుని దైవజ్ఞుడి దగ్గరకెళ్ళాడు.

దైవజ్ఞుడు తెల్లటి గడ్డంతోనూ, మీసాలతోనూ, మంచి తేజస్సుతోనూ రామయ్యకు కనిపించాడు. రామయ్య ఎదురుగా కూర్చోగానే ఆయన, "నీపేరు రామయ్య. నీ భార్య మంచం పట్టింది. అది ఎలా తేరుకుంటుందో తెలుసుకోవాలని వచ్చావు. అహంకారివిరా నువ్వు. మహా దురహంకారివి! ఏమైతేనేం? వచ్చావు. నువ్వు ప్రకృతివిరుద్ధమైన కార్యం చేశావు.. సహజసిద్ధమైన ప్రవాహానికి ఆనకట్ట వేశావు. ఆ ఆనకట్ట తీసెయ్యి. నీ భార్య వ్యాధి నయమవుతుంది. వృధాగా మందులకూ, మాకులకూ ధన వ్యయం చేయకు. నేను చెప్పింది తెలిసిందా?" అన్నాడు. రామయ్య లోలోపల ఆశ్చర్యపడుతూ, తెలిసిందన్నట్టు తల ఆడించాడు. నిజానికి దైవజ్ఞుడు చెప్పినది రామయ్యకేమీ అంతుపట్టలేదు. తెలియలేదంటే

దైవజ్ఞుడు ఇంకెంత అవమానంగా మాట్లాడతాడో అని రామయ్యకు భయంవేసింది. అందుచేత అతను లేచి ఇంటికి వచ్చేశాడు. దైవజ్ఞుడు చెప్పిన మాటలు మననం చేసుకుంటూ ఉంటే రామయ్యకొక సంగతి జ్ఞాపకం వచ్చింది.

రామయ్య బలవంతుడు గనక తన చేను పక్కగా వున్న పంటకాలవకు అడ్డుకట్ట కట్టి కిందటేడు తన పొరుగున ఉన్న కామయ్య చేనుకు నీరు లేకుండా చేశాడు. అందువల్లనే తన భార్యకు జబ్బుచేసిందని దైవజ్ఞుడు. చెప్పినట్టు రామయ్యకు అర్థమయింది. అందుకని రామయ్య కామయ్యను పిలిచి, "చూడు కామయ్యా. ఒక కారణం చేత కిందటేడు నీకు పంటకాలువ నీరందక, నువ్వు ఇబ్బంది పడ్డావు. ఇక ముందు నీ చేనుకు కాలువనీరు అందేటట్టు చేస్తాను." అని మంచిగా చెప్పి పంపేసి, పంట కాలువకు తాను పెట్టిన అడ్డు తన మనుషులచేత తీయించేశాడు.

నీతి : ప్రకృతి విరుద్ధమైన పనులు చేస్తే బాధలు పడక తప్పదు.

90. చూసే దృష్టిని బట్టి పనిపై శ్రద్ధ


ఒక బాటసారి వెళ్తున్నాడు. కొంత దూరం వెళ్ళాక ఒక కొండ వచ్చింది. అక్కడ కొందరు కూలీలు కొండ క్రింద నుండి కొండపైకి వస్తువులను మోస్తున్నారు. బాటసారి 'మీరు ఇక్కడ ఏమి చేస్తున్నారు! అనడిగాడు. ఆ కూలీలు విసుగుతో చెప్పారు. 'మేం కూలీలం కాబట్టి రాత్రిబవళ్లు పని చేయాల్సిందే. లేకపోతే మాకు తిండి ఉండదు. కొండపైన ఏం చేయబోతున్నారో మాకు అవసరం లేదు. ఈ వస్తువుల్ని కొండపైకి చేర్చమన్నారు. అదే మా పని. తర్వాతి పనితో మాకు సంబంధం లేదు.

బాటసారి మళ్ళీ బయల్దేరాడు. ఇంకొంత దూరం వెళ్ళాక మళ్ళీ ఒక కొండ కన్పించింది. అక్కడ కూలీలు పనిచేస్తూ కన్పించారు. వాళ్ళు చాలా

ఉత్సాహంగా ఉన్నారు. మీరేం చేస్తున్నారనడిగితే వారు 'మేం కూలీలం. కొండపైన భవ్యమైన దేవాలయం కట్టబోతున్నారు. దానికి అవసరమైన వస్తువుల్ని కొండపైకి చేరుస్తు న్నాము. మీరు వచ్చిన దారిలో మీకు మనుషులెవరూ కన్పించి ఉండరు. అదే మందిరం పూర్తయిన తర్వాతైతే మనుషుల రాకపోకలతో ఈ దారి కళకళ లాడుతుంది' అని అన్నారు.

మొదటి కొండ వద్ద కన్పించిన కూలీలు పనిచేస్తున్నారేగానీ ఆ పని పట్ల వారికుండాల్సిన ప్రేరణ లేదు. యాంత్రికంగా తమకు చెప్పబడిన పని మాత్రమే చేస్తున్నారు. కానీ రెండవ కొండ వద్ద కన్పించిన కూలీలు తాము చేస్తున్న పని పట్ల ప్రేరణ కల్గి ఉండటంతో ఉత్సాహంగా ఉన్నారు. ఇద్దరు కూలీలకు జీతాలు ఒకటే కాని ఏ కూలీల కళ్ళకైతే కొండపై దేవాలయం లీలగా కన్పిస్తోందో వారు మాత్రమే ఉత్సాహంతో పని చేస్తున్నారు. చేస్తారు కూడా.

91. మంచి చేస్తే మరకపోతుందా?



ఒక కుటుంబంలో తల్లిదండ్రులు ఎంత చెప్పినా కొడుకు రోజూ ఏదో ఒక తప్పు చేసేవాడు. దాంతో విసిగిపోయిన తండ్రి తన కొడుకు చెడు పని చేసినప్పుడల్లా ఒక మేకు చొప్పున తలుపుకు కొట్టడం మొదలుపెట్టాడు. ఆ విధంగా కొన్నాళ్ళకు తలుపంతా మేకులతో నిండిపోయింది. అది చూసిన కొడుకు 'నాన్నా! ఎందుకిలా మేకులు కొట్టావు తలుపుకు' అని అడిగాడు. "నీవు చేసే ప్రతి చెడు పనికి ఒక్కో మేకు కొడుతూ వచ్చా. మేకులతో తలుపంతా నిండిపోయింది' అన్నాడు తండ్రి. 'అయితే నేనిన్ని చెడుపనులు చేశానా? అన్నాడా కొడుకు.

అవుననగానే మరి ఈ మేకులు తీసివేయాలంటే? అనడిగాడు. కొడుకు, 'నీవు చేసే ఒక్కో మంచి పనికీ ఒక్కో మేకు తీస్తానన్నాడు తండ్రి' అప్పటి నుండి కొడుకు రోజూ ఒక మంచి పనిచేస్తుండటంతో తండ్రి మేకులను తొలగించటం ప్రారంభించాడు. కొన్నాళ్ళకు మేకులన్నీ తీసివేయబడి ఉండటం చూసి కొడుకు తండ్రితో 'నేను మంచి పనులు చేశాను కాబట్టి నేను మంచి వాణ్ణయినాను కదా!' అన్నాడు. 'చూడు బాబూ! నీవు మంచి పనులు చేశావు కాబట్టే మేకులు తీసేశా కానీ...ఆ తలుపునొకసారి గమనించు.

నీకేం కన్పిస్తున్నాయో' అన్నాడు తండ్రి. 'అన్నీ గుంటలు' జవాబిచ్చాడు కొడుకు. తండ్రి 'అదే బాబూ! మనిషి తప్పు అనేది చేయకుండానే ఉండాలి. ముందు తప్పులు చేసి తరువాత ఎన్ని మంచి పనులు చేసినా మొదటచేసిన తప్పుల మరకలు. జీవితమంతా ఉంటాయి. వాటి నెవరూ చెరపలేరు' అన్నాడు. కొడుకు తలదించుకున్నాడు.

92. రూపం మారితే మనసు మారుతుందా

ఒక ఋషి తపస్సు చేస్తున్నాడు. ఒక రోజు కళ్ళు తెరిచేసరికి ఎదురుగా ఒక ఎలుక భయంతో వణుకుతుండడం చూశాడు. ఎలుక ఎందుకు భయపడ్తున్నదోనని. చుట్టూ చూశాడు. ఆయన వెనుక ఒక పిల్లి ఉండటం చూశాడు. ఎలుకకు సహాయం చేయాలని తన తపశక్తితో దాన్ని పిల్లిగా మార్చాడు. ఇక దానికి భయముండదనుకొని కళ్ళు మూసుకున్నాడు.

మర్నాడు కళ్ళు తెరిచి చూస్తే తను పిల్లిగా మార్చిన ఎలుక వణుకుతోంది.. పరికించి చూస్తే తన వెనుక కుక్క నిలచి ఉంది. దాంతో పిల్లిని కుక్కగా మార్చాడు. మర్నాడు మళ్ళీ కళ్ళు తెరచి చూస్తే కుక్క వణుకుతోంది. అందుకు కారణం పులి అని తెలుసుకొని కుక్కను పులిగా మార్చాడు. మర్నాడు కళ్ళు తెరిచేటప్పటికి

పులి వణుకుతోంది. పులి సైతం భయపడేంత భయపపెడుతున్న మృగం ఏమిటా అని చుట్టూ చూశాడు. అక్కడ పిల్లి నిలుచుని ఉంది. కారణం ఏమిటో ఋషికి తెలిసిపోయింది. మొదట ఎలుకగా ఉంది. ఒక్కొక్క దశగా పరిణామం చెంది ఇప్పుడు పులిగా ఉంది. వాస్తవమే. అయినా దాని రూపం మారిందే తప్ప మనస్సు మాత్రం అలాగే ఉంది. అది రూపంలో పులి అయినా మనస్సు రీత్యా ఎలుకే, అందుకే అది ఎదుటనున్న పిల్లిని చూసి భయపడుతోంది. ఋషి, పులిని మళ్ళీ ఎలుకుగా మార్చి.. పిల్లి చేతిలో చిక్కకుండా పంపేశాడు.

93. దైవానుగ్రహం

ఒక ధనికుడు తన మరణశయ్యపై ఉండగా తన ఆస్తిని ముగ్గురు కొడుకులకు పంచుతూ వీలునామా వ్రాశాడు. ఆ తర్వాత చనిపోయాడు. అతని అంత్యక్రియల అనంతరం వీలునామా చూస్తే దానిలో వారి తండ్రి తనకు గల 17 ఏనుగులను కొడుకులకు పంచుతూ, పెద్ద కుమారునికి 1/2వ వంతు, రెండవ వాడికి 1/3వ వంతు, మూడవ కుమారుడికి 1/9వ వంతు రావాలని వ్రాసి ఉంది. 17 ఏనుగులను ఆవిధంగా పంచడం కుదరదు. అందుకు వారు కలహించు కుంటున్నారు. ఆ దేశపు రాజు తన ఏనుగెక్కి ఆ దోవనపోతూ వీరి దగ్గరికొచ్చాడు. వీరి సమస్యను సావధానంగా విన్నాడు. రాజు తన ఏనుగును తెచ్చి వీటితో కలిపాడు. అపుడు 18 ఏనుగులైనాయి. వీలునామా ప్రకారం వాటిని పంచుకోమన్నాడు.

పెద్ద కుమారునికి 1/2వ వంతు అంటే 9 ఏనుగులు, రెండవ వాడికి 1/3వ వంతు అంటే 6 ఏనుగులు, మూడవ కుమారుడికి 1/9వ వంతు అంటే 2 ఏనుగులు వచ్చాయి. ఇలా 9+6+2=17. ఏనుగులు సరిపోగా రాజుగారి ఏనుగు మిగిలిపోయింది. రాజు దాన్ని ఎక్కి వెళ్ళిపోయాడు. జీవితంలో మనకొచ్చే

చిక్కు సమస్యలిలాంటివే. వాటిని పరిష్కరించు కోవడానికి రాజుగారి ఏనుగు కావాలి, అదే దైవానుగ్రహం.

94. కష్టపడేవారికి విజయం తథ్యం

పార్వతీ పరమేశ్వరులు ఆకాశమార్గాన వెళ్తుండగా ఒక రైతు తన పొలంలో



విత్తనాలు చల్లుతూ కన్పించాడు. వెంటనే వాళ్ళిద్దరూ భూమిమీద కొచ్చారు. వర్షం వచ్చే అవకాశం లేదు. మరి విత్తనాలు ఎలా మొలకెత్తుతాయి?' అన్నాడు శివుడు. ఈ రాత్రికి వర్షం వస్తుందన్నాడు రైతు. ఆ విషయంలో వాదన కల్గింది. ఎవరి మాట నిజమవుతుందో ఈ రాత్రికి తెలుస్తుంది అన్నాడు రైతు.

శివుడు వర్షాధిపతి అయిన ఇంద్రుడి వద్దకెళ్ళి వర్షం రాకుండా చూడమన్నాడు. 'అది నావల్ల కాదు. కప్పలు బెకబెకలాడితే మాత్రం వర్షం పడేట్టు చూడాల్సిందే' అన్నాడు. శివుడు కప్పల వద్దకెళ్ళి వాటిని బేకబేకలాడవద్దన్నాడు. 'అది మావల్ల కాదు. మిణుగురు పురుగులు గనుక ఎగిరితే మేం బెకబెకలాడాల్సి వస్తుంది' అన్నాయి కప్పలు. శివుడు మిణుగురు పురుగుల దగ్గరికెళ్ళి వాటిని ఎగురవద్దని కోరాడు. అవి సరేనన్నాయి. రాత్రి కాగానే వర్షం మొదలైంది. శివుడికి కోపం వచ్చింది. సంగతి కనుక్కోవటానికి బయల్దేరాడు. ఇంద్రుడిని కలవగానే 'కప్పలు బెకబెకలాడాయి. దాంతో నేను వర్షం కురిపించాల్సి వచ్చింది' అన్నాడు. శివుడు కప్పల దగ్గరికెళ్ళాడు. 'మిణుగురు పురుగులు ఎగిరాయి దాంతో మేం బెకబెక మనాల్సి వచ్చింది' అన్నాయవి. శివుడు మిణుగురు పురుగులను

కలవగా అవి ఎగరలేదన్నాయి. చివరికి సంగతేమిటో పరిశీలిద్దామని శివుడు పొలం దగ్గరకెళ్ళాడు.

అక్కడ పొలంలోని చెట్టుకింద మినుకుమంటూ వెలుతురు కన్పించింది. మరింత దగ్గరగా వెళ్ళి చూస్తే రైతు ఒక మండుతున్న చిన్న పుల్లను పట్టుకొని విత్తనాలు చల్లుతున్నాడు. అంటే మండుతున్న పుల్లను చూసి కప్పలు మిణుగురు పురుగులు అనుకొని బెకబెకలాడాయన్నమాట. శివుడు తన ఓటమిని రైతుముందు అంగీకరించి కైలాసం వెళ్ళిపోయాడు. కష్టపడి పనిచేసే వ్యక్తికి విజయం లభించకుండా, చివరికి దేవుడు కూడా అడ్డుకోలేడు.

95. ప్రపంచ రీతి

అనగనగా ఓ రాజ్యం, ఆ రాజ్యానికి ఓ రాజు ఉన్నాడు. ఆ రాజ్యం పొలిమేరల్లో ఉన్న అడవిలో ఓ గొప్ప తపస్వి ఆశ్రమం కట్టుకున్నాడని రాజుకు తెలిసింది. ఓ రాత్రి. ఆ తపస్వి ఆశ్రమంలో గడపాలన్న కోరిక రాజుకు కలిగింది. తపస్వి అనుమతి కోసం రాజు, తన మంత్రిని ఆ తపస్వి ఆశ్రమానికి పంపాడు. రాజు కోరిక విని తపస్వి నవ్వి అనుమతినిచ్చాడు. అంత దూరం నుంచి వచ్చిన మంత్రి బడలిక తీరేందుకు పాలు ఇచ్చాడు తాగమని. పాల రుచి మంత్రిని ఆశ్చర్యపరిచింది. తపస్వి ప్రత్యక్షంగా ప్రేమతో పెంచుతున్న ఆవు నుండి తీసిన పాలు అవి అని తెలుసుకున్నాడు మంత్రి. మరుసటి రోజు రాజు ఆశ్రమానికి వచ్చినప్పుడు ఆ ఆవు పాలు రాజుకు ఇమ్మని ఆ తపస్వి శిష్యులకు ప్రత్యక్షంగా పురమాయించాడు మంత్రి. కానీ ఆ రోజు పాల రుచి అద్భుతంగా అనిపించలేదు సరికదా, మామూలుగా ఉన్నాయి పాలు. 'నిన్న ఈ పాలు తాగి ఆవును కొనేద్దామనుకున్నాను. ధర ఎంతైనా పరవాలేదనుకున్నాను. కానీ ఇప్పుడు పాలు తాగిన తరువాత తొందరపడనందుకు సంతోషిస్తున్నాను' అన్నాడు మంత్రి, రాజుతో

సమయం చిక్కగానే. దానికి రాజు నవ్వి సమాధానం ఇచ్చాడు. 'పాల రుచి నిన్న, ఇవాళ ఒకటే. తేడా నీ అనుభూతిలో ఉంది. నిన్న అలసిపోయి వచ్చావు. పాల రుచి అద్భుతంగా ఉంది. ఇవాళ్ళ అద్భుతమైన రుచిని ఊహిస్తూ వచ్చావు. పాల రుచి మామూలుగా ఉంది. ప్రపంచరీతి ఇది. అందుకే నువ్వు దృష్టిని, అనుభూతిని, మనస్సు స్థితిని బట్టి మారే పాల రుచిపై కాదు, ఎన్నటికీ మారని శాశ్వతసత్యాలను తెలిపే తపస్వి మాటలపై ఉంచాలి."

96. దృష్టిని బట్టి ప్రపంచం

అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యం సరిహద్దు వద్ద ఓ చెట్టు కింద ఓ ముసలాయన కూర్చుని ఉన్నాడు. ఇంతలో మరో ముసలాయన ఆ దారిన పోతూ చెట్టు దగ్గరకు వచ్చి ఆగి, కూచున్న ముసలాయనను చూసి నవ్వాడు. 'నువ్వెన్ని వేషాలు వేసినా నేను గుర్తు పట్టేశానులే. సాధువు వేషంలో ఉన్న గూఢచారివని నేను గ్రహించాను. గూఢచారిని గూఢచారే పసిగట్టగలడు' అని నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

కాస్సేపటికి గుర్రం మీద ఓ వ్యక్తి వచ్చాడు. 'దొంగతనం చేసేందుకు మంచి వేషమే వేశావు. నేనూ దొంగనే. పొరుగు రాజ్యంలో దొంగతనం చేసి ఈ రాజ్యంలో తల దాచుకుంటున్నాను. నాతో వస్తావా? ఇద్దరం కలిసి దొంగతనాలు చేయవచ్చు' అని అడిగాడు. కాని ముసలాయన ఏమీ మాట్లాడకపోవటంతో, తన దారిన తాను వెళ్ళిపోయాడు. ఇంకాస్సేపటికి ఊగుతూ, తూగుతూ ఓ వ్యక్తి వచ్చి చెట్టు కింది ముసలాయన వైపు చూశాడు.

'నువ్వు నాలాగే హద్దు దాటి తాగావా? మంచిది. నీ కన్నా ఎక్కువ తాగినా నేను చూడు. ఎంత నిశ్చలంగా ఉన్నానో, నువ్వు చూడు. తాగి పడిపోయావు' అని పెద్దగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. సాయంత్రమవుతుండగా ఓ యువకుడు

ఆ దారిన వచ్చాడు. ఆ సాధువు ముందు మోకరిల్లి 'స్వామీ... ఇది అడవి. రాత్రి ఇక్కడ ఉండటం ప్రమాదకరం. కాబట్టి ఈ రాత్రికి నా ఇంట్లో ఆతిథ్యం స్వీకరించండి' అని బ్రతిమిలాడాడు. ఆ సాధువు చిరునవ్వుతో అంగీకరించాడు.

ప్రపంచరీతిని, ప్రపంచం మనిషికి కనిపించే విధానాన్ని ఈ కథ ఎంతో సున్నితంగా ప్రదర్శిస్తుంది. అక్కడ కూచున్నది ఒకే మనిషి, కానీ దొంగకు దొంగలాగా, తాగుబోతుకు తాగినవాడిలాగా, గూఢచారికి గూఢచారిలాగా, ఇంకొకరికి సాధువులాగా కనిపించాడు.

ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు? ఈ విషయం ఆ వ్యక్తికే తెలుస్తుంది. అందుకే అంటారు. పెద్దలు 'మన దృష్టి ఎలాగుంటే ప్రపంచం అలా కనిపిస్తుం'దని, మనం చూసే దృష్టిని మన మనస్సు నిర్దేశిస్తుంది. మనసులో ఉన్న భావం మెదడును ప్రభావితం చేస్తుంది. కంటి ద్వారా మెదడు ప్రపంచాన్ని మనసుకు నచ్చిన రంగులతో చూస్తుంది. చూపిస్తుంది.

మనం మనకు పరిచయమైన అనేకులలో ఒక విషయం గమనిస్తాం. అదేమిటంటే, మనకు సాధారణంగా కనిపించే విషయాలు, ఎదుటివారికి జీవన్మరణ సమస్యల్లా అనిపిస్తూంటాయి. పరీక్షలు వస్తున్నాయంటే, తల్లిదండ్రులు ఉద్యోగాలకు సెలవులు పెట్టి మరీ పిల్లల్ని చదివిస్తుంటారు. ఎంతో ఉద్విగ్నతకు గురవుతుంటారు.

పిల్లవాడిని కదలనీయరు, మెదలనీయరు. ఇరవై నాలుగు గంటలూ చదవమని ఒత్తిడి చేస్తుంటారు. ఇదంతా చూసేవారికి హాస్యాస్పదంగా ఉంటుంది. 'ఎల్కేజీ పరీక్షకు ఇంత హైరానా పడతారా?' అని హేళన చేస్తాం. కానీ అదే పరిస్థితిలో మనం ఉంటే అంత కన్నా ఎక్కువగా ఆందోళన చెందుతాం. ఇది పిల్లల పరీక్షలకే కాదు, నిత్యజీవితంలో ప్రతి అంశంలోనూ మనం చూడవచ్చు.

97. తాయెత్తు మహిమ

చత్రపురంలో నలుగురు స్నేహితులుండేవారు. వాళ్ళకు బీదరికంవల్ల జీవనం. గడపటం చాల కష్టంగా వుండేది. ఆ నలుగురు ఒకచోట చేరి తమ జీవితాల్ని ఏ విధంగా సుసంపన్నం చేసుకోవాలో ఆలోచించారు. వారు అతి తీవ్రమైన నిష్టతో కాళీమాతను ఆరాధించారు.



కాళీమాత వారి పూజలకు సంతసించి వారికి ప్రత్యక్షమై "మీకు ఏమి కావాలి?" అని ప్రశ్నించింది. "మాకు భోగభాగ్యాలు, సౌభాగ్యాన్ని ప్రసాదించు తల్లీ" అని కోరుకున్నారు. కాళీమాత ఆ నలుగురికి ఒక్కొక్క తాయెత్తు ఇచ్చింది. "ఈ తాయెత్తును మీ తలలమీద వుంచుకొని ఉత్తర దిశగా వెళ్ళండి. ఆ తాయెత్తు మీ తలమీద నుండి కిందపడినచోట నేలను తవ్వండి. అక్కడ ఏమి అది తీసుకొని పోండి" అని చెప్పింది.

ఆ నలుగురూ కాళీమాత చెప్పిన ప్రకారం నడువసాగారు. కొంత దూరం పోయాక మొదటి వాని తలమీద నుండి తాయెత్తు కిందపడింది. ఆ ప్రదేశాన్ని అతడు తవ్వగా పెద్ద రాగి గని కనపడింది. తనకు ఆ నిధి చాలునని చెప్పి, ఆ నిధిని తవ్వి తీసుకపోయాడు మొదటివాడు. కొంతదూరం పోయాక రెండవవాని తలమీది తాయత్తు కింద పడింది. అక్కడ తవ్వగా బోలెడంత వెండి దొరికింది. దాంతో తృప్తిపడి రెండవవాడు వెళ్ళిపోయాడు. మిగతా ఇద్దరు నడుస్తుండగా మూడవ వాని తలనుండి తాయెత్తు పడింది. అక్కడ తవ్వగా బంగారం దొరికింది. అప్పుడతడు. నాల్గవ వానితో "మనం ఇక ముందుకు వెళ్ళవద్దు. ఈ బంగారాన్ని సమంగా పంచుకొని హాయిగా జీవిద్దాము" అని అన్నాడు. కాని నాల్గవవాడు తనకు బంగారంకంటే ఇంకా విలువైనది దొరుకుతుందనే ఆశతో అతని మాటలు పెడచెవిన పెట్టి ముందుకు సాగాడు.

ఇంకోచోట వాని తాయెత్తు కూడా కిందపడింది. అతనక్కడ తవ్వగా ఇనుము లభించింది. తన స్నేహితుని మాట విననందుకు ప్రశ్చాత్తాపపడి ఆ బంగారమే ఇద్దరం పంచుకుందామని వెనక్కు వెళ్ళాడు. కాని అక్కడ తన స్నేహితుడు కనపడలేదు. అందుకు చింతించి ఇనుము దొరికిన చోటుకు తిరిగి వచ్చాడు. అయితే అక్కడి ఇనుము కూడా మాయమైపోయింది. ఇక ఏ దారిలేక ఇంటి ముఖం పట్టి బిక్షమెత్తుకొని బతకటం మొదలుపెట్టాడు. ప్రాణస్నేహితుల సలహా పాటించడం మంచిది.

98. నక్కపాయసం - కొంగ చేపల పులుసు

ఒకానొక చిట్టడవిలోని జంతువులన్నీ ఎంతో స్నేహంగా ఉండేవి. ఆ అడవిలోకి కొత్తగా వచ్చిన నక్కతో ఏవీ మాట్లాడేవికాదు. ఒకరోజు న చెరువుకు వెళ్లి అక్కడ చేపలు పట్టడానికి ప్రయత్నిస్తున్న కొంగతో మాటలు కలిపి తన ఇంటికి ఆహ్వానించింది. దాన్ని బుట్టలో వేసుకుంటే దానిద్వారా మిగతా జంతువులతో పరిచయం పెంచుకోవచ్చు అనుకుంది. నక్క మాటలకు బోల్తాపడిన కొంగ ఒకరోజు దాని ఇంటికి వెళ్లింది.

కొంగను ఇంటికయితే పిలిచింది. కానీ దానికి తిండి పెట్టడానికి నక్కకు మనసు రాలేదు. దాంతో ఎంతో రుచిగా వండిన వేడివేడి పాయసాన్ని రెండు పళ్లేల్లో పోసి ఒకటి కొంగ ముందు పెట్టింది. పెద్ద ముక్కుతో పళ్లెంలోని పాయసాన్ని తినడం కొంగకు అసలు చేతకాలేదు, నక్క మాత్రం తన పళ్లెంలోని పాయసాన్ని లొట్టలేసుకుంటూ నాకినాకి తినేసింది. దాని పాడుబుద్ధిని అర్థంచేసుకుని 'నీ అతిథి మర్యాదలు నాకెంతో నచ్చాయి. రేపు మా ఇంటికి తప్పకుండా భోజనానికి రావాలి' అంటూ ఆహ్వానించింది.

నక్క ఆ మర్నాడే కొంగ ఇంటికి వెళ్లింది. 'నీకోసం నిద్రలేవగానే చెరువుకి

వెళ్లి, చేపలు పట్టి ఎంతో రుచిగా చేపలపులుసు వండాను. ఒక్కసారి తిన్నావంటే జీవితాంతం ఆ రుచిని మరిచిపోలేవు' అని ఊరిస్తూ వేడివేడి పులుసును రెండు కూజాల్లో పోసి ఒకటి నక్క ముందు పెట్టింది. ఘుమఘుమలాడే చేపలపులుసు నోరూరిస్తున్నా సన్నని కూజాలోకి మూతి దూరకపోవడంతో తినలేకపోయింది నక్క మరోవైపు కొంగేమో తన కూజాలోంచి ఒక్కో చేపనూ ముక్కుతో తీసుకుని ఆహా ఓహో అంటూ తినసాగింది. ఆకలితో కడుపు నకనకలాడుతున్నా 'నాకు ఆకలిగా లేదు' అని చెప్పి వెనుతిరిగిన నక్కను చూసి 'కుక్క కాటుకు చెప్పుదెబ్బ అంటే ఇదే "నక్కబావా' అంటూ నవ్వుకుంది కొంగ.

నీతి : మోసం చేస్తే తిరిగి మోసానికి గురవ్వక తప్పదు.

99. ఉప్పు మూట - పత్తి మూట

ఒక వ్యక్తి ఉప్పు వ్యాపారం చేసేవాడు. అతని దగ్గర ఒక గాడిద ఉండేది. అతను చాలా మంచివాడు. నిజాయితీపరుడు, దయగలవాడు. అతని గాడిద మాత్రం చాలా బద్ధకం కలది. ఎప్పటికప్పుడు పని తప్పించుకుంటూ ఉండేది.

ఒక రోజు ఉప్పు మూటలతో ఇంటికి తిరిగి వస్తుండగా గాడిదకు తట్టు తగిలి దాని మీదున్న ఉప్పు మూటలతో సహా నీటిలో పడిపోతుంది. ఉప్పంతా కరిగిపోతుంది. బరువు తగ్గిపోతుంది. అది గమనించిన గాడిద రోజు అక్కడికి రాగానే పడిపోయేది. దీనిని గమనించిన అతను దానిపై పత్తి మూటను ఉంచుతాడు. మూటలు మార్చిన సంగతి తెలియక అక్కడికి రాగానే యథావిధిగా నీటిలో పడిపోతుంది. నీటిలో తడిసిన పత్తి మూటలు బరువు పెరగడంతో గాడిద పైకి లేవలేకపోతుంది. దాని తప్పు తెలుసుకొని గాడిద నిజాయితీగా పని చేయడం మొదలు పెడుతుంది.

100. రాజ్యార్హత

పూర్వం మణిశిలరాజ్యాన్ని ఏలిన జగన్మిత్ర మహారాజుకు ఇద్దరు భార్యలు, కాని సంతానంలేదు. ముసలితనం పైన పడుతూండటం చూసి మహారాజు ఒక కుమారుణ్ణి దత్తత చేసుకుని వాడికి రాజ్యాభిషేకం చేద్దామని నిశ్చయించాడు.

ఈ సంగతి తెలియగానే రాజు భార్యలు తమవైపు బంధువులలో నుంచి చెరొక యువకుణ్ణి పిలిపించి, తన బంధువునే దత్తత చేసుకోవాలని పట్టుబట్టారు. ఏ భార్య మాటా తీసెయ్యలేక రాజు తన మంత్రిని సలహా అడిగాడు. ఇద్దరు కుర్రవాళ్ళనూ కొంతకాలం దగ్గర ఉంచుకుని చూస్తే వారిలో ఎవరు యోగ్యుడో తెలిసిపోతుంది అన్నాడు మంత్రి. తరువాత మంత్రి, పెద్దరాణి బంధువైన పద్మమిత్రుడనే యువకుడితో, “బాబూ, రాజుగారు ఏనాడైనా మిమ్మల్ని దత్తత చేసుకుని రాజ్యాభిషేకం చెయ్యవచ్చు. రెండువారాలపాటు రాజ్యమంతా చుట్టి రండి,” అని అతనికొక రథమూ, చాలినంత డబ్బూ ఇచ్చిపంపాడు.

పద్మమిత్రుడు పడమటిదిక్కుగా బయలుదేరి కొంతదూరం ప్రయాణంచేసి “నల్లబండ” అనే స్థలానికి వచ్చేసరికి బందిపోటు దొంగలు అతన్ని చుట్టుముట్టి పట్టుకున్నారు. వాళ్ళు అతని దగ్గర ఉన్న ధనమూ, అతని ఒంటిమీద ఉన్న నగలూ కాజేసి, “ఎవరు నువ్వు ? ఎక్కడి నుంచి వస్తున్నావు ? ఎక్కడికి పోతున్నావు? నిజం చెప్పు, లేకపోతే చంపేస్తాం,” అని బెదిరించారు. పద్మమిత్రుడు భయపడి, వాళ్ళను మంచి చేసుకుందామనే ఉద్దేశంతో, “నేను మణిశిల రాజ్యానికి కాబోయే రాజును. నన్నిప్పుడు వదిలిపెట్టారంటే నేను రాజునయ్యాక మీకు మంచి విలువగల బహుమానాలిస్తాను,” అన్నాడు. అతడు రాజు కాబోతాడని తెలియగానే దొంగలు అతనిమూలంగా చాలా డబ్బు సంపాదించుకోవచ్చునని తెలుసుకున్నారు.

“ఇప్పుడున్న రాజుకు ఒక ఉత్తరం రాయి. నిన్ను దొంగలు పట్టుకున్నారనీ, పదివేల రూపాయలు తెచ్చి నల్లబండ దగ్గిర మా మనిషికిస్తేగాని నిన్ను వదలరనీ,

అదైనా నాలుగురోజుల లోపల జరగకపోతే నిన్ను చంపేస్తారనీ, డబ్బు తెచ్చే మనిషి నిరాయుధుడుగా రావాలనీ, డబ్బు తీసుకోవటానికి వచ్చేవాణ్ణి పట్టుకోవటానికి ప్రయత్నం జరిగినా నీ ప్రాణాలు దక్కవనీ రాయి," అన్నారు దొంగలు. అలా పద్మమిత్రుడి చేత ఉత్తరం రాయించి, దొంగలు అతని కళ్ళకు గంతలు కట్టి కొండలమధ్య ఉండే గుహకు అతన్ని తీసుకుపోయారు. పద్మమిత్రుడు రాసిన ఉత్తరం చదవగానే రాజు కంగారుపడ్డాడు. డబ్బుకోసం వెనకాడవద్దనీ, తన బంధువు ప్రాణాలు కాపాడమనీ పెద్దరాణి ఏడిచింది. ఒక నిరాయుధుడి ద్వారా రాజు నల్లబండ వద్దకు దొంగలడిగిన పదివేలరూపాయలూ పంపాడు.

అక్కడ దానికోసం వేచివున్న దొంగ డబ్బు తీసుకుని, రాజుగారి మనిషిని అక్కడే ఉండమని, తమ గుహకు వెళ్ళి, పద్మమిత్రుడి కళ్ళకు గంతలు కట్టి తీసుకువచ్చి నల్లబండ దగ్గిర వదిలేసి, తిరిగి అరణ్యంలోకి వెళ్ళిపోయారు.

పద్మమిత్రుడు రాజభవనానికి తిరిగివచ్చి రాజ్యాన్నీ, దొంగలనూ నానా తిట్లు తిట్టాడు. జరిగినదంతా విన్నవాళ్ళలో చిన్నరాణి బంధువు పుష్పమిత్రుడు ఉన్నాడు. అతను పద్మమిత్రుణ్ణి, "దొంగలుండే గుహకు

సైనికులను తీసుకుపోతే వాళ్ళను హతమార్చవచ్చునే. ఆ పని చెయ్యలేవా? దొంగలెంతమంది ఉన్నారు ?" అని అడిగాడు. "నన్ను కళ్ళుకట్టి తీసుకుపోయారు. వాళ్ళ గుహ ఎక్కడో, దొంగలెంతమంది ఉన్నారో ఎట్లా తెలుస్తుంది ?" అన్నాడు పద్మమిత్రుడు చిరాకుగా. "ఈ దొంగలను నేను పడతాను. నాక్కూడా ఒక రథమూ, కొంత డబ్బూ ఇప్పించండి," అన్నాడు పుష్పమిత్రుడు మంత్రితో.


అతను తాను చేయదలిచినదంతా మంత్రికి వివరంగా చెప్పాడు. పుష్పమిత్రుడు రథంలో బయలుదేరి తిన్నగా నల్లబండ వద్దకే వచ్చి అక్కడ రథం ఆపించాడు. వెంటనే అయిదారుగురు దొంగలు అతన్ని చుట్టుముట్టి, "నీ దగ్గర ఉన్నదంతా ఇచ్చెయ్యి !" అన్నారు. "నేను డబ్బు తెచ్చింది వచ్చింది మీకోసమే.


మీకు కొంచెం కూడా బుద్ధిలేదు. రాజు కాబోయేవాడి దగ్గర అంత కొద్ది డబ్బు పుచ్చుకుంటారా ? నన్ను కాదని ముసలిరాజు ఆ పద్మమిత్రుణ్ణి దత్తత చేసుకుంటున్నాడు. పద్మమిత్రుడి ద్వారా మనం లక్షలు సంపాదించవచ్చు. మీ రహస్య స్థలానికి పోదాం పదండి," అన్నాడు పుష్పమిత్రుడు. అతను తన రథం తోలేవాడికి, "ఒరే నువ్విక్కడే ఉండి రాజభటులెవరైనా వస్తున్న జాడ కనిపిస్తే శంఖం ఊదు," అని చెప్పాడు. దొంగలు పుష్పమిత్రుణ్ణి నమ్మి, అతన్ని తమ గుహకు వెంటబెట్టుకుపోయారు. ముందుగానే తన కర్తవ్యం తెలుసుకుని ఉన్న . రథసారధి దొంగలకు కొంచెం వెనకగా వెంబడిస్తూ వాళ్ళ గుహదాకా వెళ్ళి, దొంగలు పుష్పమిత్రుడితో సహా గుహలోకి ప్రవేశించగానే వెనక్కు తిరిగి వెళ్ళి, తన రథాన్ని అతివేగంగా నగరానికి తోలుకుపోయాడు. పుష్పమిత్రుడు దొంగలను అతి సులువుగా తన మాయలో వేసుకున్నాడు.

"ఇంక మీరీ గుహ వదిలిపెట్టి మరొకచోటికి వెళ్ళాలి. ఆ. పద్మమిత్రుడు ఉద్దండుడు. కళ్ళకు గంతలు కట్టినా వాడు మీ గుహకు దారీ తెలుసుకున్నాడు. ఎన్ని అడుగులు వేసి ఏదిక్కుగా తిరిగారో, ఎక్కడ ఎక్కారో, ఎక్కడ దిగారో వాడు చక్కగా గుర్తుపెట్టుకున్నాడు. అందుచేత మనం దాగి ఉండటానికి ఇంతకన్న మంచిచోటు చూపిస్తాను. నావెంట రండి," అన్నాడు.


దొంగలు ఆ మాటలు నమ్మారు. వాళ్ళు తమ గుహలో దాచి ఉంచిన ధనం తలా ఒక మూటా నెత్తిన పెట్టుకుని పుష్పమిత్రుడి వెంట బయలుదేరారు. వాళ్ళు కొంతదూరం వచ్చేసరికల్లా రాజభటులు వారిని చుట్టుముట్టారు. ఒక్క దొంగ చేతిలోనూ ఆయుధం లేదు. అందుచేత దొంగలందరూ అవలీలగా పట్టుబడిపోయారు. మంత్రి పుష్పమిత్రుడి సామర్థ్యాన్ని మెచ్చుకుని, అతన్నే దత్తత చేసుకోవటం మంచిదని రాజుగారికి చెప్పాడు. రాజు పుష్పమిత్రుణ్ణి దత్తత చేసుకుని అతనికి రాజ్యాభిషేకం చేశాడు.

నీతి : రాజు కావాలనుకునేవాడికి తెలివి సాహసం ఉండాలి.



VENKAT FOUNDATION
IMPACT
SHARANYA POULTRIES
NATRAJ LODGE
NOKIA
ARKA MARKETING
ARKA AGENCIES
SRI VITTAL AGENCIES
VENKAT AUTOMOTIVES
GS Caltex
BAJAJ
CONVENTION
MEGA IMPACT PROGRAMME - 2023



Inspire
Proud Later


The International Association of Lions Clubs
IMPACT
PMJF Lion Dr Mohan Reddy Yanala
First District Governor
CLUBS
To Org



resident : Lion Karnati Naraya
PMJF Lion Siva Prasad Ch.V.
First Vice District Governor
LIONS CLUBS
INTERNATIONAL


"ఒక గొప్ప మార్పునకు ఇదే శ్రీకారం"
WELCOME
TACT


VENKAT
FOUNDATION
GAMPA VAJRAMMA VIDHY
ASKAR
Gold Medals to 10 GPA SSC Student
Schools)
YOUTH EMPOWERMENT
(Programmes like Impact
HEALTH INITIATIVE
ENVIRONMENTAL IN
WELFARE INITIATIVE
KAT









LABHISHETTY MAHESH

M.Com., M.Phil (M.Sc Psychology)

Author - Trainer - Speaker
Impact Certified Trainer
Life Skils Trainer

LABHISHETTY MAHESH
Learning Motivation

follow me
labhishettymahesh

మీరు మొదటిసారి విజయం సాధించకపోతే మళ్ళీ మళ్ళీ ప్రయత్నించండి అని చెప్తారు.
అంటే దానర్థం, మళ్ళీ అదే పద్ధతిలో ప్రయత్నించమని కాదు.
మీ తప్పేమిటో గురించి, తప్పు సరయ్యే దాకా మరో విధంగా ప్రయత్నించమని..!

INR 200

BlueRose ONE.com DIY
Stories Matter
NewDelhi • London

NON FICTION

ISBN 978-93-5819-375-6
9 789358 193756

www.BlueRoseOne.com